
జ, నవరి 68

జ్యోతి

...సలు



...కడా
...అత్యం
...ం వారం

...25 పైసలు మాత్రమే.

...లైన వివరాలకు :

వారపత్రిక,

ఆఫీసు రోడ్డు, విజయవాడ-2.

"జ్యోతి" సంస్థ నుంచి
రిపబ్లిక్ డే కానుక

●

జనవరి 25 నాటికే జగజ్జేగీయమానంగా వెలువడుతోంది!

జ్యోతి వారపత్రిక

●

ఈనాడు జీవితమే రాజకీయాలతో నిండిపోతోంది. కాంగోలో జరిగినా, కలకత్తాలో జరిగినా రాజకీయ సంఘటనల తరంగాలు తెలుగు దేశపు మూలమూలలకు వ్యాపిస్తున్నాయి. ఆ యా జాతీయ, అంతర్జాతీయ సంఘటనలపై నిశితంగా, నిర్భయంగా, నిష్పాక్షికంగా సమగ్రమైన విమర్శలకు, వివరణలకు ప్రప్రథమ ప్రాధాన్యమిస్తుంది

జ్యోతి వారపత్రిక

●

ఇంకా విద్యారంగం, విజ్ఞాన జగతి, సాహితీ వీథులు, క్రీడాలోకం, చలనచిత్ర విశేషాలు మొదలైన పెక్కు శీర్షికలతో, అత్యంతాకర్షణీయమైన వినూత్న ప్రయోగంగా మీకు వారం వారం దర్శనమిస్తుంది

జ్యోతి వారపత్రిక

●

1/2 డెమ్మీ సైజులో 16 పేజీలు

వెల 25 పైసలు మాత్రమే.

ఏజెన్సీ మొదలైన వివరాలకు :

జ్యోతి వారపత్రిక,

కాంగ్రెసు ఆఫీసు రోడ్డు, విజయవాడ_2.

తొలిమాట

హలో సార్! Jyoti wishes you a happy new year!

□

హార్మోనియంలో హార్మోనీ వుందా లేదా? (17)

□

హాయిగొలిపే హేమంత్ సంగీతానికి ఆర్. ఎం. చల్లాగారి నివాళి (21). వచ్చే సంచికలో జనానికి రాగరంజనం కలిగించిన స్వర్గీయ రోషన్‌పై వి. ఎ. కె. రంగారావుగారి వ్యాసం.

□

63 వ పేజీలో – లోకం మొహాన చెప్పుతో కొట్టిన పిచ్చిదాని కథ. This mad, mad world అన బుద్ధి పుట్టించే ఈ కథతో 'జ్యోతి' పాఠకులకు ఒక కొత్త రచయిత (స్వయంగా డాక్టరు) పరిచయం అవుతున్నారనుకుంటాము.

□

లేనిపోని తద్దినం తెచ్చి పెట్టుకున్న ఒక అమాయకుని హాస్య సంతర్పణ (50)

□

అంతస్తులు మేడలకే కాదు, మనస్సులకూ వుంటాయి (78)

□

ఈ సంచికలో విద్యార్థుల పోటీ కథలలో రెండవ రెండవ బహుమతికి తగిన కథ రాలేదని తెలపడానికి విచారిస్తున్నాము. వచ్చే సంచికలో ఈ శీర్షికపై ఒక ప్రకటన చూడగోరుతాము

సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హాంపేట పోస్టు
విజయవాడ-2

విడిప్రతి వెల
80 పైసలు

ఏడాది చందా
9-50 రూపాయలు

సంపుటి 6
జనవరి 1968
సంచిక 1

మేనేజింగ్ ఎడిటర్
వి. వి. రాఘవయ్య

ముఖచిత్రం :
మంజులా వారి
"నిలువు దోపిడి"లో దృశ్యాలు

వేమల మీనాక్షీదేవిగారి 'కోకిలమ్మ' కథ, పెనుమర్తి సూరిగారి 'ఆరని మంటలు' చదువుచున్నంతసేపు కథలలో లీనమై పోయి బాహ్య ప్రపంచము మరచిపోయితిని. ఆ రెండు కథలు ఈ నెల 'జ్యోతి'కి మణిపూస లనవచ్చును.

— దశిగి వెంకట సావిత్రీదేవి, బరంపురం.

'కోకిలమ్మ' కథ వాస్తవికంగా లేదు. ఆ ఊరిలో పాప తప్పిపోయి, ఆ విషయం ఊరిలోని వారందరికీ తెలిసినా ఆ పాప తాలూకు వారు ఎవ్వరు ఎంత కాలానికి రాకపోయినట్లు కథ వ్రాశారు. అది విచిత్రం. ఇకపోతే పెనుమర్తి సూరిగారి 'ఆరని మంటలు' మా హృదయాల్లో ఆరని కథ.

— సావిరెడ్డి చంద్రరావు, తుని.

'ఆరని మంటలు' కథలో చిట్టి మరణం కళ్ళవెంట నీళ్ళు తెప్పించిందంటే నమ్మండి. 'కిశోర ప్రాయం' సుఖాంతం చేసినందుకు చాలా సంతోషంగా వున్నది.

— కాజ వెంకట సత్యవిమల, నైవేలి.

పొదుపును గురించిన కార్టూన్లూ, మహామహుల ఛలోక్తులూ అద్భుతంగా వున్నాయి. కె. వి. రామచంద్రమూర్తిగారి 'మీ వయస్సు ఎంతో చెప్పనా!' ఆర్. యమ్. చలాగారి 'గాయక శచీంద్ర బర్మన్' శీర్షికలు డిసెంబరు జ్యోతికి ప్ర ్య కాకర్షణలు.

— శేషు, సాంబశివరావ్, చండీఘర్.



బర్మన్ ప్రతిభను గురించి పొగిడితే సంతోషమే. కాని 'ఒక సన్న గొంతుక గాయకుడు' అంటూ బర్మన్‌మీది అభిమానంకొద్దీ, మహా గాయకుడిని, అందునా బాగా ప్రజాదరణ పొందిన వాడిని విమర్శించడం బాగాలేదు.

— డి. ఎస్. శంకర్, పక్కలంక.

'రాగరంజని' శీర్షికలో చలాగారు బర్మన్‌ను గూర్చి వ్రాస్తూ పురుషులలో సైగల్ తప్పిస్తే పాటలలో ఎవ్వరూ నవ్వు ఒప్పించలేదు అని వ్రాశారు. ఆయన 'జగమే మాయ' పాటను మరచిపోయి నట్లున్నారు.

— ఈ. వెంకటరావు, వాల్తేరు.

'రాగరంజని' జ్యోతిలో ఉండదగ్గ శీర్షిక. కొన్ని సందేహాలు :

1. శ్రీ చల్లాగారు చాలాకొద్ది చిత్రాలకే సంగీత దర్శకుడుగా పనిచేసిన అరుణ్‌కుమార్‌కి సంగీత దర్శకుల పట్టికలో తృతీయస్థానం ఎందుకిచ్చారు?

2. గీతాదత్ మొదటి చిత్రం 'దోఖాయ్' కాదు 'భక్తప్రహ్లాద.'

3. గీతా పాటగా ఉదహరించబడిన 'నబదలే హమ్' 'బాజీ'లోనిదీ కాదు, గీతా పాడినదీకాదు. వర్మన్ సంగీతాలంకృతమైన 'అర్మాన్'లో ఆశా పాడినది 'జబ్ దునియా బదల్‌హై ఫిర్ మ్యాన బదలే హమ్' అని దాని ముఖ్‌డా.

4. ఫిలింఫేర్ అవార్డు 'టాక్సీ డ్రైవర్'లోని చక్కని పాట 'జాయేతో జాయే కహాం'కే గాని తకి న అనుకరణ జన్యాలకు కాదనే జ్ఞాపకం. అయినా అది ప్రజా నిర్ణయం కదా!

5. 'సితారోంసే ఆగే'లోని పది పాటలలో ఒకే ఒకటి కొంతగానైనా శాస్త్రీయ రాగాన్ని అనుసరించింది. తక్కినవన్నీ పాశ్చాత్య ధోరణిలో సాగినవే. చల్లాగారి ఉద్దేశంలో మరొక చిత్రం వుండి వుంటుంది. అది యేదో!

6. 'మషాల్' సంగీత దర్శకుడు వర్మన్. అరుణ్‌కుమార్ కాదు. కాని 'జబ్ తుమ్ థే హమారే' పాడినది అతనే.

— వి. ఎ. కె. రంగారావు, మద్రాసు.

రంగారావుగారి లేఖకు జవాబు

1. సంగీత దర్శకుని ఘనత చిత్రాల సంఖ్యపై ఆధారపడి వుండదు. అయినా, అరుణ్‌కుమార్ అనేక బొంబాయిటాకీస్ చిత్రాలకు సహాయ దర్శకుడుగా పనిచేశాడు. కాగా అతను 'పరిణీత'లో కూర్చిన సంగీతం సాధారణులైన ఇతరులు కూర్చిన వేయి చిత్రాల సంగీతం కంటె ఎక్కువగా తూగుతుంది.

2. తప్పు మన్నించాలి.

3. నేను వ్రాసిన 'నబదలే హమ్' అనే పాట 'బాజీ'లోనిదే. గీతాదే. ఆ వాక్యతోనే ప్రారంభమవుతుంది కాని తుది చరణంకాదు. ఈ పాట విషాదకరమైనది, అంత పాప్యులర్ కాము కాబట్టి, వీరికి ఈ సంగతి తెలియకపోవచ్చు. నా శేపులో సినిమా పేరుతోసహా రికార్డు చేసి వుంది. విమర్శకులు మా యింటికి దయచేస్తే వినిపిస్తాను.

4. 'జాయ్‌తో జాయేం కహాం' కూడా స్వచ్ఛమైన దేశీయమూర్ఛన కాదు. నేను ఒహు జనాదరణ విషయం గురించి ఉదాహరించాను.

5. నా ఉద్దేశం 'సితారోంసే ఆగే' గురించే. లతా కోరస్‌తో పాడిన పాట శాస్త్రీయరాగం. మిగతా పాటలు విమర్శకు లన్నట్లు పాశ్చాత్య ధోరణిలో కాక, వంగీయ జాతీయ ధోరణిలో కూర్చినవి.

6. 'మశాల్' గురించి నేను వ్రాసినదే సరి అయినదని నా నమ్మకం. బర్మన్ మట్టుకుకాదు. ఈసారి ఎప్పుడైనా రేడియోలో విని నేను వ్రాసినది తప్పని తేల్లవరకూ నే నిదివరలో మూడుసాలే విన్న 'అరుణ్‌కుమార్' సంగీత దర్శకుడన్న విషయమే సరి అయినదనుటాను.

— ఆర్. ఎం. చల్లా, రాజమండ్రి.

□□□

రాజకీయాలు

1968 కి స్వాగతం!

ఒక సంవత్సరం నిర్గమించింది, మరొక సంవత్సరం ఆగమించింది.

గతించిన సంవత్సరంలోనికి తిరిగి చూస్తే కనిపించేది ప్రశాంత సరోవరం కాదు; సంక్షుభిత సముద్రం. అన్నీ అలలే. అలజడులే! అంతా అల్లకల్లోలమే.

1963 ఇంతకంటె భిన్నంగా వుంటుందా? ఇంతకంటె ఆశాజనకంగా వుంటుందా? నూత్న సంవత్సరం మనకు ఏ కానుకలు తేబోతోంది? లేదా, ఏ అనర్థాలు తేబోతోంది?

స్వతంత్ర భారత చరిత్రలో కనివిని ఎరగనంతటి ఎన్నికల సంరంభంతో 1967 ప్రారంభమైంది. సగం దేశంలో కాంగ్రెసు ప్రభుత్వాలు పడిపోయాయి. మిగతా సగంలో కాంగ్రెసేతర ప్రభుత్వాలు వచ్చాయి.

జనసంఘం, ముస్లింలీగ్ వంటి మతవాద పక్షాలతో మతరహితమని చెప్పుకొనే కమ్యూనిస్టు పార్టీలు చేతులు కలిపాయి. గాంధీమార్గమే తమ ధ్యేయమని చెప్పుకొనే పార్టీలు హింసాత్మక విప్లవాలే శరణ్యమని నమ్మిన అతివాద పక్షాలతో చెట్టాపట్టాలు వేసుకుని నడిచాయి. శాసనసభ్యుల శాఖా చంక్రమణాలతో రాష్ట్ర ప్రభుత్వాలు అస్థిరమైపోయాయి. మూడు రాష్ట్రాలలో కాంగ్రెసేతర పక్షాలు పోయాయి. మరి రెండు నేడా, రేపా అంటున్నాయి.

ఒకనాటి తెలంగాణాను తలపించే నక్సల్‌బారీ, కేరళలో వలంటీర్ల పేరుతో ఒక్కొక్క పార్టీకి ఒక్కొక్క ప్రైవేట్ సైన్యం, పశ్చిమ బెంగాల్‌లో ఘెరావ్‌లు, మొత్తం దేశంలో విద్యార్థుల అల్లర్లు, కార్మికుల సమ్మెలు, పరిశ్రమల లాకౌట్లు, రాజకీయపక్షాల బంద్‌లు, హర్తాళ్‌లు వీధి పోరాటాలు, భాషాందోళన, రామేశ్వరంవద్ద జలప్రళయం, కోయినావద్ద భూకంపం, హిందీ రాష్ట్రాలలో భాషాందోళన — ఎన్ని, ఎన్నని, ఎన్నడం 1367 లో జరిగిన వైపరీత్యాలను?

భవితవ్యం

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో మనం చూస్తుండగా ఎన్ని దేశాలు సైనిక నియంతృత్వాల క్రిందికి పోలేదు? పాకిస్తాన్, ఘనా, ఇండోనీసియా, బర్మా ... ఒకనాడు ప్రపంచానికే ప్రజాస్వామ్యాన్ని ప్రసాదించిన గ్రీసు ...

ఒక్క ఇండియాలో మాత్రమే ఎన్ని యుద్ధాలు, మత కలహాలు, వరదలు, కరువులు, కాటకాలు వచ్చినా, దేశాన్ని సమూలంగా అవినీతి వేరుపురుగువలె దొలిచి వేస్తున్నా, పరిపాలకుల అసమర్థత నిస్పృహ కలిగిస్తున్నా — ఇండియాలో మాత్రం ప్రజాస్వామ్యం చెక్కు చెదరలేదు. ఎన్ని లోపాలున్నా మన పార్లమెంటరీ వ్యవస్థ కనీసం ఆకారమాత్రంగానైనా నిలబడివుంది. మన రాజ్యాంగం అన్ని ఎదురు దెబ్బలను తట్టుకుని సగర్వంగా తలఎత్తుకుని వుంది.

కాని, ఎన్నాళ్ళు అలా నిలబడుతుంది మన ప్రజాస్వామ్యం? దాని నెత్తిపై దెబ్బమీద దెబ్బ పడుతోంది. ఒకవంక చైనాను దేశంలోనికి ఆహ్వానిస్తున్న అతివాదులు, జాతిని వెనక్కి నడిపించటానికి యత్నిస్తున్న జనసంఘం, స్వతంత్ర పార్టీలు, పూర్తిగా నిర్వీర్యమై, నిస్తేజమైపోయిన కాంగ్రెసు, దాని దుర్బల నాయకత్వం, మరొకవంక పాకిస్తాన్, చైనాల ప్రమాదం, ఇంకొకవంక జాతీయ జీవితంపై బిగుసుకుంటున్న అమెరికా కబంధ హస్తాలు, వేరొకవంక ధరలు పెరిగి, ఆహారంవంటి జీవితావసరాలుకూడా తీరని సామాన్యుల దుర్భం యాతనలు, ఆర్థికమాంద్యం — ఇన్ని విధాల నిరాశామయ వాతావరణంలో భారత ప్రజాస్వామ్యం ఎన్నాళ్ళు తలఎత్తుకు నిలబడగలదు?

ప్రజాస్వామ్యం పతనం కావడానికి కావలసిన లక్షణాలన్నీ క్రమంగా మన దేశంలో రాశీభూతం అవుతున్నాయి. మనది సువిశాల దేశమని, మన ప్రజలు యుగయుగాలుగా ప్రశాంత జీవితానికి అలవాటు పడినవారని, బుద్ధుడు, గాంధీజీల అహింసా బోధలు, నెహ్రూ ప్రజాస్వామ్యమార్గం మనలో జితించిపోయాయని, మన సైన్యం దేశభక్తి ప్రపూరితమని ఔదాసీన్యం వహించి లాభంలేదు. స్వాతంత్ర్యానికి మనం చెల్లించవలసిన మూల్యం నిత్య జాగరూకత; ప్రజాస్వామ్యానికి కూడా అంతే. పాకిస్తాన్‌లోనో, చైనాలోనో, మరొక చోటనో జరిగినట్లు ఇక్కడ జరగదని ఉపేక్ష వహించడ

మంత తెలివితక్కువ మరొకటిలేదు. ప్రస్తుత పరిస్థితులకంటె నియంతృత్వమే మేలని భావించే ఒక మనస్తత్వం అక్కడక్కడ పొడచూపుతోంది. మితవాదో, అతివాదో, అమెరికా అనుకూలుడో, చైనా అనుకూలుడో, ఎవడైతేనేం, ఒక నియంతవచ్చి చండశాసనం చెలాయిస్తే బాగుండిపోను అనే నిస్పృహ కలగడం ప్రారంభించడమే మన



'వర్తమాన ప్రపంచంలో మహోన్నతమైన సిద్ధాంతవేత్తయేగాక గొప్ప కార్యశూరుడు మావో' అని అంటున్నారు కొందరు...

కాదు — 'విశ్వశాంతికే ప్రమాదకారి, వట్టి అరాచకవాది మావో' అని అంటున్నారు మరి కొందరు... ...

ఏది ఏమైనా; మావో భావాలు నేడు నిఖిల ప్రపంచాన్ని ఊపివేస్తున్నాయి. అందుకే అందరూ 'మావో సూక్తులు' స్వయంగా చదువుకొని ఎవరికివారు తేల్చుకోవడం మంచిది.

"మావో సూక్తులు"

ఆంధ్రీకరణ : చంద్ర పుల్లారెడ్డి, బొమ్మారెడ్డి

వెల : మూడు రూపాయలు

ప్రథమ ముద్రణ ప్రతులు బయటకు వచ్చిన పదిహేను రోజుల్లోనే అయిపోయినాయి. ద్వితీయ ముద్రణ వెలువడింది. త్వరపడండి. పది అంతకంటే హెచ్చు కాపీలకు ఆర్డరు చేసేవారికి 25% కమీషన్ ఇవ్వబడుతుంది. ఒకే ప్రతి కావలసినవారు పోస్టల్ ఖర్చుకు అదనంగా 90 పైసలు పంపాలి.



సోషలిస్టు పబ్లికేషన్స్

రాజగోపాలాచారి వీధి, విజయవాడ - 2.

నైతిక పతనానికి నాందికాకతప్పదు. నియంతృత్వాన్ని ఆహ్వానించడం తేలిక; వదలగొట్టుకోవడం కష్టం. ఈ సత్యాన్నిమనం, మన రాజకీయ పక్షాలు ఎంత త్వరలో గ్రహిస్తే అంతమంచిది.

అధికార భాషపై అలజడి

1967 పోతూ పోతూ, భాషా వివాదాన్ని రగిలించి మరీ పోయింది.

భారత రాజ్యాంగం ప్రకారం యూనియన్ అధికార భాష హిందీయే. అయితే, రాజ్యాంగం అమలులోకి వచ్చిన పదిహేనేళ్ళ వరకు ఇంగ్లీషుకూడా అధికార భాషగా కొనసాగాలని రాజ్యాంగ నిర్మాతలు నిర్ణయించారు. దాని ప్రకారం 1965 తో ఇంగ్లీషుకు స్వస్తి జరగవలసివుంది. హిందీ ఏకైక అధికారభాష కావలసివుంది. కాని, అలా జరగలేదు. కారణం?

స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో, దేశవిమోచనకోసం జరిగిన పోరాటపు స్మృతులు మాసిపోని ఆ రోజులలో, ఆనాటి రాజ్యాంగ నిర్మాతలు పరభాష అయిన ఇంగ్లీషు మనకు పనికిరాదని, జాతీయభాష అయిన హిందీయే అధికారభాష కావాలని నిర్ణయించారు. దూరాలోచన వుండో, లేకనో ఆనాడు దేశమంతా అవునంటే అవునని తలవూపింది.

కాని పదిహేనేళ్ళ గడువు పూర్తి కావస్తుండగా, రాజ్యాంగ నిర్మాతల నిర్ణయానికి ఎన్నో ఇబ్బందులు పొడచూపాయి. ఈ ఇబ్బందులను గుర్తించడంవల్లనే అసలు రాజ్యాంగ నిర్మాతలు పదిహేనేళ్ళ గడువును నిర్ణయించారు. ఆ గడువు తీరినా ఆ ఇబ్బందులు తొలగేట్టు కనబడలేదు.

హిందీ మాట్లాడేవారు మిగిలిన భాషలవారికంటె ఎక్కువే. కాని, వారు నాలుగైదు రాష్ట్రాలలో మాత్రమే వున్నారు. మిగిలిన దేశంలో ఇంగ్లీషు ఎంత పరభాషో, హిందీకూడా అంతే. ముఖ్యంగా దక్షిణాది భాషలకు, హిందీకి పోలికే లేదు. అయినప్పుడు హిందీని దేశం నెత్తిమీద రుద్దితే ఏమవుతుంది? హిందీవారి ప్రాబల్యం ఎక్కువ కాదా? ప్రభుత్వం వారిదై పోదా? హిందీ రానివారికి అన్యాయం జరగదా?

ఈ సమస్యను దృష్టిలో పెట్టుకునే అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ 1963 లో అధికార భాషల చట్టాన్ని 1965 తర్వాత కూడా ఇంగ్లీషును అధికార వ్యవహారాలకు ఉపయోగించడానికి వీలుగా రూపొందించారు. కాని, అది దాక్షిణాత్యులకు సంతృప్తి కలిగించలేదు. దానిపై, హిందియేతరులు కోరినంతకాలం ఇంగ్లీషు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. అదీ తృప్తి

కలిగించలేదు. రాజ్యాంగాన్ని సవరించాలని దాక్షిణాత్యులు పట్టుపట్టారు.

దీనితో దేశంలో భాషా వివాదానికి అంకురార్పణ జరిగింది. రాజ్యాంగాన్ని సవరించాలనేసరికి హిందీవారికి పట్టుదల హెచ్చింది. ఏమైనాసరే ఇంగ్లీషు కొనసాగడానికి వీలులేదు, తక్షణం దాన్ని బహిష్కరించాలన్నారు. అయితే, హిందీ మాకక్కరలేదు, ఇంగ్లీషే వుండాలని దాక్షిణాత్యులన్నారు. ఇంగ్లీషును మా నెత్తిపై రుద్దడానికి మీ రెవరని హిందీవారు, హిందీని మాకు అంటుగట్టడానికి మీ రెవరని దాక్షిణాత్యులు వాదించుకున్నారు.

ఈ ఉభయ వాదాలను పొందుపరుస్తూ ఈ డిసెంబరులో కేంద్ర ప్రభుత్వం అధికార భాషల చట్టానికి సవరణను తీసుకువచ్చింది. హిందీతోపాటు ఇంగ్లీషుకూడా దేశమంతా ఏకగ్రీవంగా వద్దనే వరకు కొనసాగుతుంది. హిందీ రాష్ట్రాలవారితో కేంద్రం హిందీలోను, ఇతర రాష్ట్రాలతో ఇంగ్లీషులోను వ్యవహరిస్తుంది. ఇంకా హిందీ రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాలు, కేంద్రం ఏయే సందర్భాలలో ఇంగ్లీషులో వ్యవహరించాలో నిర్దేశిస్తూ సవరణ బిల్లును ప్రతిపాదించారు.

ఈ బిల్లుపై హిందీ రాష్ట్రాలలో జరిగిన అల్లరి దేశానికే తలవంపులుగా, జాతి సమైక్యానికే హానికరంగా జరిగింది. యు.పి. మంత్రుల శాసనోల్లంఘనం, అరెస్టుల వంటి అసహ్యకర సంఘటనలెన్నో జరిగాయి.

చివరికి భాషల బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించినప్పటికీ, భాషా వర్గాలమధ్య విద్వేషంమాత్రం అంతరించలేదు. అధికార భాషకు సంబంధించినంతవరకు దేశం హిందీ ప్రాంతంగాను, నాన్-హిందీ ప్రాంతంగాను విభక్తమైనట్టే లెక్క. యూనివర్సిటీలస్థాయిలో ప్రాంతీయ భాషలు బోధన భాషలైనప్పుడు, యు. పి. ఎస్. సి. పరీక్షలలో పదహారు భాషలకూ గుర్తింపు లభించినప్పుడు, దేశం పదహారు రాష్ట్రాలుగా విడిపోయినట్టుకూడా లెక్క. ఈ భాషా ప్రయుక్త విభజన రాజకీయంగా ఎట్టి విపరిణామాలకు దారితీస్తుందో చెప్పలేము.

“రింగౌట్ ది ఓల్డ్”

ప్రపంచం పూర్తిగా అంధకార బంధురం ఎన్నడూ కాదు. చీకటి వెలుగులు చక్రనేమిక్రమంలో వస్తూ పోతూనే వుంటాయి. కటిక అమావాస్యనాడుకూడా, దారిచూపడానికి నక్షత్రాలు మెరుస్తూనే వుంటాయి. ఆకాశం మేఘమేదురమైనప్పుడు కూడా తటిల్లతలు తళుక్కుని పోతూ

వుంటాయి. చీకటి గదిలో ఒక మొక్కను పెంచండి. ఏ తలుపు సందులోనుంచో తొంగిచూచే కాంతి కిరణంకేసి మొక్క పెరుగుతూ పోతుంది.

ఆ మొక్కలాంటివాడే మానవుడు. అతడు సహజంగా ఆశాజీవి. ఎన్ని నిరాశల మధ్య తపించి పోతున్నా, అతని మనస్సు ఏదో ఆశాకిరణంవైపు రెక్కలు విప్పుకుని పయనిస్తుంది.

1970–85 సంవత్సరాల మధ్య కాలంలో లక్షలాది మానవులు ఆకలితో మలమలమాడి మరణిస్తారని శాస్త్రవేత్తలు భయంకరమైనజోస్యం చెబుతున్నారు.

మారణాస్త్రాలు అంతకంతకూ పదును దేరుతూ లోక వినాశానికి దారిదీయక తప్పదని మేధావులు హెచ్చరిస్తున్నారు. ఒకవంక అనంతమైన దారిద్ర్యం, ఇంకొకవంక అంతులేని ధనరాసులు. ఒకవైపు అగాధం వంటి అజ్ఞానం, మరొకవైపు హిమగిరి శిఖరాలవంటి విజ్ఞానం. ఒకప్రక్క ప్రపంచ యుద్ధభయం, వేరొకప్రక్క సుస్థిరశాంతి అవకాశాలు. వీటిమధ్య మానవజాతి దిగ్భ్రాంతమై కొట్టుమిట్టాడుతున్నది. మారణాస్త్రాలను తయారుచేస్తున్న మానవమేధ రోదసి అంచలకు, దూరగ్రహాలకు నిచ్చెనలు వేస్తున్నది. ఒకరిగుండెను మరొకరికి అమర్చి ప్రాణభిక్ష పెట్టగలుగుతున్నది. ఈ అద్భుత విజ్ఞానంలో వివేకం లోపించడమే మానవ కల్యాణ సాధనకు అవరోధంగా నిలిచింది. ఈ విపరీత సంధి సమయంలో మహాకవి టెన్నిసన్‌తో పాటు మనమూ ఇలా కోరుదాము:

Ring out the old,
ring in the new,
Ring, happy bells,
across the snow;
The year is going.
let him go;
Ring out the false,
ring in the true.

□□□

రేడియోలో హార్మోనియం

"పక్కింట్లో ఎవరన్నాపోయారా? ఏడుపులు వినిపిస్తున్నాయి!"

"కాదండీ. వాళ్ళమ్మాయి హార్మణీ నేర్చుకుంటోంది."

—ఇది అరిగిపోయిన గ్రామఫోను రికార్డంత పాత జోకు.


దీన్నిబట్టి హార్మోనియమ్ వాయిద్యానికి చాలకాలంగా జరిగిన అన్యాయాన్ని తెలుసుకోవచ్చు. అది అసలు సంగీత వాద్యం కాదని, దాంట్లోంచి వొచ్చేది సంగీతం తప్ప మరేదైనా కావచ్చునని కొందరి విశ్చితాభిప్రాయం.

గాడిద, మేక, బర్రె, గొర్రె, పంది, కుక్క మొదలైన జంతువుల అరుపులను అనుకరించడానికిగాను కనిపెట్టిన ఒక విచిత్ర శబ్దయంత్రం హార్మోనియం అని కొందరు నమ్ముతారు.

ఔరంగజేబు సంగీతం అంటే చెవికోసుకునేవాట్ట – వినడానికి ఇష్టంలేక — అలాంటి సంగీత శత్రువే ఎవరో సంగీతాన్ని ఖూనీ చేయడానికి హార్మోనియంను కనిపెట్టాడని కొందరి సిద్ధాంతం.

మొత్తంమీద దాన్ని సంగీతకళాభిజ్ఞులందరు ఏకగ్రీవంగా ఏవగించుకుంటూరు. అలాంటి వారిలో శ్రీ బి. వి. కేస్కార్‌గా రొకరు. ఆయన రేడియో, సమాచారశాఖ మంత్రిగా వున్న రోజుల్లో హార్మోనియంను రేడియోస్టేషన్‌ల ఆవరణల్లోకి అడుగుపెడితే పళ్లు రాలగొడతానని నిషేధించారు. అంచేత పాపం అది ఇన్నేళ్ళూ రేడియో స్టూడియోలకి ఆమడ దూరాన బిక్కచచ్చి వుంటోంది.

దానిమీద కొత్త రేడియోమంత్రి శ్రీ కె. కె. షాగారికి ఎందుకో మళ్ళీ దయ కలిగింది. దాన్ని మళ్ళీ చేర





దీస్తామంటున్నారు. కొన్ని రకాల లైట్ మ్యూజిక్ ప్రోగ్రాముల్లోను, గాత్, తోరా మొదలైన "సోలో" ప్రోగ్రాముల్లోను — ప్రయోగాత్మకంగా (ట్రయల్ బేసిస్) - వాడనిచ్చి, ఎలా వుంటుందో చూస్తామన్నారు ఈ మధ్య.

ఎలా వుంటుందంటే ఏం చెప్పగలం? వాయించే వాణ్ణి బట్టి వుంటుంది.

హార్మోనియం గొప్ప సంగీత వాద్యమని నేను ఛస్తే అనను. పియానో, వయొలిన్, గిటార్, సితార్, వీణ, సరోద్, ఫ్లూట్ లాంటి వాటితో పోలిస్తే అది తక్కువ జాతి వాయిద్యమే కావచ్చు. కాని, అంత మాత్రాన దాన్ని తీసిపారేయవలసిందేనా?

ఒకప్పుడు మన దేశంలో హార్మోనియం ఎంతో పాప్యులర్ వాయిద్యం. సరిగమలు నేర్చుకునే ప్రతి కుర్రాడు, కుర్రదీ హార్మోనియం మీద నే మొదలెట్టేవారు. సంగీతం మీద కాస్త శ్రేస్టు వున్న ఏ ఇంట్లోనైనా హార్మోనియం విధిగా వుండేది. ఇహ డ్రామాల సంగతి చెప్పక్కరేదు. ఎన్ని ఇతర వాద్యాలున్నా, హార్మోనియం లేందే నాటకం రాణించనట్టే లెక్క. మన స్టేజి నటులు పాటలు హార్మోనియంమీదే ప్రాక్టీసు చేసేవారు. ఇప్పటికీ కొన్ని కొన్ని నాటకాల్లో హార్మోనియం వుండాల్సిందే. అయితే, క్రమంగా దానిమీద మోజు తగ్గుతోందనుకోండి. ముఖ్యంగా, సంగీత సాధనకి ఫిడేలును, వీణను వాడుతున్నారు.

ఇంతకీ, నే నడగదలచిన ప్రశ్న — మంచి వాయిద్యాన్ని చేత్తో పట్టుకున్నంత మాత్రంలో దాంట్లోంచి మంచి సంగీతం వస్తుందా?

నేను మొట్టమొదట్లో చెప్పిన జోకు ఫిడేలు, వీణ — మరే వాయిద్యానికైనా నిరాక్షేపణగా వర్తిస్తుంది. "నా ఊళ కేదార గేళ" అన్నాడు శ్రీ శ్రీ. కాని, నేను ఫిడేలు, వీణ, సితార్ మరే ఉత్తమ వాద్యంలోంచి అయినా సరే — కేదారగేళకు బదులు ఊళ తెప్పించగలను. "మహాప్రభో! మీరు వాయించొద్దు. లేకపోతే, చంపాలు వేసుకుని మిమ్మల్ని, మీ ఫిడేల్ను చితగ్గొడతాం" అనేదాకా వాయించగలను. అంచేత, అయ్యా! అంతా

వాయించేవాడిలో వుంది — వాయిద్యంలో కాదు.

ఒక్కొక్క వాయిద్యం ఒక్కొక్కరి చేతిలో పరాకాష్ఠకు వెళ్ళింది. సరస్వతీదేవి వీణ, శ్రీకృష్ణుడి పిల్లనగ్రోవి, నారదుడి మహతి, తుంబురుడి తంబుర, బీతోవెన్ పియానో మనం వినలేదనుకోండి. కాని, ఈ కాలంలో కూడా ఒక్కొక్కరి వాద్యసంగీతం వింటుంటే లోపల్నించి కవిత్వం లాంటిది పుట్టుకొచ్చేస్తుంది.

బిస్మిల్లాఖాన్ షెహనాయి
వెన్నెల్లా కలిగిస్తుంది హాయి.

రవిశంకర్ చేతిలో సితారు
తేనెల వాకలా జాలువారు.

అలీ అక్బర్‌ఖాన్ సరోదు
దానికి, సాటి లేనే లేదు,

పన్నాలాల్ ఘోషు ఫ్లూటు
వెన్న దొంగ మురళికి దీటు,

ద్వారం, చౌడయ్యల వయొలిన్
దానికదే సాటి, వేయేలన్?


ఈమని శంకరశాస్త్రి వీణ
ఆమని కోకిల కంఠం జాణ.

ఇలా ఎంతైనా రాసుకుంటూ పోవచ్చుగాని, ఏతావతా, నే చెప్పొచ్చేదేమిటంటే హార్మోనియం, మిగతా కొన్ని కొన్ని సంగీత వాయిద్యాలకంటె తక్కువజాతిదే కావచ్చు, దానికి కొన్ని లిమిటేషన్స్ వుండచ్చు. రేంజ్ లో, సున్నితవ్వతనంలో దానికి కొన్ని ఇబ్బందులుండవచ్చు కాని, దాన్ని కూడా అమోఘంగా స్వాధీనం చేసుకున్న వాళ్ళున్నారు. దానిమీద



తమ శాస్త్రి పాండిత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించే వాళ్ళున్నారు.

మన ఫిలిం సంగీత దర్శకుల్లో చాలమంది ముందు తమ ట్యూనుల్ని హార్మోనియంమీద పలికించి నిర్ణయించుకుంటారు. ప్రతి సంగీత దర్శకుడి దగ్గర విధిగా వుండవలసిన వాయిద్యం హార్మోనియం. దానిలో కూడా చాలా రకాలున్నాయి. ఒక్కొక్క మ్యూజిక్ డైరెక్టరు తనకు కావలసిన విధంగా హార్మోనియంను తయారు చేయించుకుంటాడట.



కూడా. ఎస్. రాజేశ్వరరావుగారు చాలా వాయిద్యాల్లో పరిశ్రమ చేశారు. ఆయన చేతికి ఏ కొత్త వాయిద్యాన్ని ఇచ్చినా కొన్ని రోజుల్లో దాన్ని మాస్టర్ చేసి వదిలి పెట్టేస్తారు. కాని, అన్నిట్లో కీ హార్మోనియం లో ఆయన దిట్ట. ఆయన హార్మోనియం వింటే అదిరి పోతాము. తరవాత నెమ్మదిగా పారవశ్యంలో మునిగిపోతాము.

మౌత్ ఆర్గన్ అందరికి తెలిసిందే. అది హార్మోనియానికి చుట్టమే. అందుకే గావును దాన్ని హార్మోనికా అంటారు. దాన్ని చూస్తే అందరికి చులకన. పిల్లలు తూతూ అంటూ ఊదుకునేదని తీసిపారేస్తారు. ఒక్క స్వరం కూడా స్వచ్ఛంగా, శుద్ధంగా పలకని దానిలా ఘంటుంది. అలాంటి దాన్ని కొందరు అద్భుతంగా ఁయి స్తారు. హార్మోనికాలో Virtucso అని పేరుపొందిన లారీ యాడర్ దాన్ని కాన్సర్ట్ ఇన్స్ట్రుమెంట్ గా రూపొందించి అత్యున్నత స్థాయికి తీసుకుపోయాడు. ఆయన మౌత్ ఆర్గన్ వింటుంటే మనం వినేది వయొలిన్ కాదుగదా అనిపిస్తుంది. అంతగా ఆ వాయిద్యాన్ని ఆయన మాస్టర్ చేశాడు.

అంచేత నే చెప్పేదొకటే—హార్మోనియంను రానిస్తే, మన రేడియో స్టేషన్‌లు మైలపడిపోవు. సంగతి, సందర్భాలనుబట్టి దాన్ని ఉపయోగించుకుంటే తప్పేమీ లేదు. కె. కె. షాగారు తమ ప్రయోగాన్ని అమలు చేసి చూడడం మంచిదే.

— "గానప్రియ"

పాతకుర్చీ

చాగంటి సత్యవెంకటరత్నం



జరుగుతున్న తరంలోని వ్యక్తి నరసింహారావు. ఆ నరసింహారావు కో నాన్న. ఆయనిప్పుడు సజీవంగా లేడు. బ్రతికున్న రోజుల్లో ఆయన్ని జగన్నాధం, జగ్గూ అని పిలిచేవారు.

జగన్నాధంగారు తనహయాంలో ఓ 'కుర్చీ' కొన్నారు. ఆయన డిప్యూటీ తాసీల్దారు గిరిలో ప్రవే

శించినపుడు ఇంటికి పెద్దలెవరేనా వస్తే కూర్చునేందుకు బాగుంటుందని ఆయన తన ముప్ఫైయవ ఏట డిప్యూటీ తాసీల్దారు పదవిలో ప్రవేశించాక అందుకున్న మొదటి నెల జీతంతో ఓ కుర్చీ కొన్నారు. ఆ కుర్చీని ఆయన నిరభ్యంతరంగా యాభై ఏళ్ళు ఉపయోగించుకున్నారు. ఆ పన్నెండు రూపాయల కుర్చీచేత వందరూపాయలసేవ చేయించుకున్నారు.

ఆయనింటికి తాసీల్దారొచ్చినా, కలెక్టరొచ్చినా అదే కుర్చీలో కూర్చోబెట్టి గౌరవించేవారు జగన్నాథంగారు. ఆయన ఇంటికివచ్చే బంధువులందరూ ఆ కుర్చీలో కూర్చుని బయటికి కదలిన వాళ్ళే. అయితే పెద్దవాళ్ళను మాత్రమే ఆ కుర్చీలో కూర్చోనిచ్చేవారు. చిన్న పిల్లలైతే ఎక్కి తగలేస్తారేమోనని ఆయన భయం. ఎవరైనా పిల్లలు మరీ మోజుపడితే ఓ అయిదు నిమిషాలు కూర్చోబెట్టి దింపేసేవారు. ఈ అయిదు నిమిషాలూ ఆయన ఆ కుంకలకి కాపలా.

జగన్నాథంగారితల్లి సుందరమ్మగారికి కొడుకుకన్నా ఆ కుర్చీఅంటే అభిమానం మెండు. ఆ కుర్చీమీద జగన్నాథం కనబరిచే ఆప్యాయతకి రెండు రెట్లు సుందరమ్మగారు చూపించేవారు. వాళ్ళింట్లో ఏవైనా వేడుకలు జరిగినపుడు పెద్దది కదా అని తల్లిని మధ్యగా ఆ కుర్చీ వేసి కూర్చుండబెట్టేవారు జగ్గుగారు. ఆ సుందరమ్మగారు చచ్చిపోయాక ఆవిడ వంతుకూడా తనే స్వీకరించి కుర్చీనిగూర్చి మరింతశ్రద్ధ కనపర్చేవారు. పెద్ద పండుగకి ప్రతి ఏటా ఇంటికి వెల్లవేయించకపోయినా కుర్చీకిమాత్రం స్వయంగా వార్నీషు వేసేవారు. ఆయన రిటైరయ్యాక వీధి నడవ కెదురుగా, గుమ్మానికి దగ్గరగా ఆ కుర్చీ వేసుక్కూర్చుని వీధిలో వచ్చేపోయేవారిని పలకరించేవారు ఠీవిగా. ఆయన తన ఆఫీసులోని 'తిరిగే కుర్చీ'లో కూర్చున్నప్పుడు కలిగే దర్జాకన్నా ఇంటి దగ్గర 'తన కుర్చీ'లో కూచున్నప్పుడు ఎక్కువ దర్జా కలిగేది. దీనిక్కారణం 'అది నా స్వంతం-నా కష్టార్జితం' అన్న మెప్పుదలేనేమో!

జగన్నాథంగారు చచ్చిపోయే సమయానికి ఆ కుర్చీకి కూడా వార్ధక్య మొచ్చేసింది కాబోలు. ఓ కాలు విరిగిపోయింది. దాన్ని తనే బాగు చేయాలనుకున్నారు. కాని ఇంతలోకే శాపం పెట్టినట్లుగా కుర్చీకి కాలు విరిగినట్లే ఆయన కుడి చెయ్యి, కుడికాలూకూడా పడిపోయి పక్షవాతంకూడా రావడం, ఓ వారం రోజులతర్వాత చచ్చిపోవడం జరిగాయి.

జగన్నాథంగారు చచ్చిపోతూ

కొడుకు నరసింహారావుకి ఆ కుర్చీని అప్పజెప్పారు. 'ఒరే నాయనా! ఆ కుర్చీకి కాలువేయించు. ఏభైఏళ్ళుగా మనకి అచ్చివచ్చింది' అని. అలా అనడంలో ఆయన ఉద్దేశం బహుశః 'తన కొడుకు చిన్నప్పటినుంచీ ఆ కుర్చీలో కూర్చోబట్టే వాడికా ఠీవి ఏర్పడిందని, వాడికీవినిబట్టే అదృష్టం వరించి వాడు తనకన్నా ఒక మెట్టు పైకి—తాసీల్దారుగిరీకి – ఎగబ్రాకాడనిన్నూ.

పన్నెండు రోజుల కర్మకాండ ముగిశాక నరసింహారావు చేసిన మొదటిపని కుర్చీకి కాలు వేయించడమే.


నరసింహారావుకి ఆ కుర్చీ అంటే ఓ విధమైన గౌరవభావం వుండేది. తనకన్నా ముందునుంచీ ఆ యింట్లో స్థానం సంపాదించుకున్న దన్న మెప్పుదలకూడా అందుకు కారణం అయివుండవచ్చు. నరసింహారావు కూడా తండ్రిలాగానే అభిప్రాయపడ్డాడు. 'ఆకుర్చీలోచిన్నప్పటినుంచీ కూర్చోడంవల్లనే అతడిని అదృష్టం వరించిన'దని. ఆ వుద్దేశంతోనే తన కొడుకు జగన్నాథరావుని కూడా చిన్నప్పటినుంచీ ఆ కుర్చీలోనే తన వళ్ళో కూర్చోబెట్టుకుని అన్నం తినిపించేవాడు. ఆ కుర్చీని గూర్చిన కథలల్లి చెప్పేవాడు. చిన్నజగ్గు పెద్దవాడయ్యాడు. అయితేనేమి అతగాడు పుట్టిందీ, పెరిగిందీకూడా ఇరవయో శతాబ్దపు నాగరికయుగంలో. అతగాడికి అభ్యుదయ భావాలెక్కువ. తన తండ్రీ, తాత, తాతమ్మలయొక్క పురాతనమైన నాసిరకం భావాలని అసహ్యించుకొనేవాడు. కాని అతడు ఆ కుర్చీపట్ల తన హేయ భావాన్ని తండ్రి ముందర ఎన్నడూ వ్యక్తపరచలేదు. ఇందుకు కారణం ఆ కుర్చీపట్ల తండ్రికున్న ప్రగాఢమైన అభిమానాన్ని చిన్నజగ్గు ఎరిగివుండటమే. ఆ కుర్చీని కించపరిస్తే, తన తండ్రి పెద్దజగ్గుని అవమానించినట్లే భావించి తన వీపు చీరేస్తాడు అన్న భయం చిన జగ్గుని ఆ కుర్చీని గూర్చిన స్వీయాభిప్రాయాన్ని వెల్లడి చేయకుండా జాగ్రత్త పడేట్టు చేసింది.


మెల్లగా ఆ కుర్చీకి మరోముప్ఫై ఏళ్ళు నిండాయి. నరసింహారావుక్కూడా అరవై నిండాయి. అతనిక్కూడా పైలోకంనుంచి పిలువు వచ్చింది. వెళ్ళిపోయాడు ఈ లోకంలోంచి శాశ్వతంగా. తన నాయనమ్మ తరంనుంచీవుంటున్న ఆ కుర్చీని కొడుక్కి అప్పగించి.

ఇప్పుడిహ చిన్నజగ్గు తరం. నరసింహారావుతరం వెళ్ళిపోయింది.

చిన్నజగ్గు ఆ కుర్చీని మండువాలో వేశాడు. దానిమీద తన తండ్రి పెదకర్మకని వచ్చిన బంధువుల తాలూకు పిల్లలు ఎక్కితగలేస్తున్నా


జీవన్ టో






మందు తీసుకొనకముంగ 20 రా

గవర మె టు రిజిస్టర్డు నెం. 218726 Phone No. 440206





40 రోజులు తీసుకొన్న తర్వాత 60 రోజు ర్వాత

పత్రికలలో ప్రకటనచేసిన ఔషధాలను సేవించి ఫలితాలను పొందనివారు అనేకులున్నారు. కాని జీవన్‌టోన్‌ను కొనుక్కొని దానిని ఉపయోగించి ప్రయోజనంపొందండి. జీవన్‌టోన్ కేవలం వనస్పతి కొవ్వు నుంచి తయారు చెయ్యబడినది. జంతువుల కొవ్వు చేరుటవల్లనే ఈ అనుకోనటువంటి బలిషతకు కారణమని కొందరు అనుకోవటంపొరపాటు.

జీవన్‌టోన్ గుణములు : ఎంతమంచి ఆహారం తిన్నా, ఎముకలపోగు వలె బలహీనంగా ఉండేవారు కొంతమంది ఉన్నారు. అట్టివారికి జీవన్‌టోన్ మంచిబలాన్ని, లావును, బరువును ఇస్తుంది. ఆకలి లేనివారికి మంచి జీర్ణశక్తి నిస్తుంది. ఇది బలహీనత, కాళ్ళు చేతులు తేలిపోవుట, తల తిరుగుడు, రక్తహీనతలను పోగొట్టి పరిపూర్ణమైన దేహారోగ్యాన్ని, పుష్ఠిని ఇస్తుంది. శరీరం ఎరుపుచాయ పొందటానికి జీవన్‌టోన్‌తో టొమాటోలు తీసుకొనండి. ఆరోగ్యవంతులకు కూడా జీవన్‌టోన్ మంచిది. జీవన్‌టోన్ తీసుకొన్నప్పుడు మీరు కొంత శరీర వ్యాయామం చెయ్యటం అవసరం. లేకపోతే మీ శరీరం అనవసరంగా లావెక్కుతుంది. కావలసిన బరువు, బలిష్టత చేరిన వెంటనే జీవన్‌టోన్ సేవించడం నిలపండి. స్థూలకాయులు జీవన్‌టోన్ తీసుకొనడం మంచిదికాదు. అట్టివారు జీవన్‌టోన్ తీసుకుంటే మేము బాధ్యులంకాము. స్త్రీలు బహిష్టుకాలంలో తీసుకొనకూడదు. ఇతర వివరాలు మందుతో పంపబడతాయి.

వెల : 454 గ్రాములు రు. 10/- (పోస్టుచార్జీలు అదనం)

స్కిన్ లీమ్స్ యవ్వన సౌందర్యం కలిగియుండటం వరప్రసాదం. స్కిన్ లీమ్స్ మీ చర్మాన్ని, మొటిమలు, స్ఫోటకపు మచ్చలు, వివర్ణత, కోతలు, శోభినుంచి కాపాడుతుంది. స్కిన్‌లీమ్స్ ముఖమందలి మడ్డి తొలగించిన తరువాత వాడవలెను. మీరు ఏ స్నోగాని, పౌడరుగాని వాడవచ్చును. స్కిన్ లీమ్స్ ఒక కోర్సు రు. 12/-

JYOTHI HOSPITAL,
POST BOX NO. 1413,
32, Venkatanarayana Road, MADRAS-17.
స్థానిక డాక్టరు : డాక్టరు దామోదరం, M. A , I A. D. S.

కూడా ఏమీ అనలేదు. అప్పటికే సగం వూడిపోయిన ఆ కుర్చీ వీపును పూర్తిగా వూడబెరికినాకూడా చిన జగ్గు తన తండ్రిలాగ, తాతలాగ చీదరించుకోలేదు, కోప్పడలేదు కూడా. దాన్నిగురించి పెద్దవాళ్లు తమ పిల్లల్ని కోప్పడుతుంటే చిరునవ్వునవ్వి వారించేవాడు. బంధువులుకూడా ఆశ్చర్యపోయారు. "ఇదేమిటీ పిల్లాడు ఆ కుర్చీని నిర్లక్ష్యంగా చూస్తున్నాడు. ఆ కుర్చీ సంగతి ఇతగాడికి తెలీదా" అని?

పన్నెండో రోజు కర్మకాండ పూర్తయేసరికి ఆ కుర్చీవీపు, ఓకాలు కూడా విరగ్గొట్టారు పిల్లలంతా చేరి. చిన్న జగ్గు ఏం విచారించలేదుగాని బంధువులంతా నొచ్చుకున్నారు.

తమ యింటికి వచ్చిన బంధువులంతా వెళ్ళిపోయిన ఓ వారంరోజుల తర్వాత ఓ తెల్లవారుఝామున చిన జగ్గు కుర్చీని ముక్కలుచేసి నీళ్ళపొయ్యిలో పెట్టించాడు, ఖంత్రోతు చేత.

ఇదిచూసిన అతడి పతీమణి బుగ్గలు నొక్కుకుని, "అదేం పనండీ" అని కోప్పడిందికూడా. అప్పటికే ఆ "పాతకుర్చీ" కాలి నుసైపోయింది. (పెద్దజగ్గు, నరసింహారావులు సజీవంగాలేరు, ఆ కుర్చీ తరఫున వకాల్తా పుచ్చుకొని మాట్లాడానికి. అందుకే నిర్భయంగా పాతకుర్చీ అనగలిగా) మామూలుగా చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు చినజగ్గు.

కొన్నాళ్ళకు నరసింహారావు మాసికం వచ్చింది. చినజగ్గు పెదల బలవంతంమీద తండ్రి మాసికం పెట్టాడు. అయితే కాకిమాత్రం వచ్చి ముద్దను ముట్టుకోలేదు. అందరూ ముక్కున వేలేసుకున్నారు. 'అపరాధం జరిగిపోయింది. కుర్చీ కాల్చేశారు నరసింహారావు ఆత్మశాంతించలేదంటూ' ఒకటే రొద, పెద్దలందరూ.

చినజగ్గు సతీమణికూడా భర్తపై విసుక్కుంది.

అతడి మేలుకోరే శ్రేయోభిలాషులందరూ భయపడ్డారు. 'ముందు ముందు ఇంకేం అనర్థాలు జరుగుతయ్యో'నని.

చినజగ్గు మాత్రం తొణకలేదు. బెణకలేదు.

ఉన్నట్లుండి ఓ రోజున అతనికి తంతి వచ్చింది, "నువ్వు కలెక్టరుగా సెలెక్టయినావురా అబ్బాయీ!" అని.

చినజగ్గు ఉద్యోగంలోకి ప్రవేశిస్తూనే ఓ డజను ఇనప కుర్చీలు కొన్నాడు.

□□□

రాగ రంజని

మధుర గాయకుడు హేమంత్ కుమార్

'శ్రావణ మాసపు వర్షాల లయతాళాలను అనుసరిస్తూ నీలి మేఘాలతో కూడా పయనిస్తుంది నా మనస్సు అనంతాకాశంలో. నా మనస్సు రెక్కలు కట్టుకుని విచ్చల విడిగా విహంగమాలతో కలిసి చిత్ర విచిత్ర ప్రకృతిలో విహరిస్తుంది.'

హేమంత్ గానాన్ని, సంగీత దర్శకత్వాన్ని తలచుకుంటే, అతను పాడిన బెంగాలీ పాటలన్నిటిలోకి నాకు ఎక్కువ ఇష్టమైన ఈ రవీంద్ర గీతం స్ఫురిస్తూ వుంటుంది.

"మన్ మోర్ మేఘేర్ సంగీ" అన్న ఈ పాట హేమంత్‌కు కూడా అతి ప్రియమై వుండాలి. ఎంచేతనంటే, దీని భావాన్ని, ఝ్యూనుని కూడా పూర్తిగా అనుకరిస్తూ లతా మంగేష్కర్‌చేత ఒక హిందీ సినిమా పాట పాడించాడు.

వినోదమైనా, విషాదమైనా తన సంగీత ప్రభావంతో శ్రోత మనస్సులో ప్రేరేపించ గలిగినవాడే గాయకుడు. ఈ శక్తి సహజంగా సంపాదించుకున్నవాడు హేమంత్.

సూక్ష్మంగా పరిశీలిస్తే హేమంత్ కుమార్ ముఖర్జీకి చలనచిత్ర సంగీత ప్రపంచంలో ప్రథమస్థానం లభించకపోవచ్చు. కె. సి. డే గాంభీర్యమూ, కె. ఎల్. సైగల్ మాధుర్యమూ, పంకజ్ మల్లిక్ లాలిత్యమూ, రఫీ వైవిధ్యమూ హేమంత్‌లో కొంత కొరత పడ్డాయని చెప్పాలి.

అయితే స్థూలంగా గమనిస్తే హేమంత్ స్వరంలో – నూటికి నూరుపాళ్ళూ కాకపోయినా – గాంభీర్యమూ, మాధుర్యమూ, లాలిత్యమూ, వైవిధ్యమూ సుష్టుగా సమిశ్రితమై ఇతరుల కెవరికీ సాధ్యంగాని మనోరంజకత్వాన్ని కలుగజేసే

సొంపు వుంది. అంటే మనోధర్మం దృష్ట్యాచూస్తే హేమంత్ అగ్రశ్రేణికి చెందిన గాయకుడే.

ఈ అభిప్రాయాన్ని సోదాహరణంగా కొంచెం విశదీకరిస్తాను.

కె. సి. డే 'జావో జావో', సైగల్ 'బాబుల్ మోరా', పంకజ్ 'బర్‌ఖాకీ రాత్', రఫీ 'హమ్ బేఖుదీమే', ముఖేష్ దిల్‌జలతా హై, మన్నాడే 'నైనా భర్ ఆయీ నీర్', కిశోర్ కుమార్ 'జగ్‌మగ్ జగ్‌మగ్ కరతా' లో అనన్య సామాన్యమైన వైశిష్ట్యాన్ని ప్రకటించారు.

హేమంత్ పాటలలో ప్రత్యేకంగా ఏ ఒకటీ వాటి స్థాయిని అందుకోలేదు. కాని అతని ప్రత్యేకత ఎందులో వుందంటే ఆయా పాటలలోని సమష్టి ఘనతను తన ఒక్కడి పాటలలో ప్రతిబింబింపజేయడంలో.

ప్రైవేట్ రికార్డులలో 'మై ప్రేమ్ మేం లుట్ తా ఆయా హూం', 'మనేకే ద్విధా రేఖే గేలే' (రవీంద్ర సంగీత); సినిమా పాటలలో 'జానే హూం కైసే', 'యేనయన డరే డరే' ఒక్క హేమంత్ మాత్రమే ఒప్పించగలిగాడు గాని, పైవారిలో ఎవ్వరూ అంత హృదయంగమంగా పాడివుండలేకపోవచ్చు.

తర్వాత కంఠధ్వని విషయంలో కొన్ని పోలికలు ఎంచాలి. పూర్వం సైగల్, పంకజ్ మల్లిక్‌ల గొంతులలోవున్న భేదం ఈనాడు రఫీ, హేమంత్‌కుమార్‌ల విషయంలో చూడవచ్చు. సైగల్, రఫీ [వ్యక్తిగతంగా ఈ రెండు పేర్లు జతపరచడం నా కిష్టం లేకపోయినా, పాపులర్ ఒపీనియన్‌కి బద్ధుడనై వ్రాస్తున్నాను]ల గొంతులు అన్ని పాటలకు తగి వుంటాయి. పంకజ్, హేమంత్‌ల గొంతులు ముఖ్యంగా క్రూనింగ్‌కి ఉపయోగిస్తాయి.

లలిత సంగీతానికి అసలు ప్రధానమైనది కంఠమాధుర్యం. సైగల్, రఫీల వైవిధ్యం ఒక్కొక్కప్పుడు బండతనానికి ప్రోవతీస్తుంది. అన్ని పాటలు పాడడానికి తగినవి కాకపోయినా పంకజ్, హేమంత్‌ల గొంతులు సర్వదా హాయిని కలిగింపజేస్తాయి.

ఉదాహరణకు సైగల్ 'మేరీ బహన్'లో పాటలు తీసుకుందాము. 'దో నైనా', 'ఛుపోనా', 'క్యా మైంనే కియా', మూడూ కూడా సైగల్ అంత బాగా పాడకపోవటం వల్ల, సంగీతకారుడు పంకజ్ అవి తిరిగి తనుపాడి మాధుర్య భరితంగా రికార్డు చేశాడు.

పోతే పంకజ్, హేమంత్‌ల పాటలలో బాగుండనివి లేనేలేవని చెప్పవచ్చును. అంటే అసలు లేవని కాదు. పంకజ్ గైర్ ఫిల్మిగీత్ 'హొగయా దిల్', హేమంత్ 'బీస్ సాల్ బాద్' పాటలు మూడవ వంతానికి చెందినవే.

చెప్పదలచుకున్న దేమిటంటే, ప్రతీపాటా పాడటానికి సిద్ధపడిన రఫీవంటివారు తరచు విసుగు పుట్టిస్తారు; ఎప్పుడో ఒక మంచిపాట రికార్డుచేసే హేమంత్ వంటివారి పాటలు నిత్యానందదాయకంగా వుంటాయి.

సంగీత దర్శకునిగా హేమంత్ కుమార్‌ని గురించి వ్రాసేముందు, ఈ పోలికలు విరమించి, అతను పాడిన గొప్పపాటలు కొన్ని వర్ణించాలి.



హేమంత్ కుమార్

'ప్యాసా'లో ప్రఖ్యాతి పొందినవిషాదగీతంకంటే గొప్పదైన సినిమాపాట హేమంత్ పాడాడు. అయితే దీన్నిగురించి ఏనాలాంటి **rare record Collectors** కో తప్ప చాలా మందికి తెలియదని అనుకుంటాను. ఈపాట 'గిరిబాల' (మధుబోస్ ప్రొడక్షన్స్) సినిమాలో 'గోపీనాథ్'కు ప్లేబాక్‌గా, కమల్‌దాస్‌గుప్తా సంగీత దర్శకత్వాన, ఫయాజ్ హాష్మి (కలకత్తానుండి వెలువడిన అనేక సుప్రసిద్ధమైన – పంకజ్, తలత్, హేమంత్, జగ్‌మోహన్ మొదలైనవారి–ప్రైవెట్ పాటలు రచించిన కవి)చే వ్రాయబడిన 'అప్‌నే సురోంసే తుమ్‌నే ఏక్ ఆగ్ లగా దీ' (నీ పాటలద్వారా ఒక జ్వాలను ప్రజ్వరిల్లజేశావు) అన్నది. ఈ పాట ఎప్పుడువిన్నా శ్రోత హృదయంలో అగ్ని రగులుకొంటుంది. ఇది రేడియోద్వారా ప్రచారంలోకి రాకపోవడం ముఖ్యంగా కలకత్తా పాట అయిపోవడంవల్లనే.

ఇదికాకుండా ఎక్కువ భావోద్రేకం కలిగించే హేమంత్ పాటలు 'ముహబ్బత్ కీ జబాన్ చుప్‌హై' (లగన్), 'ఐ బాదే సబా ఆహిస్తా చల్' (అనార్కలీ) చెప్పుకోతగ్గవి.

ఇక ఒకేఒక పాటను స్త్రీ కంఠం ద్వారా, తన కంఠంద్వారా వినిపిం

చిన వాటిలో కొన్ని తనవి బాగుంటాయి; కొన్ని స్త్రీలవి. 'యే బహారోంకాసమా' హేమంత్ పాడినది, లతా పాడిన దానికంటె హాయిగా వుంటుంది; కాని 'దిల్ ఛోడ్‌కోయీ ఇసానగ్‌మా' లతాయే బాగా పాడుతుంది. 'నయే చాంద్ హోగా' హేమంత్‌కంటె గీతా బాగా పాడుతుంది, 'ఐయే దునియా కౌన్ సీహై' గీతాకంటె హేమంత్ బాగా ఒప్పిస్తాడు.

డ్యూయెట్స్ విషయం ఆలోచిస్తే లతాతో కలిసి హేమంత్ పాడినవి అత్యుత్తమమైనవి అనడంలో అతిశయోక్తిలేదు. హిందీ డ్యూయెట్స్ లోకి ఇంతవరకూ అద్వితీయమైనది 'బాద్ శాహ్' సినిమాలో శంకర్–జయ్‌కిషన్ కూర్చిన 'ఆ నీల్‌గగన్ తలే ప్యార్ హమ్‌కరేం' (నీలి ఆకాశంక్రింద ప్రేమించుకుందాము) హేమంత్, లతా పాడినదే. ఇది కాక అనార్కలీ, ఝనక్ ఝనక్ పాయల్‌బాజే, శర్త్ చిత్రాలలో వీరి యుగళ గీతాలు శ్రేష్ఠమైనవి.

హేమంత్ మొట్టమొదటి సినిమా పాట 'జాల్' (ఎస్. డి. బర్మన్ మ్యూజిక్) లో 'యే రాత్ యే చాందనీ ఫిర్ కహాం' (?) ఇప్పటికీ బహుజనాదరణ పొందుతూనేవుంది.

ఇప్పుడింక సంగీత దర్శకునిగా హేమంత్‌కుమార్ గురించి ముచ్చటించుకుందాం.

హిందీ నేపథ్య గాయకునిగా హేమంత్‌కుమార్‌కి ద్వితీయ స్థానం మాత్రమే లభించినా, రవీంద్ర సంగీత గాయకునిగా బెంగాలులో 'హేమంత్ ముఖర్జీ' అన్న పేరుతో అతనికి అగ్రతాంబూలం అందిస్తారు.

ఇందులో రహస్య మేమిటంటే టాగూరులాగే హేమంత్ కూడా మన ప్రాచీన సంగీత సంప్రదాయాన్ని ఆధునిక పాశ్చాత్య సంగీతానికి ముడిపెట్టడం చక్కగా నేర్చుకొని వుండడం.

'రవీంద్ర సంగీత' ప్రాక్పశ్చిమ దేశీయులకు సమానమైన అప్పీలు కలిగి వుంటుంది. నేటి మన ఫిలిం సంగీతంయొక్క ధ్యేయం కూడా యిదే.

అయితే నౌషాద్ 'రతన్' సినిమాతో పంజాబీ డప్పును ప్రవేశపెట్టటం మూలాన, నయ్యార్ ఈ బాజాలతో పాటు మరికొంత తూర్పు పడమర తాళాల సంకలనం ప్రవేశపెట్టడం వల్ల, సినిమాపాటలకు ఒక నిజమైన, నిశ్చితమైన సంగీతమనే పేరు ఇవ్వడానికి రసజ్ఞులు అంగీకరించడంలేదు.

ఇది ఇలా వుండగా తన స్వచ్ఛమైన లలిత సంగీత జ్ఞానాన్ని ఆధారపర్చుకుని హేమంత్ 'నాగిన్' సినిమాకు సంగీతం కూర్చడంతో ఫిలిం సంగీతానికి ఒక కొత్త సొగసు

సంపాదించి పెట్టాడు. ఇందులో Clay Violin అనబడే 'చీన్'ను వింతగా వాడటమే కాకుండా ప్రతి ట్యూన్‌లో కూడా భారతీయ శాస్త్రీయ సంగీత ధ్వనిని ధ్వనింపజేస్తూనే వచ్చాడు సంగీతకారుడు. విశేషించి చెప్పదగిన దేమిటంటే తన ప్రైవేట్ రికార్డు 'పత్థర్ కీ తరహ్'లో వినియోగించిన 'మ్యూజికల్ ఎకంపనిమెంట్'ని తిరిగి 'మేరా దిల్ యే పుకారే ఆజా'లో అత్యద్భుతంగా వాడి సిద్ధసంకల్పుడయ్యాడు.

'నాగిన్' సినిమా హేమంత్ మొదటిసారిగా సంగీతం కూర్చినది అవునో కాదో నాకు సరిగా గుర్తు లేదు. కాని ఈ ఫిల్ముతో తన ప్రతిభను యావద్భారతానికి వెల్లడించడం ప్రారంభించాడని ధైర్యంగా చెప్పగలను.

ఇంతకు కొద్దిగా ముందుగానో వెనుకనో 'శర్త్' చిత్రంలో 'నయే చాంద్ హోగా' అన్న అజరామరమైన పాటను తయారు చేశాడు. నాకు ఈ పాట హేమంత్ కూర్చిన అన్నిపాటలలోకీ ఇంతవరకూ ఎక్కువ ఇష్టమైనది.

దీని తరువాత హేమంత్‌కి మరింత పేరు తెచ్చి పెట్టినది 'బీస్ సాల్ బాద్' (సొంత ప్రొడక్షను) అన్నమాట నిజమేకాని, ఈ సినిమాలోని సంగీతం ఉన్నత స్థాయికి చెందినది మట్టుకు కాదు.

పోతే 'సాహిబ్, బీబీ, గులామ్' లోని పాటలు ప్రథమశ్రేణికి చెందినవి. ముఖ్యంగా ఒక బెంగాలీ జానపద గీతాన్ని ఆధారం చేసుకుని కూర్చిన 'నజావో సయ్యా' గీతాదత్ యొక్క సహజ సుందర

హోటల్లో సర్వరుతో ఒకఅసామీ :– 'ఇంకో పెసరట్టు తీసుకు రావోయ్.'

సర్వరు :– 'ఇంకా ఏమన్నా కావాలా ?'

అసామీ :– ఒక పేపరు వెయిట్ కూడా తీసుకురా. ఇందాక నువ్వు తెచ్చిన పెసరట్టు గాలికెగిరి పోయింది.

ష్వరంతో రసభరితమై రసిక హృదయాలను ఉర్రూత లూగిస్తుంది. ఈ చిత్రంలోనే ఆశాభోంస్లే పాడిన 'మేరీ బాత్ రహీ మేరే మన్ మేం' విన్నప్పుడల్లా నా కళ్ళు చెమర్చకుండా వుండవు. అయితే అందులోని 'పాప్ సాంగ్' 'భంవరా బడా నాదాన్' నాకు హితమైనది కాదని చెప్పడం డాంబికంగా పాఠకులకు తోచినా, సత్యదూరంకాదు.

హేమంత్ కూర్చిన మంచి పాటలు కేటలాగు చేయదలచుకుంటే ఎన్ని పేజీలైనా నింపివేయవచ్చు. కాని అందువల్ల చదువరులకు వినుగు కలిగించటమే కాకుండా పత్రికలోని స్థల విషయంకూడా నిర్లక్ష్యం చేసినట్లవుతుంది.

కాబట్టి ఇతర సంగీతకారులు చూపించని ప్రత్యేక కళలతో ఉట్టిపడే హేమంత్ దర్శకత్వాన వెలువడిన కొన్ని రాగాలను ఉదాహరిస్తాను:

తను స్వయంగా పాడినవాటిలో 'కొహరా'లోని 'యే నయన్', 'అనుపమ' లోని 'యా దిల్ కీ'; ఈ సినిమాలలోనే లతాచే పాడించినవి వరుసగా 'ఝూమ్ ఝూమ్', 'ధీరే ధీరే మచల్'; 'దుర్గేశ నందిని'లో లతా పాడిన 'కహాం లే చలోగే బతాదే.'


కొంతమంది పాఠకులకు తెలిసిన విషయమైనా అఖరున హేమంత్ దిసినిమాలలోనే కాకుండా ఇంట్లోకూడా ఒక సంగీత కుటుంబమని చెప్పవలసివుంది. తన భార్య బేలా ముఖర్జీ బెంగాలులో పేరుపొందిన గాయని; హిందీ సినిమాలలోకూడా భర్తతోకూడి కొన్ని యుగళగీతాలు పాడింది; 'సహరా'లోపాడినవీరి డ్యూయెట్ భారత నారీత్వానికి తలమానికం. హేమంత్ కుమార్తె రానూ ముఖర్జీ 'మాసూమ్'లో చిన్నపిల్లగా పాడిన 'నానీ తేరే' ఎప్పటికీ ముద్దుకొలిపిస్తూనే వుంటుంది.

ఈ 'సంగీత సంసారం' ఈమధ్య అమెరికాలోపర్యటించి భారతసంగీత వైశిష్ట్యాన్ని విదేశీయులకు చక్కగా పరిచయం చేశారు.

అనేక అమెరికన్ అభిజ్ఞులు హేమంత్ కుమార్ముందు వాళ్ళ **Crooners** ఎందుకూ పనికిరారని కూడా వక్కాణించారు.

నిజానికి నా అభిప్రాయ మేమిటంటే అమెరికాలో కీ. శే. **Jim Reeves**, భారతదేశంలో పంకజ్ మల్లిక్ లకు తప్ప పురుషుల కంఠస్వరాలలో హేమంత్ కుమార్ గొంతులోగల మార్దవం మరెక్కడా లేదని.

□□□



(గత సంచిక తరువాయి)

పెట్టెమీద పడిఉన్న విసనకర్ర తీసుకొని విసురుతూ భర్త పక్కన మంచంమీద కూర్చుంది. తనభర్త నిప్పులాంటివాడు. ఎటువంటి పరిస్థితిలోనూ ఎంగిలికూడుకి ఆశపడే రకంకాదు. ఇప్పటి అతడి పరిస్థితికి ఇంకేదో కారణం ఉండి ఉంటుంది. కాస్త సర్దుకొని అతడే చెప్తాడు– అని మనసుకి సమాధానం చెప్పుకొంది

ఎట్టకేలకు రామనాధం స్తిమితపడి, "గోమతీ, గోపాలం, ఎక్కడ ఉన్నారు?" అంటూ ప్రశ్నించేడు.

"ఎక్కడో బంతాట పోటీలు జరుగుతున్నాయిట. ముగ్గురూ వెళ్ళేరు. చీకటి పడుతుందేమో, నువ్వెందుకే అమ్మా అంటే గోమతి వింటికాదు. 'ఇటు, అటు ఇద్దరు అంగరక్షకులు ఉండగా నాకు భయమేమిటమ్మా' అంది.

'నేను పక్కన ఉరిడగా గోమతి మీద ఈగనైనా వాలనిస్తానా ?' అన్నాడు గోవిందు.

'త్వరగా వచ్చేస్తాము. చీకటిపడే వరకు ఉండము' అంటూ ముగ్గురూ బయలుదేరేరు" అంది సావిత్రి.

"ఫరవాలేదులే. గాంధీమైదానం లోనేకదూ! దగ్గరే...వచ్చేస్తారు" అన్నాడు రామనాధం.

తన మనసులోకి వచ్చిన ఆలోచన భార్యతో చెప్పేందుకు అంత

కన్నా మంచి తరుణం లభ్యంకాదని నిర్ణయించుకొని, సరిగా సర్దుకొని మంచంమీద కూర్చున్నాడు రామనాథం. అతడు చెప్పబోయేది వినేందుకు తన సంసిద్ధతను కళ్ళతోనే తెలియజేసింది సావిత్రి.

'గోపాలాన్ని చదువుకి పంపాలి కదా; సొమ్ము తెచ్చేను' అన్నాడు రామనాథం తను చెప్పబోయేదానికి నాందిగా.

అది కన్పిస్తూనే ఉంది అన్నట్లు లాల్చీ జేబువైపు చూసింది సావిత్రి.

'ఆ పెద్దవీధి మార్వాడీలేడూ, అతడిదగ్గర నోటురాసి తెచ్చేను. వడ్డీ కాస్తహెచ్చే అనుకో. అయినా ఆఫీసులో సొమ్ము అందగానే ఇతనిది చెల్లుబెట్టేస్తాను.'

ఎంతో బరువును దించుకొన్నట్లు 'హమ్మయ్య' అనుకొంది సావిత్రి. మరి అటువంటిదానికి భర్త ఎందుకంత ఉద్రిక్తుడయిపోయేడు. తనతో చెప్తున్నది నిజమేనా? అని అతని కళ్ళలోకి సూటిగా చూసింది. అవి నిర్మలంగా అప్పుడే పుట్టిన పాపాయి నవ్వంత పవిత్రంగా వున్నాయి.


'ఈ రోజు ఎంత మంచి రోజు సావిత్రీ!' అన్నాడు రామనాథం ఉత్సాహంగా.

'ఎందుకు? అప్పు పత్రం మీద మొదటిసారిగా సంతకం చేసినందుకా?' సావిత్రి నవ్వుతూ ప్రశ్నించింది.

'కాదు. నాకళ్ళఎదుట ఉన్న విషయాన్ని నేను గుడ్డివాడిలా గుర్తించకుండా తిరుగుతున్న సమయంలో ఆ గుమాస్తా నాకు కర్తవ్యాన్ని గుర్తుచేసినందుకు.'

జరిగినకథ

గోమతి ఒకనాటిరాత్రి తన బాల్యాన్ని నెమరువేసుకుంటోంది. అప్పటికి ఆమెకి ఏడేళ్లు. బాగా అల్లరి చేసేది. రంగమ్మగారి కొడుకు గోవిందు ఆమె నేస్తం. అతని తప్పు తనమీద వేసుకుని ఆమె క్లాసులో దెబ్బలు తినేది. గోవిందుకు ఆమె ఎంత చెబితే అంత. ఆమెకోసం ఏ పని అయినా చేసేవాడు. వారిద్దరి అల్లరికి ఊరూ వాడా ఏకమయ్యేది. ఇలా వుండగా గోమతి తండ్రి రామనాథం ఒకనాడు ఒక కుర్రవాడిని ఇంటికి తీసుకువచ్చాడు. వాడి పేరు గోపాలం. రామనాథానికి మేనల్లుడు. వాడిని పెంచి పెద్ద చేసే భారం తనపై వేసుకున్నాడు.



'అబ్బా, ఆ చెప్పేదేదో సరిగా చెప్పండి. ఎందుకా డొంకతిరుగుడు మాటలు?' కాస్త విసుగు, కాస్త ఆత్రం మిళాయించి అంది సావిత్రి.

'మన గోమతిని గోపాలానికిచ్చి పెళ్ళిచేస్తే పిల్లా, పిల్లడు మన కళ్ళముందు ఉంటారు. మన కాలుకీ, చేతికీ అవుతారు' అన్నాడు ఒక్క వాక్యంలో తన మనోభావం అంతా వెల్లడిచేస్తూ రామనాథం.

పకపక నవ్వింది సావిత్రి. ఆమె అంత హాయిగా నవ్వి చాలాకాలం అయింది. ఎప్పుడూ గడచిపోతున్న రోజులనీ, తరిగిపోతున్న డబ్బుల్నీ

తెక్కించుకొంటూ ఇంకా నెల అంతం ఎప్పుడా అని ఎదురు చూడడంతో సరిపోతుంది ఆమెకి. ఇంకా సంతోషాలకి, నవ్వులకి సమయం ఎక్కడ మిగులుతుంది ?

అనాడు ఏదో గొప్పవిషయంలా మేనరికం గురించి భర్త మాట్లాడుతుంటే అతని అమాయకతని చూసి అంతలా నవ్వింది సావిత్రి.

'నేను నవ్వుతాలకి అనడంలేదు సావిత్రీ' అన్నాడు రామనాథం.

'నేనూ అలా అనుకోడంలేదు. ఈ విషయం ఇంతకాలానికి మీ బుర్రలోకి వచ్చిందా అని ఆశ్చర్యపోతున్నాను అంతే.'

'అయితే దీన్నిగురించి నువ్వు ఇదివరకే ఆలోచించేవా ? మరి మాటవరసకైనా నాతో అనలేదేం ?'

'ముందునుంచీఎందుకుచెప్పడం? పిల్లా పిల్లడు కళ్ళముందే ఉన్నారు. సమయం వచ్చినప్పుడు చెప్పాలనుకొన్నాను. సరే నే చెప్పవలసిన అవసరం లేకుండా మీకే ఆ ఆలోచన వచ్చింది... మంచిదే.

'మీరు గోపాలాన్ని తీసుకువస్తానని బయలుదేరిన ముందురోజు రాత్రి ఆ విషయమై మనం చాలాసేపటివరకు చర్చించుకొన్నాం జ్ఞాపకముందా ? అప్పుడు ఈ ఆలోచన నా మనసులోకి రాకపోతే, మరునాడు నా అంతట నేను మిమ్మల్ని ప్రోత్సహించి పంపేదాన్ని కాదు. వీధిలోని బాడితెచ్చి ముఖానికి పులుముకోడానికి నేనేం వెర్రిదాన్నా ? ఎవరినో ఉద్ధరించాలని అభిమానాలు వొలకపోసిందికి నేనేం గొడ్రాలునా ? నాకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఇంకా పెళ్ళి కావలసిన పిల్లవుంది. ఇటువంటి ఆలోచనరాబట్టే పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొందామనే నిశ్చయానికి వచ్చేను. భగవంతుడు అనుగ్రహిస్తే అన్నీ సానుకూలంగా జరిగిపోతాయని అనుకొన్నాను.

'గోపాలాన్ని చూసేక, ఆ పిల్లడితో కొంతకాలం గడిపేక నేను కాలుపెట్టిన మార్గం కళ్యాణ ప్రదమైనదే అని తెలుసుకొన్నాను. ఆ ఆలోచనే నాకు లేకపోతే గోపాలాన్ని ఇంత అభిమానంగా నేను చూడగలిగేదాన్నా ? అసలు వాడు మనకుటుంబంలో ఒకడుగా ఉండగలిగేవాడా ?' అంది సావిత్రి నిశ్చలంగా.

గోపాలం పట్ల భార్య చూపుతున్న ప్రేమలో కరడుకట్టిన స్వార్థానికి రామనాథం మనసు కొద్దిగా కలతపడింది. కాని, తల్లిగా ఆమె తన బిడ్డల మంచిని కోరడం తప్పు కాదు అనుకొన్నాడు. పెళ్ళికి ఆడపిల్ల ఉన్నతల్లికి ఆపాటి ముందు చూపు వుండడం అవసరమే అన్న నిర్ధారణకి వచ్చేడు

గోపాలం తన అల్లుడు అయినా

రచయిత :- నా లేటెస్టు నవల చదివారా ?

విమర్శకుడు:- చదివానండీ.

రచ : ఎలా వుందంటారు ?

విమ : ఏమిటో, ఆ నవల పంథా అదీ కొత్తగానే ఉందిగానీ, ప్లాటు ఎక్కడో సుపరిచితంగానే ఉన్నట్లుంది. ఏదేనా అధారంగా వ్రాశారా ?

రచ : వేరే ఏముంటుంది, అధారం? నా మొదటి నవల ఆధారంగా సినిమా తీశారుగా, ఆ సినిమా ఈ నవలకి ఆధారం !

కాకపోయినా ఆ పిల్లడికి తను చేయగలిగింది చెయ్యాలనే నిశ్చయానికి వచ్చేడు. అయితే అల్లుడు, కాకుంటే మేనల్లుడు అనుకొన్నాడు.

17

వెళ్ళిన వారంరోజుల నాటికి గోపాలం దగ్గరనుంచి రామనాథానికి ఉత్తరం వచ్చింది. అక్కడి హాస్టలు సదుపాయాలూ, ఇబ్బందులు, కాలేజీలో మేష్టర్లు, పిల్లలు, ఇంకా తనేమి పుస్తకాలు కొన్నది, ఏమి చూసింది, ఏమిచేసింది అంతా వివరంగా వ్రాసేడు. గోమతీ, గోవిందుల క్షేమం అడిగేడు: అత్తకి నమస్కారాలు అందజేసేడు. మీ క్షేమంతో వ్రాసే వుత్తరానికి ఎదురు చూస్తున్నానంటూ ముగించేడు.

ఆ కవరులోనే విడిగా చిన్న కాగితం మడతవుంది.

'చిరంజీవి గోమతికి' అని పట్టి వ్రాసిన పేరు దానిమీద స్పష్టంగా వుంది– రామనాథం తనకి గోపాలం వ్రాసిన ఉత్తరాన్ని చదివి ముగించి రెండవ దానిని విప్పబోయేడు.

'అది మీ రెందుకు విప్పుతారు? దానికి రాసింది దానినే చదువుకోనీండి' అంటూ అతని చేతిలోంచి అందుకుంది సావిత్రి.

'ఏమిటే! ఇప్పటినుంచి నీ మేనల్లుడు ప్రేమలేఖలు రాస్తున్నాడనుకొంటున్నావా? నేను చూడకూడదన్నట్లు అలా లాక్కుపోతున్నావు?' అన్నాడు రామనాథం దుబ్బు మీసాల చాటునుంచి చిన్నగా నవ్వుతూ.

'ప్రేమలేఖో, స్నేహలేఖో దానికి రాసింది మనమెందుకు చూడాలి?' అంది సావిత్రి.

ఆ సాయంకాలం స్కూలునుంచి

గోమతి రావడం కొంచెం ఆలస్యం అయింది. 'ఏవో పాటల పోటీలు ఉన్నాయి. కొంచెం వేళ తప్పి వచ్చినా మరేం కంగారు పడకు' అంటూ ఉదయం తల్లితో చెప్పి మరీ వెళ్ళింది.

భర్తని కూతురు ఉత్తరం చూడకుండా వారించినా తను నిగ్రహించుకోలేకపోయింది సావిత్రి. "గోమతికి గోపాలం ఏమి రాసుంటాడూ?" పదే పదే ఊహించుకో ప్రయత్నించింది. ఆ... ఏం రాస్తాడూ? ఏవో ఆటలు, పాటలు తలపుకొచ్చేయి అంటాడు. నువ్వు,గోవిందు లేకపోతే ఏదో వెలితిగా ఉందంటూ వ్రాసుంటాడు. అంతకన్నా ఏముంటాయి? గోపాలం అంతమాత్రమే వ్రాస్తే, చూస్తే తప్పేమిటి? అందులో ఎవరు పరాయివాళ్ళు?

సావిత్రి మనసుని మందలించలేకపోయింది. ఉత్తరంతీసి చదివింది. ఆమె అనుకొన్నట్లే అందులో పెద్దగా విశేషాలేంలేవు. కాగితాన్ని ఎప్పటిలా మడచి బల్లమీద పెట్టింది.

'ఆరోజు మందారచెట్టు దగ్గర సంఘటన ఎందుకో ఈరోజు నా మనసులో పదేపదే తిరుగుతున్నాది గోమతీ!' ఉత్తరంలోని ఆ వాక్యం మాత్రం సావిత్రి మనసులోంచి అంత తొందరగా తొలగిపోలేదు. ఏరోజు? మందార చెట్టుదగ్గర ఏం జరిగివుంటుంది? అనుకొంది. కానిఅంతకు మించిన సమాచారం ఆ వుత్తరంలో లేదు. కూతురువచ్చినా అడిగితెలుసుకొనే అవకాశంలేదు. అయినా కూతురి రాకకోసం ఆమె ఎదురుచూసింది.

18

చీకటిపడుతుంటే గోమతి ఇంటికి వచ్చింది.

'ఇదిగో బావ నీకు వుత్తరం రాసేడు' అంటూ దానిని అందించింది సావిత్రి.

"ఏం రాసేడు?" చేతిలో పుస్తకాలను బల్లమీదపెట్టి, వుత్తరం అందుకొంటూ గోమతి ప్రశ్నించింది.

"ఏమో, నీకు రాసేడు... నేనెందుకు చూడడమని..." కూతురి వంక పరీక్షగాచూస్తూ మాట అపివేసింది సావిత్రి.

"అదేమిటమ్మా, అలా అంటున్నావు?" గోమతి ఆశ్చర్యంగా చూసింది.

"అబ్బే... ఊరికే అన్నానే, అన్ని సంగతులు నాన్నగారికి రాసేడు. నీకూ అవే రాసుంటాడు" అంది సావిత్రి వంట యింటిలోకి వెళ్ళిపోతూ.

గోమతి వుత్తరంవిప్పి చదువుతుంటే గోవిందు వచ్చేడు.

"గోపాలం ఉత్తరం రాసేడు" అంది గోమతి.

"ఏం రాసేడేమిటి?"

"నేనింకా చదవలేదు."

ఇద్దరూ కలసి దీపానికి దగ్గరగా నిలబడి గోపాలం రూళ్ళకాగితం మీద నీటుగా వ్రాసిన ఆ వుత్తరం చదవడం మొదలు పెట్టేరు.

"ఇక్కడ కాలేజీలో నీ కన్నా అందమైన అమ్మాయిలు చాలమంది వున్నారు గోమతీ."

"అబద్ధం గోమతీ! నిన్ను ఉడికించాలని ఇలా రాస్తున్నాడు నీ కన్నా అందమైనవాళ్ళు ఈ లోకంలోనే వుండరు" అన్నాడు గోవిందు ఉద్రేకంగా.

"ఉండు. ఉత్తరం పూర్తిగా చదవనీ" అంది గోమతి తరువాత వాక్యం చూస్తూ.

"కాని వాళ్ళు నీలా నవ్వలేరు. నీలా తమాషాగా మాట్లాడలేరు. నువ్వు చూపేంత అందంగా చూడ

లేదు అందుకే నువ్వంటే నా కెంతో ఇష్టం.

హాయిగా ఏ హిస్టరీనో, ఇంగ్లీషో తీసుకొంటే ఇంటిదగ్గరేవుండి చదువుకొనేవాణ్ణి. మీ అందరికీ దూరంగా ఇక్కడికి ఎందుకు వచ్చేనా అనిపిస్తున్నాది. మాటి మాటికి నువ్వూ, గోవిందూ జ్ఞాపకం వస్తున్నారు. ఒక్కసారిగా ఎగిరివచ్చి మీ దగ్గర వాలాలనిపిస్తున్నాది. మీతో హాయిగా కబుర్లు చెపుతూ ఆడాలనిపిస్తున్నాది.

"ఆ రోజు మందార చెట్టు దగ్గర సంఘటన ఎందుకో ఈరోజు నా మనసులో పదేపదే తిరుగుతున్నాది గోమతీ!"

"మందారచెట్టు దగ్గర ఏం జరిగింది? ఏరోజు?" గోవిందు ఆత్రంగా ప్రశ్నించేడు.

"ఉగాది పండుగనాడు కొత్త బట్టలు కట్టుకొని నీ కోసం పెరట్లోకి వచ్చేను. అక్కడ బావ వున్నాడు. నా కోసం సంపెంగ పువ్వుల మాల కట్టి ఇచ్చేడు. నేను సరిగా పెట్టుకోలేకపోతే వాటిని నా జడమీద సర్ది పెట్టేడు."

"ఉత్తరంలో ప్రత్యేకం రాయడానికి, మనసులో పదే పదే తిరగడానికి అదేమంత గొప్ప విషయం. నేను నీ జడలో ఎన్నిసార్లు పువ్వులు పెట్టలేదు?"

"అదే నాకూ తెలియలేదు. బహుశా మనందరికీ దూరంలో వుండటంచేత బావకి మనతో గడిపిన ప్రతి చిన్ని విషయం ఎంతో ప్రాముఖ్యం వున్నట్లు కన్పిస్తున్నాదేమో?"

తన జీవితంలో మొదటిసారిగా గోమతి నిజాయితీని శంకించేడు గోవిందు. ఆమె తనతో నిజం చెప్పలేదు. అంతకు మించి ఇంకేదో జరిగి ఉంటుంది. లేకపోతే గోపాలం దానిని అంత ముఖ్యంగా ఉత్తరంలో వ్రాయడు — అనుకొన్నాడు.

కాని ఏమి జరిగి ఉంటుందో, అలా అని తనకి ఎందుకు అనిపిస్తున్నాదో మాత్రం అతడు తెలుసుకోలేకపోయేడు.

ఉన్నపాళంగా లేచి నిలబడి "నేను వెళ్తున్నాను" అన్నాడు.

"ఉత్తరం పూర్తిగా చదవనీ" అంది గోమతి దానిపై నుండి దృష్టి తిప్పకుండానే.

"అంతకన్న పెద్దగా ఏముంటాయి సంగతులు? అన్నీ ఇటువంటి చవకబారు కబుర్లే రాసుంటాడు" అన్నాడు గోవిందు కాలు కదుపుతూ.

నిజానికి ఆ మందారచెట్టు దగ్గరి సంఘటన అతని మనసులో బండలా పడింది. గోపాలం వ్రాసిన ఉత్తరాన్ని కళ్ళనిండా వెలుగుని నింపుకొని, ఆప్యాయంగా గోమతి చదువుకొంటుంటే అనతికాలంలోనే అది కొండగా మారే ప్రమాదం ఉంది. ఆ బరువు క్రిందపడి తను నేలమట్టం కాకుండా ఉండేందుకు దూరంగా తొలగిపోయేడు గోవిందు.

అయినా మనసు గోమతి సాన్నిధ్యాన్ని విడిచి రానంటున్నాది. తమ ఇంటి గుమ్మం ఎక్కి వెనుతిరిగి చూసేడు. ఓపానికి దగ్గరగా గోమతి పాలరాతి బొమ్మలా మెరసిపోతున్నాది. ఆమె చేతిలో ఆ ఉత్తరం అలాగే ఉంది. కాని, ఆమె చూపులు ...

బహుశ తనూ ఆ సంఘటన తలపుకి తెచ్చుకొంటూ మురిసిపోతున్నాదేమో — అనుకొన్నాడు గోవిందు అక్కసుగా.

ఆ రాత్రి అతడు భోజనం చెయ్యలేదు. రాత్రంతా పక్కమీద నిద్ర పోకుండా ఇటు, అటు దొర్లుతూనే ఉన్నాడు.

మరునాటి ఉదయం ఉషఃకన్యలా గోమతి ముస్తాబయి, పుస్తకాలు చేత్తో పట్టుకొని "గోవిందూ" అని పిల్చేసరికి మంత్రించినట్లు ఆమె వెనుకగా బయలుదేరాడు.

గోమతి నవ్వుతూ ఎప్పటిలా తనతో కబుర్లు చెప్తుంటే, ముందు రోజు అతడు మనసు కెత్తుకొన్న బరువుకాస్తా గాలి కన్న తేలికై ఆకాశంలోకి ఎగసిపోయింది.

నిజంగా ఏమీ జరిగి ఉండదు. ఆ గోపాలంగాడు తన్ను ఏడిపించాలని అలా వ్రాసి ఉంటాడు — అనుకొన్నాడు గోవిందు.

19

గోపాలం, గోమతుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతుండగానే రెండు సంవత్సరాలు గడచిపోయేయి.

మధ్య కాలంలో పండుగ సెలవలకి, వేసవి సెలవలకివచ్చి వెళ్తుండేవాడు. ఇంట ఉన్నప్పుడుకాని, ఉత్తరాలలో కాని గోమతీ, గోపాలాల మధ్య బాల్యంనాటి స్నేహానికి మించి ఇంకే విధమైన అనుబంధం పెరుగుతున్నట్లు సావిత్రికి కన్పించలేదు.

ఈనాటి పిల్లల బుద్ధులే వేరు. ఒక్కొక్క సమయంలో వాళ్ళ ఆలోచనలు వింత, వింత పుంతలు తొక్కుతూ, పెద్దవాళ్ళ ఆశలను నేల మట్టం చేస్తాయి. అటువంటి ప్రమాదం రాకుండా ముందుగా మేలుకోవాలి — అనుకొంది సావిత్రి.

పేజీలకి పేజీలు సాహిత్యం గురించి, సినిమాల గురించి, సంఘపు కట్టుబాట్లు గురించి వాటికి బలి అయిపోయిన నిర్భాగ్యుల గురించి ఉత్తరాలలో వ్రాసే గోపాలం "నిన్ను నేను ప్రేమిస్తున్నా ననో; లేక మీ అమ్మా నాన్నా

మన పెళ్ళి గురించి ఏమనుకొంటు న్నారనో వ్రాయలేకనే ఊరుకొంటు న్నాడా? ఇందులో కుంభకోణం ఇంకేదో ఉంది. సాధ్యమైనంత త్వరలో దాని రూపురేఖలు తెలుసు కోవాలి. ఆ మూడు ముళ్ళూ పడేలా చూడాలి. ఏమైనా హెచ్చు తగ్గులుంటే అటు తరువాత అవే సర్దుకొంటాయి. ఈ వేసవిలో గోమతి పెళ్ళి జరిగిపోవాలి అనే నిర్ధారణకి వచ్చింది సావిత్రి.

సంక్రాంతి పండుగ వెళ్ళిన నాల్గు రోజులనాడు గోమతి పుట్టిన దినం వస్తుంది. పండుగ సెలవలకి వచ్చిన గోపాలాన్ని ఆ రోజు వరకు ఆగి వెళ్ళమని కోరింది గోమతి.

ఆమె మాట కాదని వెళ్ళి పెద్దగా అక్కడ చేసే పనులేం లేవు. కాలేజీలు తెరచిన నాలుగైదు రోజుల వరకు క్లాసులకి పిల్లలు తిన్నగా రారు. పాఠాలు అంతంత మాత్రం గానే జరుగుతాయి. ఆ పాటి దానికి గోమతిని ఎందుకు చిన్న బుచ్చాలి—అనుకొన్నాడు గోపాలం. 'అలాగే గోమతీ! నీ ఆజ్ఞకి తిరుగుందా' అన్నాడు.

గోమతి తలకి నీళ్ళు పోసుకొని, కొత్త చీర కట్టుకొంది. తడిజుట్టును ఒదులుగా జడ అల్లుకొని, చేమంతి పువ్వులు పెట్టుకొంది. కళ్ళకి సన్నగా కాటుక దిద్దుకొని నుదుటిమీద దోసగింజ ఆకృతిలో బొట్టు పెట్టు కొంది. అద్దంలో తన అందాన్ని తనివితీరా చూసుకొని గోపాలం దగ్గరికి వచ్చింది.

'ఈ చీర ఎలా ఉంది బావా?' అని అడిగింది. ఈ చీరలో నేను ఎలా ఉన్నాను అని అడిగేందుకు సిగ్గుపడింది గోమతి.

'చీర ఎలా ఉందో నేను చెప్ప లేను కాని, ఆ చీరలో నువ్వు ఎలా ఉన్నావో చెప్పమంటే చెప్తాను' అన్నాడు గోపాలం కొంటెగా నవ్వుతూ.

'ఊ... పోనీ... అదేనా చెప్పు?' అంది అతడి కళ్ళ లోకి అప్యాయంగా చూస్తూ గోమతి.

'పెళ్ళికూతురిలా ఉన్నావు' వంటఇంటిలోంచి కాఫీ కప్పులతో ఊడిపడిన సావిత్రి మాట అందు కొంది. అవునా, కాదా అన్నట్లు గోపాలం వైపు ప్రశ్నార్థకంగా చూసింది.

నాలుక చివరకి వచ్చిన మాటని గొంతులో కుక్కుకుని, రాని నవ్వు పెదవుల పైకి తెచ్చుకొంటూ ఏడవ లేక నవ్వినట్లు నవ్వేడు గోపాలం.

క్షణకాలం గోమతి కళ్ళు ఆశా భంగంతో వాలిపోయేయి.

'ఇప్పుడు మళ్ళా కాఫీ ఎందుకమ్మా?' అంది విసుగుదలతో.

'కాఫీకేమిటే. ఎన్నిసార్లయినా తాగవచ్చు. నా వంట పూర్తి అయ్యేం దుకు ఇంకా ఆలస్యం ఉంది' అంది సావిత్రి.

'మామూలు రోజుల్లోనే అపరాహ్నం తిరుగుతేకానీ మీ అమ్మ చేతి ప్రసాదం అందదు. అందులో ఈ రోజు ముద్దుల కూతురు పుట్టిన రోజాయెను. పలురకాల పిండి వంటలు దండిగా తయారు కావద్దూ' గదిలోంచి వచ్చి కాఫీ కప్పు అందు కొంటూ అన్నాడు రామనాథం.

'నలభై తొమ్మిది ఇడ్లీలు తిన్నా నంటావు కదా, ఆ ఒక్కటీ తిని యాభై చెయ్యలేకపోయావుటయ్యా!'

'సరేలే! యాభై ఇడ్లీలు తిన్నానంటే ఎవరైనా నమ్మొద్దూ?'

20

కాఫీ తాగి అత్తయ్యగారింటికి ఒకసారి వెళ్ళి వస్తానంటూ రంగమ్మ గారి వాటా వైపు నడచింది గోమతి. గుమ్మంలోనే గోవిందు ఎదురుపడ్డాడు.

'జన్మదిన శుభాకాంక్షలు గోమతీ' అన్నాడు అందంగా పెట్టెలో అమర్చిపెట్టిన అరడజను రుమాళ్ళను అందిస్తూ.

'మీ ఇంటికి నా అంతట నేను వస్తేనే అందజెయ్యడం' అంది గోమతి మూతి ముడుస్తూ.

'నేను మీ ఇంటికి రావాలనే బయలుదేరాను. ఇంతలో నువ్వు రానే వచ్చేవు' తన తప్పు లేదని వాదించేడు గోవిందు.

'థ్యాంక్యు ... ఊరకే అన్నాను గోవిందూ. అత్తయ్య ఏదీ? నమస్క రించి పోవాలని వచ్చేను.'

'అమ్మా గోమతి నమస్కరించ డానికి వచ్చిందే. అతి మంచి ఆశీ

ర్వచనం సిద్ధం చేసుకొని మరీ బయటికిరా' అంటూ అరిచేడు గోవిందు.

పక్క గదిలో ఉన్న రంగమ్మ గోవిందు కేక విని 'ఏమిటిరా గోవిందూ! ఎప్పుడూ పరిహాసాలే' అంటూ అక్కడికి వచ్చింది.

గోమతి రంగమ్మకి నమస్కరించింది.

'వేగరం పెళ్ళి కూతురివై, పిల్లా పాపతో, సిరిసంపదలతో పది కాలాలపాటు చల్లగా వర్ధిల్లాలి తల్లీ' అంటూ గోమతి భుజాలు పట్టుకొని లేవనెత్తింది రంగమ్మ.

కొత్త బట్టలు కట్టుకొని అమ్మకి, నాన్నకి నమస్కరించకుండా వచ్చి వేసిందన్న సంగతి అప్పుడే గోమతి మనస్సులో కదిలింది.

ఆ రోజు ఎందువల్లనో అందరి కన్న ముందుగా గోపాలం శుభాకాంక్షలు అందుకోవాలనిపించింది గోమతికి. కాని, తల్లి అంతలోనే పానకంలో పుల్లలా అక్కడికి తయారై ఆమె ఆనందాన్ని అణచి వేసింది. అటు తెరువాత నమస్కారాలు, ఆశీర్వచనాల మాటే ఆమె మరచి పోయింది. కోపంతో విసుక్కొంది.

తన విదిలింపుతో తల్లి ఏమనుకొందో అన్న మాట గోమతి మనసులోకి వచ్చి కలత పెట్టింది.

'మళ్ళా వస్తాను' అంటూ బైటికి నడిచింది.

'నీ అలంకరణ అంతా బాగుంది కాని, జడలో ఆ చేమంతి పువ్వులు చీర రంగుకి సరిగా అమరలేదు, ఆకు సంపెంగలయితే ఎంతో అందంగా ఉండేవి' అన్నాడు గోవిందు ఆ పువ్వుల్ని ఇటు అటు సర్దుతూ.

'ఏవీ ... నువ్వు మరి తెచ్చి పెట్టేవా? అన్నీ కబుర్లకే గాని' అంది గోమతి నవ్వుతూ.

'ఇప్పుడు పోయి తెస్తానుడు' గోవిందు అడుగు ముందుకి కదిపేడు.

అతని చేతిని పట్టుకొని వారిస్తూ 'ఊరకే అన్నాను గోవిందూ! ఆ పువ్వులంటే చిన్నతనంలో అంతగా పడిచచ్చేదాన్ని కాని, ఇప్పుడు అన్ని రకాల పువ్వులూ నాకు ఇష్టంగానే ఉంటాయి.'

'ఏమో నా మట్టుకి ఇప్పటికీ నీ జడలో అవే అందంగా కన్పిస్తాయి.'

'అది సరేకాని, సాయంకాలం అందరం కలసి మా ఇంట్లో కాఫీ తీసుకొందాం. రేపు బావ వెళ్ళి పోతాడు కూడా. సరదాగా కబుర్లు చెప్పుకొందాం. వస్తావు కదూ' అంది గోమతి.

'ఓ ... అలాగే. అడగందే దేవత వరమిస్తానంటే ఒద్దంటానా?'

'ఛీ ... కొంటె పిల్లాడా! ఎప్ప

ఒకే ప్రశ్న - రెండు జవాబులు

'ఈ గుడ్డలు ఎక్కడ కొన్నారు?' అని మీరు ఒక పురుషుణ్ణి అడిగారనుకోండి. 'ఫలానా బట్టల షాపులో' అని వెంటనే సమాధానం వస్తుంది. అదే ఒక స్త్రీని అడిగారనుకోండి—

'ఏం, బాగా లేవా?' అని వస్తుంది సమాధానం; కాదు, తిరుగు ప్రశ్న.

టికీ నీ మాటలు ఒక్కలాగే ఉన్నాయి. నేనేం దేవతని, దెయ్యాన్ని కాదు. గోమతిని... నీతో ఆడిపాడిన గోమతిని... తెలిసిందా' అంది గోమతి వెనుతిరిగి వెళ్ళిపోతూ.

'కాని... నా కంటికి నువ్వు దేవతలాగే కన్పిస్తున్నావు.'

'అయితే... ఒక పని చెయ్యి. రోజూ ఇన్నిపువ్వులు, పత్రి, కొబ్బరికాయ తెచ్చి పూజ చెయ్యి' గోవిందుని చూసి చెయ్యి ఊపుతూ గోమతి తమ ఇంటిలోకి వచ్చింది.

'ఎవరికి పూజ గోమతీ? ఏమిటి సంగతి?' అన్నాడు గోపాలం.

'గోవిందు కళ్ళకి నేను దేవతలా కన్పిస్తున్నానుట. అయితే పువ్వులు, పత్రి తెచ్చి పూజ చెయ్యి' అంటున్నాను అంది గోమతి నవ్వుతూ.

గోమతి మాటలు విని సావిత్రి నడవలోకి వచ్చింది.

'అయ్యోయా తల్లీ నీ పెత్తనాలు? ఎవరి కళ్ళు ఎలాటివో బుగ్గన దిష్టి చుక్క పెట్టాలనుకొన్నాను. అంతలోనే వెళ్ళిపోయేవు' అంది సావిత్రి.

'ఫో... అమ్మా నువ్వు మరీను. దిష్టి తగలడానికి నేనేం చంటిపాపనా?' అంది గోమతి గారంగా మాటని సాగదీస్తూ.

'నీ కూతురికి అటువంటి దిష్టి తగులుతుం దనుకొంటే, నువ్వు ఆ చుక్క పెట్టేలోపునే తగిలిపోయి ఉంటుంది అత్తా' అన్నాడు గోపాలం చిలిపిగా గోమతివైపు చూస్తూ.

'ఒకరికి ఇద్దరు తోడయేరు. నేను మీతో మాట్లాడనే మాట్లాడను' గోమతి చిరుకోపంతో ముఖం తిప్పుకొంది.

'మాట్లాడకపోతే పోట్లాడు; ఇంకేదైనా చెయ్యి కాని మౌన వ్రతం మాత్రం పట్టకు' అన్నాడు గోపాలం.

'సరే... మీ రిద్దరూ అటులే ఆడుకొంటారో, వాడులె ఆడుకొంటారో, మీతో కూర్చుంటే నా పని కాదు' అంటూ వంట ఇంటిలోకి దారి తీసింది సావిత్రి.

గోమతి తల్లిని అనుసరించి వెళ్ళింది. ఒక్కక్షణం తటపటాయించి, పంచాగ్నుల్లా మండుతున్న కుంపట్ల మధ్య వంగి, తల్లి పాదాలు అంటుతూ నమస్కరించింది.

'ఇదేమిటే మొద్దూ ... కొత్త చీర కొంగు ఆ కుంపట్లో పడగలదు' అంటూ ఆప్యాయంతో మందలించింది సావిత్రి.

'ఫో... అమ్మా! నేను నమస్కరిస్తుంటే దీవించకుండా ఎద్దూ మొద్దూ అంటావు' గోమతి అలుకతో మూతి బిగించింది.

'దొంగ జొచ్చిన అరునెల్లకి కుక్క మొరిగిందట. అలా ఉంది నీ వరస. అయినా నీ నమస్కారాలతో పనిలేకుండా నా దీవన ఏదో నేను దీవించేను కాదుటే' అంది కూతురి ముంగురులు సవరిస్తూ సావిత్రి.

గోమతి కళ్ళలో లీలగా నీళ్ళు కదలాడేయి. గొంతుకలో దుఃఖం గురగుర లాడింది.

'నీకు ఎప్పుడూ నా పెళ్ళి ధ్యాసేనా? నన్ను వదిలించుకోవాలని నీకు ఎందుకమ్మా అంత తొందర? కడుపున పుట్టిన ఆడపిల్ల తల్లికి కూడా అంత బరువై పోతుందా అమ్మా?

'పిచ్చి తల్లీ నువ్వు నాకు బరువేమిటమ్మా! నీ పెళ్ళి పేరంటంచేసి, నువ్వు పిల్లా, పాపతో ఉంటేచూసి ముచ్చట పడాలనే తొందరవల్ల అలా అంటాను కాని. ఇంతకీ నిన్ను ఎక్కడికి అంపకం పెడ్తాను. నువ్వూ, బావా మా కళ్ళముందరే నవ్వుతూ, తుళ్ళుతూ...'

'గోమతీ! నువ్వు ఇక్కడికి చేరేవా? ఇంక ఈ రోజుకి మీ అమ్మ వంట అయినట్లే. నీ పుట్టిన రోజు పూటా మేము పస్తు పడి ఉండవలసిందే' అన్నాడు రామనాథం స్నానంచేసి ఇంట్లోకి వస్తూ.

'నేనేం మాటలలో పెట్టలేదు నాన్నా, అమ్మకి పని సాయం చేద్దామని వచ్చేను' అంది గోమతి పైట కొంగుని నడ్డిచుట్టూ తిప్పి ముందుకి దోపుకొంటూ.

'చాల్లే ... ... ఆ కొత్త చీరతో ఈ రోజు నువ్వేం పని సాయం చేయనక్కరలేదు. నువ్వు కాళ్ళకి అడ్డు పడకుండా అవతలకి నడుస్తే సాయం చేసినంత ఫలితం' అంది సావిత్రి పులిహారలో పోపు కలుపుతూ.

21

సాయంకాలం ఐదు గంటల సమయం. రామనాథం తన చిన్ననాటి ముచ్చట్లు ఉత్సాహంగా కూతురికి, మేనల్లుడికి చెప్పుకు పోతుంటే, సావిత్రి కాఫీ ఫలహారం తెచ్చి పెట్టింది.

అతా తలొక ప్లేటు అందుకొన్నారు. మిగిలిపోయిన ప్లేటుని చూస్తూ 'గోమతీ. గోవిందు వస్తాడన్నావు. రాలేదేం?' అంది సావిత్రి.

'అరే... అప్పుడే అయిదయిందే. మాటల్లో పడి ఆ సంగతే మరచిపోయేను. గోవిందు నాలుగింటికే వస్తానన్నాడు. ఉండు ... పిలుచుకొస్తాను' అంటూ చేతిలో పట్టుకొన్న ప్లేటుని బల్లమీద ఉంచి లేవబోయింది గోమతి.

'ఒకసారి చెప్పేవు కదా! రావాలనుకొంటే తనే వస్తాడు. మళ్ళీ మళ్ళీ పిలవాలా ఏమిటి?' అంది సావిత్రి.

'అదేం మాటమ్మా, నేను పిలిస్తే గోవిందు రాకుండా ఎలా ఉంటాడు? తెలిసి కూడా అలా అంటావేం? ఎందుకు రాలేదో కనుక్కురానీ.'

'సరిలే ... నువ్వు కూర్చో. నే పిల్చుకొస్తాను. మాటిమాటికి నువ్వు వారింటికి ఇలా పరుగులు పెడ్తుంటే, ఇరుగు పొరుగులు ఏమనుకొంటున్నారో కాస్త తెలుసుకో.'

'ఇందులో ఈ రోజు కొత్తగా వచ్చింది ఏముందమ్మా? చిన్నప్పటి నుంచి ఆ ఇంటు, ఈ ఇంటు తిరుగుతున్న దాన్నే కదా?'

'అప్పటి సంగతి వేరు. పెద్దదానివవుతున్నావు. కాస్త మంచీ, మర్యాదా చూసుకోవాలి.'

'ఎవరో ఒకరు పిల్చుకురండి. అరిటికాయ బజ్జీలు, ఉప్మా చప్పగా చల్లారి పోతున్నాయి' అన్నాడు రామనాథం.

సావిత్రి గడప దిగి వాకిట్లో నాలుగు అడుగులు వేసి, 'గోవిందూ... గోవిందూ!' అంటూ పిల్చింది. ఆమె పిలుపువిని రంగమ్మ వరండాలోకి వచ్చింది.

'రంగమ్మొదినా! గోవిందు ఏం చేస్తున్నాడు?'

'మీ ఇంటికి రాలేదూ? గోమతి పిల్చిందంటూ మూడు గంటలకే ఇంట్లోంచి వెళ్ళిపోయేడు.'

'రాలేదే ... ఇంకెక్కడికైనా వెళ్ళేడేమోమరి. తిరిగివస్తే వెంటనే పంపించండి' అంటూ వెను తిరిగింది సావిత్రి.

వీడు వాళ్ళింటికి వెళ్ళక ఆవేళప్పుడు ఎక్కడికి పోయేడు? ఇంత త్వరగా పోతున్నావు మీ అత్తయ్య చేసే ఫలహారాలు ఇంకా సిద్ధం కావురా, అంటే ... పోనీ నేను

అత్తయ్యకి సాయం చేస్తాను — అన్నాడు నవ్వుతూ. మరి ఎక్కడికి వెళ్ళినట్లు? ఏం చేస్తున్నట్లు? రంగమ్మ ఆశ్చర్యపోయింది.

గోమతి కూడా ఆ మాటే అనుకొంది. తప్పక వస్తానన్న గోవిందు ఎందుకు రాలేదు? ఎక్కడికి వెళ్ళి ఉంటాడు?

'వాడికోసం మీరంతా కాచుకొని కూర్చోనక్కరలేదు. మీ పని కానివ్వండి. గంటకో, గడియకో వాడే వస్తాడు' అంది సావిత్రి.

తల్లి నొచ్చుకొంటుందని గోమతి ఫలహారం తింటున్నదే కాని ఆమె మనసంతా గోవిందుకోసం వెతుకులాడుతూనే ఉంది. వస్తానని చెప్పి రాకపోయే రకం కాడే. అందునా తన పుట్టినరోజు పూట, తను స్వయంగా పిలిస్తే గోవిందు రాకపోవడమేమిటి? ఎక్కడికిపోయి ఉంటాడు? ఏం జరిగి ఉంటుంది?' గోమతి మనసులో ఆలోచనలు తెర్లుతూనే ఉన్నాయి.

అరగంట గడచినా గోవిందు రాలేదు. చుట్టూ ఉన్నవారు ఉత్సాహంగా మాట్లాడుతుంటే ముఖం ముడుచుకొని కూర్చోవడం గోమతికి బాగా లేదనిపించింది. మెల్లమెల్లగా తనుకూడా వారి మాటలతో మాట కలిపింది.

ఆరోజు అందరిలోకి అమితోత్సాహంగా మాట్లాడుతున్నవాడు గోపాలం. ఆనాటి బావ మాటల తీరు, ముస్తాబులో కొత్తదనం గోమతిని అతనినుండి కళ్ళుతిప్పుకోనియ్యకుండా చేసేయి.

గోమతిని గురించి మాట్లాడుతున్నప్పుడు మేనల్లుడు చూపుతున్న ఉత్సాహం, కూతురు కన్నార్పకుండా చూస్తూ అతని మాటల్ని ఆత్రంగా వింటున్న తీరు చూసి సావిత్రి మనసు తేలిక పరచుకొంది.

అనురాగానికి, అభిమానానికి ఇంతకన్న నిదర్శనం ఏంకావాలి? ఎంత బావా మరదళ్ళయినా, మనసులో ఉన్నవారు ఇంతకన్న ఎలా పూసుకు తిరుగుతారు—అనుకొంది.

ఆరాత్రి భోజనాల దగ్గర పెళ్ళి విషయం కదిపి చూడాలని నిశ్చయించుకొంది. అ చూసింది కి ఏముంది? పిచ్చి సన్నాసి. వాడు మాత్రం ఏమంటాడు సిగ్గుగా బుర్ర వంచుకొని 'మీ ఇష్టం అత్తా' అంటాడు అన్నం కెలుకుతూ. లేకపోతే క్రీగంట గోమతిని చూస్తూ చిన్నగా నవ్వుతాడు.

(సశేషం)

పనికిరాని పరిజ్ఞానం

ప్రపంచ భాషలన్నిటిలోకి అతి వేగంగా మాట్లాడ్డానికి వీలైనది ఫ్రెంచిభాష. ఫ్రెంచిని నిమిషానికి 350 సిలబుల్స్ చొప్పున మాట్లాడవచ్చు. ఇంగ్లీషులో నిమిషానికి 220 సిలబుల్స్ మాత్రమే.

♦

వాన నీటి బొట్టు ఆకారం ఎలా వుంటుంది? చిత్రకారులు బొమ్మల్లో వేసినట్టు కోలగా కాదు. వలయాకారంగా వుంటుంది.

♦

పావురాన్ని శాంతికి చిహ్నంగా తలుస్తారు. కాని, అది ఏమంత సాధు స్వభావం కల పక్షి కాదు. అవసరమైతే డేగ అంత క్రూరంగానూ పావురం వుండగలదు. శత్రువులను నిర్దాక్షిణ్యంగా చీల్చి చెండాడడంలో అది దేనికీ తీసిపోదు.

♦

భూమిని ప్రతి సెకండుకు నూరు మెరుపు (లైట్నింగ్స్) చొప్పున తాకుతూ వుంటాయి. ఒక్కొక్కటి కొన్ని లక్షల వోల్టుల శక్తి కలది. ఒక్కొక్క దానిలో వెయ్యినుంచి 3,40,000 యాంపియర్ల కరెంట్ వుండవచ్చు.

♦

ప్రపంచంలోకెల్లా పెద్ద పల్లెటూరు ఎక్కడుందో తెలుసా? ఇల్లినాయ్ (అమెరికా) రాష్ట్రంలో చికాగో సమీపంలో. ఆ గ్రామం పేరు స్కోకీ. దాని జనాభా 65, 282. అయినా, దాన్ని 'విలేజ్' (పల్లెటూరు) గానే పరిగణిస్తున్నారు.


♦

చంద్రుడు మనకి ఒక మైలు అటూఇటూగా 2, 38, 866 మైళ్ళ (సగటు) దూరంలో వున్నాడు. ఇదివరకు ఇంతకంటె తొమ్మిది మైళ్ళ దగ్గరలో వున్నాడని పొరబాటు పడేవారు. ఇప్పుడు కరెక్టుగా కనుక్కున్నారు.

—బాబ్జీ

(4)

మిత్ర సంతర్పణలు అను ప్రైవేటు మాష్టారు విజయం



పెండ్యాల నాగాంజనేయులు

"హాఁ! అంటూ బోర్లాపడ్డాడు సర్వయ్య.

"అయ్యబాబోయ్" అంటూ వెల్లికిలా బడ్డాడు కైలాసం.

"మహాప్రభో" అంటూ మూర్ఛబోయాడాచారి.

"హారి భగవంతుడా" అంటూ తెల్లమొహంవేసి కళ్ళప్పగించి చూశాడు అవతారం—గుండెలు దడదడలాడుతుండగా.

ఇదంతా జరిగినప్పుడు ఆచారి నోట్లో గుత్తొంకాయ, సర్వయ్య నోట్లో మామిడికాయపప్పు, కైలాసం నోట్లో దోసావకాయ, అవతారం చేతిలో మజ్జిగ, పులుసుగిన్నె వున్నాయి.

ఈ పదార్థాలన్నీ తెచ్చినవాడు అవతారం — సృష్టించింది అతని అర్ధాంగి సుందరమ్మ.

నాలుగేళ్ళుగా తాలుకాఫీసులో గుమాస్తా హోదాలో తాసిల్దారు చేత చివాట్లుతింటూ, హోటళ్ళలో గడ్డిమేస్తున్న అవతారానికి భార్య కాపురానికి రావడంతో అంతకు ముందురోజునుంచే అన్నప్రాప్తి కలిగింది.

అందుకే ఆఫీసుకు అన్నం మూట గట్టుకొచ్చాడారోజు.

ఆఫీసులో బూతులూ, లంచాలూ భోంచేస్తూ ఇంటికెళ్ళి అన్నం తింటూండే సర్వయ్య, ఆచారి, కైలాసం—వెధవ తిండిమొహం ఎరగవట్టు ఆ అన్నంమూటమీది కెగబడ్డారు మధ్యాహ్నం భోజనాల వేళలో.

అందుకూ ఇంత గొడవ!

ఎక్కడ్నించో ఓ కాకివచ్చి అవతారం చేతిలోని పులుసుగిన్నె తన్నడం, అందులోసరుకంతా అందరి ముఖాలమీదకి పంపిణీ కావడం జరిగితేగాని ఒక్కళ్ళూ ఈ లోకంలోకి రాలేకపోయారు.

అవతారం గుండెదడ సర్దుకుంది.

"అమ్మయ్య! బతికారుగదా. ఒక్కొడూ తలోటీ నోట్లో పెట్టుకోగానె ఆర్తనాదాలు చేస్తూ పడిపోతేనూ విషపదార్థాలేమోనని భయపడ్డాను" అన్నాడు గుండెమీద ఎడంచేత్తో రాసుకుంటూ — సంతోషంగా నిట్టూరుస్తూ.

"రేయ్! నీ నాలుక వేయిచీలికలు చేస్తాను. ఈ గుత్తొంకాయ విషపదార్థంట్రా. ఆ మహాసతి అనసూయ మాత్రం ఇంతబాగావండగలదురా?" అంటూ ఆచారి గుడ్లెర్ర జేశాడు

మీసం తిప్పడం మొదలెట్టాడు కైలాసం దోసావకాయ రుచికి లొట్టలేస్తూ.

లాల్చీ చేతులు మడవసాగాడు సర్వయ్య: మూతిచుట్టూ అంటుకున్న మామిడిపప్పును నాలుకతో గొంతులోకి ఈడుస్తూ.

అవతారానికి విషయం అర్థమైంది. వాళ్ళంతా తనభార్య వంట నింతగా మెచ్చుకుంటున్నందుకు ఒళ్ళు చేయడం మొదలెట్టాడు. ఆ కారణంగా తొడుక్కున్న గుడ్డలు చిరిగిపోతాయేమోనని భయపడి కాస్తతమాయించుకున్నాడు.

"మీరంతా ఇంత గొప్పగా ఎందుకు పొగుడుతున్నారో నాకేం అర్థం కావడంలేదు. దానిమొహం వంట అదీనూ! మీ ఆడంగుల వంటు ముందు ఈ వంటెంత? వెధవదీ..." అంటూ సాగదీశాడు — మరోసారి వాళ్ళు పొగిడితే వినాలని.

ఆచారికి ఛర్రుమంది. "ఒరేయ్! వెధవ కూతలు కుయ్యకు! మా యావిడ వండిన గుత్తొంకాయకూర ను వ్వెప్పుడన్నా తిన్నావా? తిన్నావా అని? అదే గనక నువ్వు తినగలిగితే ఈ పంగనామాలు చెరిపేసి వీభూతి పెట్టుకుంటా! "శివలింగం" అని పేరెట్టుకుంటా!! పిలక చెరిపేసి క్రాపింగు చేయించుకుంటా!!! నున్నటి ఈ మూతిమీద ఫ్రెంచికటింగ్ మీసం ఎరువేసి పెంచుతా. ఇదే పందెం!

"ఇదే నా ప్రతిజ్ఞ! ఏమంటావ్?" అన్నా డెగిరిపోతూ.

"ఛ ఛ! ఎందుకులేరా అంతంత ప్రతిజ్ఞలు!" అన్నా డవతారం లోపలే సంతోషపడిపోతూ.

ఇహ సర్వయ్యకు ఛాన్సు దొరికింది. "వాడిదంతా వట్టి చొల్లు! వాళ్ళావిడవంట అదిరిపోతుంది. కానీ, మా యావిడచేసే వంటకాల్లో రంగుని బట్టిగాని, రుచినిబట్టిగాని వాసననిబట్టిగాని 'ఇది ఫలానా పదార్ధం' అని గుర్తుపట్టగలిగితే నేని అప్పర్ డివిజన్ గుమాస్తాలోంచి లోయరు డివిజన్ గుమాస్తాలోకి దిగజారిపోతా! తిని వాంతి చేసుకోకుండావుంటే నేను పట్టెలంచాల ధరలు పెంచి అవన్నీ నీకే ధార పోస్తా. జీర్ణించుకోగలిగితే. నా సీట్లో కాగితాలన్నీ మురగబెట్టి, ఆఫీసరుతో చీవాట్లుతిని, ఛార్జీలు ఫ్రేంచేయించుకుంటా! ఇది నా ప్రతిజ్ఞ! ఏమంటావ్ మరి?" అంటూ అవతారం వీపుమీద చరిచాడు.

అవతారానికి మరో డిగ్రీ సంతోషం పెరిగింది. "ఎందుకురా పాపం ఆ ఇల్లాలినలా చిన్న బుచ్చుతావూ?" అంటూ మందలించపోగాడు.

"ఒరేయ్ అవతారం! వాళ్ళిద్దరి మాటలూ నమ్మకు! నే తిన్నాగా! బ్రహ్మాండంగా వండుతారు వాళ్ళిళ్ళల్లో. చొల్లు వెధవలు. తినీ తెగ గునుస్తాడు" అంటూ అవతారాని కడ్డం పడ్డాడు కైలాసం.

"నీ గొడవేమిటి నాయనా?" చిరునవ్వుతూ ప్రశ్నించా డవతారం.

"అసలు ఊరగాయలనేవిఎందుకు పెడతార్రా?" నిల్దీసి అడిగాడు కైలాసం.

"ఎందుకేమిటి నీ పిండాకూడు! తింటానికి" తేలిగ్గా తేల్చేశా డవతారం.

"ఛఛ నోర్ముయ్!" అంటూ ఒంటి కాలిమీద లేచాడు కైలాసం.

"ఏమిట్రా?" తెల్లబోయా డవతారం.

"ఏమీలేదు. ఇహ నిన్ను నేను ప్రశ్నలడగను. నువ్వు నాకు సమాధానం చెప్పొద్దు. అన్నీ నేనే చెప్తా! చక్కగా నువ్వు వచ్చినట్టు విను."

కళ్ళు మూసుకుని, తలవేళ్ళాడేసి ఫొటో దిగబోయే శవంలాగా గోడకి జార్లబడి పోయా డవతారం. కైలాసం గొంతెత్తాడు.

"అసలు ఊరగాయలనేవి ఒకసారి మనం వాటి నేర్పాటుచేస్తే కనీసం ఒక సంవత్సరంపాటు రూప, లావణ్య, తేజ, సౌరభ, రుచ్యాదుల నాష్టే కోల్పోకుండా మనల్ని సంతోషపెట్టాలి. అది ధర్మం! అదే న్యాయం! అదే ఆంధ్ర జాతీయ సత్యం! వీటినన్నిటినీ ధిక్కరిస్తాయి మా శ్రీమతి పెట్టే ఊరగాయలు. మర్నాటినించే నల్లబడిపోతాయి.



మూడోనాటినుంచే బూడిదరంగు వెల్వెట్ లాంటి బూజు ఉదయిస్తుంది. 'రుచి' అనేది వూరితేనేగాని రాదుగదా! అసలు వూరడానికే ఛాన్సు లేనప్పుడు రుచి విషయం మాట్లాడ్డం మనకు సాధ్యమా? కాదు. ఇహ వాసనంటారా? మృతమూషిక పరిమళం... అక్కడికి ఓ జనాదరణ పొందిన పత్రికలో అవిడెవరో ఉపదేశించిన పద్ధతుల్లోనే పాళ్ళన్నీ పోస్తుందట! అనుభవజ్ఞురాలయిన గంగా భాగీరథీ సమానురాళ్ళ సలహాలూ పుచ్చుకుంటుందట.

నూటయాభై సంవత్సరాల వయసున్న స్కాచ్ విస్కీ పోసినా ఆ ఊరగాయల ఖర్మంతేనని నా దృఢ విశ్వాసం. సరే...అసలు విషయానికొస్తా!

వాళ్ళిద్దరూ వాళ్ళవాళ్ళ భార్యల వంటకాల విషయంలో కొన్ని ప్రతిజ్ఞలు చేశారు గాబట్టి అంతకన్నా కఠినమైన ప్రతిజ్ఞ నేనూ చేస్తాను.

శవాల్ని నిలవజేసే రసాయనిక ద్రవాల్లోనైనా సరే, మా యావిడ పెట్టిన ఊరగాయని ఒక్క వారం రోజులు నిలవ చేయగలిగితే మా అత్త

గారిసీ, బావమరిదినీ ట్రంక్ కాల్ చేసి పిలిపించి, ఏడు సంవత్సరాల పాటు నా నెత్తి నెక్కించుకొని పిండి కొట్టించుకుంటా. ఏమంటావ్ మరి?' అంటూ అవతారం భుజాలు పట్టుకు వూపాడు కైలాసం.

'స్టాప్' అని గావుకేక వేసి పోలీస్ వాడి భంగిమలో కుడి చెయ్యి చూపించి చిరునవ్వు చిందిస్తూ మెల్ల మెల్లగా కళ్ళు తెరిచా డవతారం.

టక్కున ఆచేతి నలాగే పట్టేసుకున్నా డాచారి.

హస్తసాముద్రికం తెలిసిన వాడిలా చేతిలో రేఖల్ని పరీక్షిస్తూ 'అయ్యబాబోయ్' అని గుండె బాదుకుని, 'హెూర్నీ అదృష్టం మండి పోనూ! సుఖభోజనరేఖ నీ చేతిలో ఎలావుందో చూడు...ఒరేయ్! ఒరేయ్! చూడండ్రా ఈ రేఖ' అంటూ వాళ్ళందరికీ ఓ పొడుగాటి ఖండ రేఖ చూపించాడు.

కైలాసం, సర్వయ్యకూడా ఆ చేతి నలాగే పట్టేసుకుని, ఆ రేఖని పరీక్షించే నెపంతో వెనక్కి విరిచెయ్యడం మొదలెట్టారు.

'వేళ్ళు విరిగిపోతున్నాయి వదలండ్రా' అని మొత్తుకుంటున్న అవతారం మాటలు వాళ్ళకి వినబడ్డం లేదు. అక్కడికీ ఎడంచేత్తో తలా ఒక మొట్టికాయీ వేశాడు. అవీ వాళ్ళకి తగిలినట్టులేదు. బాధెక్కువైన అవతారం దిక్కులేక 'ఒరేయ్! ఆ సుఖభోజనప్రాప్తి మీకూ కలిగిస్తారా! దయచేసి నా చెయ్యి నాకు తిరిగి యిచ్చెయ్యండి' అని ఏడుస్తూ నేల మీదబడి గిలగిలాతన్నుకోసాగాడు.

ఈ మాటలు వాళ్ళ చెవిని బడ్డట్టున్నాయి. 'ఆఁ! నిజమా?' అని ఆత్రంగా బృందగానం చేశారు ముగ్గురూ.

'నిజంరా రాక్షసి వెధవల్లారా' అంటూ మూల్గా డవతారం.

కైలాసం గభాల్న తన చేతి వేలి నున్న వెంకటేశ్వరస్వామి ఉంగరం అవతారం నెత్తినపెట్టి 'నిజంగా?' అన్నాడు.

'బాబోయ్! నిజంరా' అన్నా డవతారం.

'ఎప్పుడూ?' అన్నాడు సర్వయ్య చెయ్యి మరింత వడేసి పట్టుకుంటూ.

'ఎప్పుడేమిట్రా? రేపొచ్చే ఆదివారంనాడే' అంటూ చెయ్యి విదిలించుకోబోయా డవతారం

'రేపొచ్చే ఒక్క ఆదివారమే ఏమిటోయ్? ఒక సంవత్సరం పాటొచ్చే ఆదివారాలూ, రెండో శనివారాలూ, పండగలూ, సెలవలూ, సంగతేమిటని? అవన్నీ వృధా పోవలసిందేనా ఎందుకూ పనికి

కొందరు వేసిన జోకు మేటై కూర్చుంటుంది.

'పొద్దున్నే గడ్డం గీసుకుని చూసుకుంటానా, పదేళ్ళు చిన్నవాణ్ణి అయినట్టుంటుంది.'

'మరైతే సాయంత్రం గీసుకోరాదుటండీ, ఎంచక్కాను!'

రాకుండా?' అంటూ చేతిని కొద్దిగా వెనక్కి విరిచాడు సర్వయ్య.

చెయ్యి విరగడంతో బాటు ఓ పిడుగు కూడా నెత్తిన పడ్డట్టయిం దవతారానికి.

'ఇదెక్కడి ఖర్మంరా! ఒక్క ఆదివారమయితే ఫర్వాలేదు. నాలుగైనా ఇబ్బందిలేదు. ఇన్ని రోజులు మిత్రసంతర్పణలు నే నెక్కడ చేయగలన్రా? నె నొట్టి లోయర్ డివిజన్ గుమాస్తాగాణ్నిగా' అంటూ ఏడ్వబోయాడు.

అయితే మాత్ర మేం మాయరోగం నీకు? సుబ్బరంగా మీ వూర్నించి బస్తా చెల్లగా బస్తా బియ్యం దొర్లించుకొచ్చే వీర్పాటుందిగా నీకు? పైగా నీకేం పిల్లా? పీ...?' అన్నాడాచారి.

'మరే! ఇంతాజేసి మే మడిగింది ఒక్కటుంటే ఒక్క సంవత్సరంలో వచ్చే సెలవురోజులు. ఆపైన నువ్వు బొట్టూకాటుకాపెట్టి పిల్చినాకూడా మేం రాము' అన్నాడు కైలాసం.

'అదీగాకుండా.... మనందరికీ గాని, మనలో కొందరికిగాని ట్రాన్స్ఫరులూ, ప్రొమోషనులూ రాకముందే ఇట్లాంటి వేడుకలు జరుపుకుంటే బావుంటుందని మా ఉద్దేశం' అన్నాడాచారి.

'ఒరే వెర్రిపీనుగా! నీ భార్య ఇంత అద్భుతంగా సకలాంధ్ర జనామోదకరంగా వండుతుందనిగానీ,... లేకపోతే నిన్నే పట్టుకొని బ్రతిమాలడానికి మేమేం శుంఠలంగాదు.పిచ్చి వెధవా! ముద్దుగా ఒప్పేసుకో! వచ్చేపేరు పాడుజేసుకోకు' అన్నాడు సర్వయ్య బుద్ధిచెప్పేవాడిలా మాట్లాడుతూ.

ఇదేభావాన్ని మిగతా ఇద్దరూ చెరి ఒకరకంగానూ వెలిబుచ్చారు.

అవతారానికి మహదానందంతో బాటు కాస్త గర్వంకూడా తలెత్తింది.

'అలాగేరా బాబూ! నా చెయ్యి వదిలెయ్యండి' అన్నాడు.

చెయ్యి వెంటనే విడుదల పొందింది.

'స్! అబ్బబ్బబ్బ' అనుకుంటూ తనచేతివేళ్ళని వూదుకుని నాల్గుసార్లు అల్లల్లాడించా డవతారం.

'అవతారం దంపతులకీ జైయ్' అంటూ ఎగిరాడు కైలాసం.

ఇదేదో బాగుందనే అభిప్రా

యంతో మిగతా ఇద్దరూ కలిసి ఇదే వాక్యాన్ని మరో రెండుసార్లు ఎలుగెత్తి కూశారు.

'ఒరేఅబ్బాయిలూ! మీరుచెప్పిన దానికి నే నొప్పుకున్నాను. కాస్త నా మనవిని కూడా ఆలకించమని మిమ్మల్నందర్నీ ప్రార్థించాలనుకుంటున్నాను' అన్నాడవతారం దీనంగా.

'ఆలకిస్తాం ప్రార్థించు' అన్నాడు సర్వయ్య.

అవతారం చేతులు జోడించాడు.

'మిత్రులారా! మిమ్మల్ని ముగ్గుర్నీ కలిసి ప్రతి సెలవు రోజునా మేపాలంటే ముఖ్యంగా మా యావిడకి కష్టమవుతుంది. వంటలు మీరాశించినంత రుచిగా వుండకపోవచ్చు. కాబట్టి ఈ మిత్ర సంతర్పణలు ప్రతి ఒక్కటీ విజయవంతం కావాలంటే ఒక్కొక్క సెలవురోజున ఒక్కొక్కడొచ్చి మేసిపోతే బావుంటుంది. కావాలంటే ఆ మేరకు ఎగ్రిమెంట్లు కూడా రాసుకుందాం. వాకే మధ్యం

తరం లేదు ...' అంటూ వేడుకున్నాడు.

ఈ పద్ధతి బాగుందనిపించింది కైలాసానికి. 'ఓ యస్! అలాగే' అనేశాడు.

ఆచారీ, సర్వయ్య కైలాసం వేపు ఉరిమి చూసి, అతి బలవంతాన 'సరేరా!' అంటూ ఒప్పేసుకున్నారు.

'అయితే రేపొచ్చే ఆదివారం నాడు ఎవరొస్తారో తేల్చి చెప్పండి సాయంత్రంలోగా' అంటూ అవతారం క్యారియరు సర్దుకుని వెళ్ళిపోయాడు పరుగెత్తుకుని.

ముగ్గురూ 'నేను ముందంటే నేను ముందు' అనుకున్నారు. చిక్కు విడలేదు.

'చిల్ల పెంకుమీద ఉమ్మేసి ఎండా వానా ఎగరేసి తేల్చుకుందాం' అన్నాడు కైలాసం.

'ఒర్నీ తెలివి తగలెయ్య! ఉన్నది ముగ్గురం కదరా?' అంటూ ఖాళీ డబ్బా కిందపడినప్పుడు చేసే చప్పుడులాగా నవ్వేసి 'అదేం లాభం లేదు. చీటీలమీద మన పేర్లు రాసి లాటరీ తీద్దాం' అన్నాడు సర్వయ్య.

'ఛ ఛ! వెధవ లాటరీ లేమిట్రా ఆడదానిలాగా! శక్తి సామర్థ్యాల ప్రకారం తేల్చుకుందాం' అన్నాడాచారి తొడ చరుస్తూ.

'సైరా ఆచారీ' అంటూ రెండు తొడలు చరిచాడు సర్వయ్య.

ఒక్క కైలాసానికి ఒళ్ళు జలదరించింది. 'అంటే కుస్తీలు పట్టి తేల్చుకుందామనా ఏరా?... నా వల్ల కాదు బాబూ! నాకు వంట్లో బలహీనంగా ఉందిగూడాను' అంటూ రెండడుగులు వెనక్కి వేశాడు.

ఆచారి మద్దెల మోతలాగా నవ్వేసి 'కుస్తీ గాదోయ్ చవటలూ! ఇడ్లెను పందెం వేదాం. ఎవడెక్కువ మెక్కితే వాడికి మొదటాదివారం దక్కుతుంది. కాస్త తక్కువ తిన్న వాడికి రెండో ఆదివారం; ఇంకాస్త తక్కువ తిన్నవాడికి మూడోదీనూ' అన్నాడు ఉత్సాహంగా.

'అయితే రేపు ఆచారిగాడింట్లో ఇడ్డెన్ల నోము పడ్తారన్నమాట' అన్నాడు కైలాసం పక్కనున్న గోడతో చెమ్మచెక్క లాడుతూ.

'అబ్బే! మా ఆడంగులు మూడ్రోజులపాటు ఇంట్లోకి రావడానికి వీల్లేదు. ఆ పైన పుట్టింటికూడా వెళ్ళాలని మహా ఇదైపోతోంది. సర్వయ్య ఇంట్లో ఏర్పాటు చేసేద్దాం' అన్నాడాచారి జాగ్రత్తగా తప్పుకుంటూ.

సర్వయ్య దీనికేం బెదిరిపోలేదు. 'అదేమంత గొప్ప పనిగానీ — మా యావిడ వండిన ఇడ్లెన్లు నేను

తినననీ, నా కళ్ళెదటగాగాని, చాటుగాగాని, నా మనస్సుకు తెలిసి మరొకళ్ళని – ముఖ్యంగా మిత్రుల్ని తిననివ్వననీ, అలా చేస్తే చచ్చినంత ఒట్టనీ ఘోర శపథం చేశాను' అన్నాడు నడినెత్తి గోక్కుంటూ.

'అయితే కైలాసానికి తప్పదు మరి' అన్నాడాచారి కైలాసం వంక చూస్తూ.

'అయ్యో! నాకో ఇబ్బందుంది. అదేం ఖర్మమో. మా యావిడ ఇడ్డెన్లంటూ వండితే ఆ రోజు ఏ బంధువుకో మిత్రుడికో నూరేళ్ళూ నిండిపోతాయి. కాపురానికొచ్చిన కొత్తలో వండితే అదే రోజున మా మేనమామ పోయాడు. మరో సారి వండితే పాపం నా ఆప్త మిత్రుడు సోమసుందర కనక బుచ్చిరాజు స్వర్గస్థుడయ్యాడు. నాల్గు నెలలనాడు వండితే ఆ రోజు మా యావిడ పినతల్లికి భూమ్మీద నూకలు చెల్లిపోయాయి. అప్పటి ంచి మా ఇంట్లో ఇడ్డెన్లు వండడం అచ్చిరాదని నిర్ణయం చేసుకున్నాము. అందువల్ల కుదరదు' అంటూ కుండ వగల గొట్టినట్టు చెప్పేశాడు కైలాసం.

'ఇదేం లాభంలేదు గానీ, హాయిగా మూడు గంటలకి కాంటీనుకి వెళ్ళి తీర్చేసుకుందాం' అన్నాడాచారి.

మూడు గంటలకి ముగ్గురూ క్యాంటీనుకెళ్ళారు.

కైలాసం 37 ఇడ్డెన్లు ... అనగా మొదటి ఆదివారం.

ఆచారి 33 ఇడ్డెన్లు ... అనగా రెండో ఆదివారం.

సర్వయ్య 28 ఇడ్డెన్లతో మూడో ఆదివారం గెల్చుకున్నారు.

అయితే ఈ ఖర్చులు ఎవరి ఖాతాలో రాయాలి అనే ప్రశ్న వచ్చింది. వెధవది "నీ ఖాతాలోనే" అంటే "నీ ఖాతాలోనే" అని దెబ్బలాడుకుంటే అసహ్యంగా వుంటుందనీ, చూసిన వాళ్ళెవరూ ఇక కింద పుమ్మెయ్యరనీ తలచి అవతారం ఎక్కవుంట్లో గుచ్చెత్తి రాసేశారు. ఈ అల్ప విషయం అతనితో చెప్పడం చాలా నిలీగా ఉంటుందని ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డంవల్ల అంతా నోర్మూసుకునే ఉండిపోయారు.

కానీ—

'మిత్ర సతర్పణల కార్యక్రమము' అనే శీర్షికతో ఓ కాగితం మీద ఏ ఆదివారంనాడు ఎవరు రాబోతున్నదీ రాసిచ్చేశారు సంతకాలూ తేదీలతోసహా.

మొదటి ఆదివారం రానే వచ్చింది. కైలాసం ఉదయం తొమ్మిది గంటలకే ముస్తాబై అవతారం ఇంటికి బయల్దేరాడు. అతని భార్య చాముండేశ్వరి కూడా అత

నితో ప్రయాణం కావాలని ముచ్చట పడింది. 'ఛ ఛ! వద్దు' అన్నాడు కైలాసం.

'అలా అయితే పోనీ ఓ నెల్లాళ్ళ పాటు పుట్టింటికి వెళ్తాను' అంటూ మరీ మరీ ముచ్చట పడింది చాముండేశ్వరి.

అందువల్ల ఆవిణ్ణి కూడా భోజనానికి తీసికెళ్ళాలని సరదా పడ్డాడు కైలాసం. పడ్డమేమిటి? సరదా తీర్చుకున్నాడు కూడాను.

అవతారం పెళ్ళాం సుందరమ్మ తన పాకశాస్త్ర ప్రావీణ్యంతో దివ్యమైన సంతర్పణ చేసింది. కైలాసం, చాముండేశ్వరి విపరీతంగా ముగ్ధులైపోయి అరగిస్తూన్నప్పుడూ, గించిన తర్వాతా కూడా చెడ పొగిడేశారు అవతారం దంపతుల్ని.

వాళ్ళిద్దరూ మహదానందంతో బాధపడిపోయి సాయంత్రం కాఫీ టిఫిన్లూ, రాత్రికి "మంచి మాటా" కూడా ఏర్పాటుచేసి పంపించారు.

మర్నాడాఫీసులో కైలాసం ఒకటే రొద! – తాను వెళ్ళిన సంతర్పణ గురించి ప్రతి అడ్డమైన వాడితోనూ చెప్పేశాడు వివరాలతో సహా.

ద్వితీయ స్థానం గెల్చుకున్న ఆచారికిది విన్నదగ్గర్నుంచీ గుర్రెక్కువైంది. ఎందుకూ? ఒక్కడే వెళ్ళకుండా భార్యాని కూడా మోసికెళ్ళినందుకు. గబగబా సర్వయ్య దగ్గరకు పరుగెత్తికెళ్ళి "చూశావురా ఈ అరాచకం?' అన్నాడు ఉక్రోషంగా.

'వాడో ద్రోహి లేకి వెధవలేరా! దరిద్రుడు! మంచీ మర్యాదాకూడా లేదు' అంటూ తిట్టేశాడు ఆచారి తన్నా బాధ పడిపోతూ.

"పీడి రోగం నేను కుదురుస్తాగా" అంటూ వెళ్ళిపోయాడాచారి.

రెండో ఆదివారంనాడు ఆచారి తన భార్య గోపాలరత్నాన్నీ, ఇద్దరు పిల్లల్నీ కూడా ఉదయం ఎనిమిది గంటలకే రిక్షా మీదేసుకుపోయి, కైలాసం మీద కసి తీర్చుకున్నాడు.

ఇది తెలుసుకున్న సర్వయ్య, మూడో ఆదివారంనాడు తన పెళ్ళాం బిడ్డలతోనూ, చుట్టం చూపుగా వచ్చిన పిన్నత్తగారితోనూ కలిసి చీకటితోనే వెళ్ళిపోయి, ఆచారి, కైలాసాలమీద వున్న తన కోపం అంతా తీర్చుకున్నాడు.

ప్రతి సంతర్పణ రోజునా నడవడం కష్టంగా ఉందని, రెణ్ణెల్లు జరిగేసరికి ఆచారి తన నివాసాన్ని అవతారం ఉండే వీధిలోకి మార్చుకున్నాడు.

రిక్షా ఖర్చులు కలిసొస్తాయి గదా అని కైలాసం తన బసని అవతారం ఇంటి ఎదురుగా వుండే ఇంట్లోకి మార్పిడీ చేశాడు – మరో ఇరవై రోజుల్లో.

ఇంకో పదిహేను రోజులు తిరక్కుండానే సర్వయ్య అవతారాన్నే తన ఇంటి పక్కింటికి కాపురం మార్పించాడు. ఎందుకుటా?

అవతారం ఇప్పుడుండే ఇలు సౌకర్యంగా లేదట! (ఎవరికో?!) తను చూపించిన ఇల్లయితే సర్వ సౌకర్యాలూ ఉన్నాయిట. బాడుగలోకూడా పెద్ద వ్యత్యాసం లేదుట. ఒకే ఒక్క పది రూపాయలు మాత్రం ఎక్కువట! అంతే! అంతకన్నా ఏం లేదట!

ఈ ఇల్లొక ప్రైవేటు మాస్టరుగారిది. ఒక పక్క ఆయన తన భార్యా బిడ్డలతో ఉంటూ, వీధి వరండాలో పదిమంది పిల్లలకి ప్రైవేట్లు చెప్పుకుంటూ మరో పక్క అద్దెకిచ్చేశారన్నమాట.

అవతారం దంపతులకి నిజంగా ఆ ఇల్లు నచ్చింది. రెండు గదులు, ఒక వంట గది, భావి, మంచినీటి కుళాయి ఉన్నాయి. విశాలమైన పెరడు.

మాస్టారికీ, ఆయన పెళ్ళాం ఆదిలక్ష్మమ్మగారికీ అవతారం దంపతులంటే చాలా ప్రేమ ఏర్పడింది. వాళ్ళా యింటి కొచ్చిన వారం లోపలే! పిల్లలూ అంతే! వీళ్ళంతా అన్ని పనుల్లోనూ సాయపడ్తూండేవారు సుందరమ్మకి.

మిత్ర సంతర్పణలు జరిగే రోజుల్లో వాళ్ళ సహాయం మరీ ఉండేది. అందువల్ల అవి మరీ దివ్యంగా జరగడం మొదలెట్టాయి.

అయితే వీళ్ళూ వాళ్ళకి సాయ పడ్తూనే ఉండేవారు, ఒకటీ రెండూ అప్పు రూపంలో. నాలుగు నెలలు జరిగే సరికి అవతారానికి సంతర్పణలు చెయ్యడం కొంచెం భారంగానే తోచింది. ఒక్క బియ్యం మినహాయిస్తే మిగతావి ఏవి మాత్రం తేరగా వస్తాయి? తన పెళ్ళికి మామగారిచ్చిన బహుమతి పైకంలో మిగిలిన అయిదొందల రూపాయలూ తీసికెళ్ళి బ్యాంకు



భార్య :- మేడమీదికి రెండు గ్లాసుల్తో ఎందుకూ, కాఫీ పట్టుకెళ్ళడం, అక్కడెవరో అతిథు లున్నట్టు?

భర్త :- అదా! నీ చేత్తో చేసిన కాఫీ ఒక గ్లాసు తాగ్గానే, నన్ను వివశుణ్ణి చేసేసి వేరే మనిషిగా మార్చేస్తుంది... అప్పుడు మరి అతనికి రెండో గ్లాసు అవసరం కదా!

వాళ్ళకిచ్చి దాచిపెట్టమంటే వాళ్ళిప్పుడు వంద రూపాయలే వున్నాయని దబాయిస్తున్నారు. ఈ వందా ఇంకెన్నాళ్ళొస్తాయి? వాళ్ళందరినీ ఒక్క సంవత్సరంలో వచ్చే సెలవులన్నిటిలోనూ మేపుతానని వెంకటేశ్వరస్వామిని నెత్తి నెట్టుకుని ప్రమాణం చేశాడాయె! (అదే!... వాళ్ళే చేయించారు!) పోనీ ... తనకు ఆఫీసులో లంచం రూపంలో వచ్చే ఆదాయమూ లేదు. తన ప్రమాణానికి భంగ మొస్తుందేమోనని భయమేసింది. ఏదన్నా మార్గం కనబడుతుందేమోనని అతి నిశ్శబ్ద ప్రదేశాలలో ఏకాంతంగా ఆలోచించాడు. లాభం లేకపోయింది. ఆఖరికి మొండికేసి "ఆ స్వామిదే భారం" అంటూ తన భారమంతా "పై వాడి" మీద తోసేసి, తను కేవలం నిమిత్త మాత్రుడైపోయాడు.

మరో రెండు సంతర్పణల తర్వాత ఆదిలక్ష్మమ్మగారు తన తమ్ముడి బారసాల కోసమని పిల్లలతోసహా పుట్టింటి కెళ్ళింది. మాస్టారు మాత్రం ఇక్కడే ఉండిపోయారు. తనను నమ్ముకున్న విద్యార్థుల్ని గంగలో ముంచడాని కిష్టంలేక! (అదీగాక రెండు మూడు రోజుల్లో వాళ్ళంతా జీతాలు తెచ్చిస్తారు కూడాను.)

ఆవిడ వెళ్ళిన మర్నాడు మాస్టారు స్వహస్తపాకం చేసోక్కడాని కుపక్రమించారు. వంటింట్లో గిన్నెలూ, గరిటలూ ఎగిరెగిరి పడ్తున్నాయి. ఇదంతా గమనించిన సుందరమ్మకు నవ్వుతోబాటు జాలి కూడా కలిగింది. పాపం వాళ్ళు ఇన్నాళ్ళుగా తమ కింత సాయం చేసినందుకు ఆయనకి రెండు పూటలు అన్నప్రాశన చేస్తే తప్పేమిటి? అని. గబగబా అవతారం ద్వారా మాస్టారికి కబురు చేయించింది. "పెద్దమ్మగా రెలాగూ నాల్రోజుల్లో తిరిగొస్తారు గదా! అందాకా మాతో బాటే మా యింట్లోనే ఎంగిలి పడవలసిందీ" అని.

మాస్టారు కొత్త అల్లుడు కన్నా మిన్నగా మొహమాట ప్రదర్శన చేశారు కానీ, సుందరమ్మ కూడా వచ్చి నోరు చేసుకునేసరికి 'సరే! మీ ఇష్టం' అనక తప్పలేదు.

మాస్టారు కూడా పొగడ్డంలో అందె వేసిన చెయ్యే! రెండ్రోజుల ఎంగిలికే అవతారం దంపతుల మొహాలు – జీడి గింజల పొగవేసినట్లు వాచిపోయాయి. వాళ్ళ మొహాల్ని చూస్తే జాలి గలిగింది గావన్ను మాస్టారుకి. మూడో రోజు నుంచీ ప్రోగ్రాం మార్చారు. ఫలానా కూర వండాలంటే నూనె కన్నా నేతికే అర్హత ఎక్కువనీ, ఫలానా పచ్చట్లో దబ్బకాయపులుసు పిండితే వంటికి చాలా మంచిదనీ, కాకి రంగు మనుషులైనా గులాబీ రంగు దాలుస్తారనీ, పులుసులో ముక్కలు ఎంత పెద్దవిగావుంటే అంత బాగుంటుందనీ చెప్తూ వాళ్ళ రుచులకు సలాం కొట్టించి తన రుచులకు స్వాగతం కొట్టించి పొట్టపోసుకో సాగారు. ఇది కొంచెం కష్టమనిపించింది అవతారం దంపతులకి. ఇంకెన్ని రోజుల్లే? అని సరిపెట్టుకున్నారు. వారం తిరిగింది. ఆదిలక్ష్మమ్మగారు రాలేదు. ఉత్తరం మాత్రం వచ్చింది.

మాస్టారు రానందుకు చాలా

మంది బాధపడిన సంగతీ, ఎదురింటి వారు వంకాయల వడియాలు పెట్టుకున్న వైనం, పంచదార కరువూ, సుబ్బయ్య చౌదరిగారి పెళ్ళాం తన అధ్వర్యంలో అప్పడాలు చేసుకున్న విషయమూ, వగైరాలతో బాటు బారసాల మరో పదిరోజుల దూరం వెళ్ళిందనీ, అదికాస్తా వెళ్ళమార్చుకుంటేనేగాని తను రావడంపడదనీ, మాస్టార్ని జాగ్రత్తగా ఇల్లు చూసుకోమని కూడా ఆదిలక్ష్మమ్మగారు రాసింది.

ఈ వార్త అవతారం దంపతులికి ఆనందంగా అందించారు మాస్టారు.

అది విన్న సుందరమ్మ అదోలా అయిపోయింది.

అవతారం చదువుతున్న పేపర్లో అక్షరాలన్నీ అలుక్కుపోయాయి.

మాస్టార్ని వెళ్ళనిచ్చి, 'ఇదేం ఖర్మండీ! వీడింకా 15 రోజుల దాకా వచ్చేట్టు లేదు. మనమీ మిత్ర సంతర్పణలే చేయగలమా? ఈయనకు రెండు పూట్లా ఆయన రుచుల ప్రకారమే వండిపెట్టగలమా? నాకేం పాలుపోవడం లేదు' అంది సుందరమ్మ అవతారం చెవిలో నోరెళ్ళబెట్టి.

'అవునే! నాకూ ఏం పాలుపోవడంలేదు. మిత్ర సంతర్పణల కన్నా ఈయనే కష్టమనిపిస్తున్నాడు' అన్నాడవతారం గుడ్లెళ్ళబెట్టి.

"పోనీ... ఓ పని చేస్తే?" అంది సుందరమ్మ.

"ఏమిటా ఓ పని?" ఆత్రంగా నిలబడ్డాడవతారం.

'ఏం లేదు! ఇవాళ నుంచీ ఆయన్ని భోజనానికి పిలవకుండా వూరుకుంటే సరి...' అని అవతారం చెవిలో చెప్తూ ఉండగానే నుడిగాలిలా వచ్చారు మాస్టారు 'అమ్మాయ్! సుందరమ్మా' అంటూ.

గభాల్ని మొగుడికి దూరంగా జరిగి, ముఖంలో ఆనంద రేఖలు గీస్తూ "ఏమిటి బాబాయిగారూ" అంది సుందరమ్మ.

"ఏం లేదమ్మా! ఈ పూట ఓ మిత్రుడి కేసులో సాక్ష్యం చెప్పడానికి మేజిస్ట్రేటు కోర్టు కెళ్ళాలి. త్వరగా వంట గానిస్తే ఓ మెతుకు కొరికి వెళ్ళొస్తా" అన్నారు లాలనగా.

"అలాగే బాబాయిగారూ!" అంది సుందరమ్మ బలవంతంగా.

మాస్టారు వెళ్ళిపోయారు.

అవతారం ముఖం చిట్లించి సుందరమ్మవంక చూశాడు "ఇదేంఖర్మ?" అన్నట్టు. సుందరమ్మ తన నుదుటి మీద అడ్డంగా కుడిచేతి బొటనవ్రేలు గీసి ఒక్క నిట్టూర్పు విడిచి వంటింట్లోకి వెళ్ళింది.

రెండ్రోజుల పాటు ఏవేవో పనులుండటంవల్ల మాస్టారే తొందరి

పడిపోవడం మొదలెట్టారు భోజ నాలకి.

మూడోరోజు చీకటితోనేజ్వరం, వాంతులు తెప్పించేసుకుంది సుంద రమ్మ.

వీధరుగుమీద దంతధావన చేసు కుంటున్న మాస్టారికీవిషయం మనవి చేస్తే ఆయన అర్థంచేసుకుంటారని ధైర్యంచెప్పి పంపిం దవతారానికి.

అవతారం వెళ్ళి 'మాస్టారూ! ఈపూట మాయావిడికి కాక తగిలిం దండీ...' అన్నాడోలేదో 'దాని కింత భయమెందుకుబాబూ! నువ్వేం బెంగపడకు! నే వస్తున్నా పద' అంటూ అతన్ని లోపలికి తరిమేసి గబగబా పని పూర్తికానిచ్చి ఇంట్లో కెళ్ళి ఏదో మందుకుప్పె తే నెతో అరగదీసి బాదమాకులో పెట్టుకుని హడావిడిగా సుందరమ్మ దగ్గరకు పరుగెత్తి బలవంతాన నాకించి "ఇంకేం ఫర్వాలేదమ్మా! హాయిగా విశ్రాంతి తీస్కో' అంటూ ధైర్యం చెప్పి పడుకోబెట్టి "ఇలా రావయ్యా అవతారం' అంటూ అతన్ని వంటిం ట్లోకి కేకేసుకెళ్ళి "చూడు! కుంపటి రాజేసి రెండుసోలల బియ్యం అత్తెస రెట్టు... నేనీలోగా బెండకాయలు తరుగుతా! కత్తిపీటా, కూరలూ ఇలా పడెయ్' అంటూ గోడకానుక్కూర్చున్నారు.

బిక్కమొగమేసి చూడసాగా దవతారం.

'అట్లా చూస్తావేమయ్యా! మని షికి, పూటకి సోలెడు బియ్యంచాలు. అమ్మాయినివాళ కటిక లంఖణం పెట్టాల్సిందేగదా! అందువల్ల మని ద్దరికీ రెండుసోలలన్నమాట' అంటూ పాఠాలు చెప్పే పద్ధతిలో బోధించి "ఇదరికీ ?' అని ప్రశ్నలాగా అడిగి మిగతాది పూర్తి చెయ్యమనే భావంతో అతనివంక చూశారు.

'అలా చూస్తావేమయ్యా మొద్దు లాగా! చెప్పు!...ఇద్దరికీ ?...'


'రెండుసోలలు' అన్నాడవతారం; చచ్చిచెడీ తెలుసుకున్న విద్యార్థిలా.

'ఆఁ!...అయిందా? ... ఇహ బెండకాయలు. వాటిని పులుసుబెట్టి కూరవండుతామన్నమాట...పులుసు బెట్టి?...'అంటూ అవతారంవైపు చూశారు మాస్టారు.

'కూర వండుతామన్న మాట' అంటూ పూర్తిచేశా డవతారం.

'ఆఁ...గూడ్!...అయిందా?... మరి.. పుల్లటి కూరొండుతున్నాం గాబట్టి మరో ముఖ్యమైన పదార్థం వండాలి, ఏమిటదీ?...'

కొందరిది కులవృత్తి. హాస్య రచయితలది జోకుల వృత్తి.



ఏమిటో తెలియక దిక్కులు చూడసాగా డవతారం.

మాస్టారికోపం వచ్చింది గావన్ను! గభాల్న ఎగిరి "మొద్ద ప్పయ్యా! ఎన్నిసార్లు చెప్పా ల్నీకు?' అంటూ చెయ్యెత్తారు గూబ్బగలగొట్టేందుకు.

'అలాగేసార్! ముద్దపప్పే' అంటూ తన తప్పొప్పుకున్నా డవ తారం వణికిపోతూ.

'ఆఁ!...ఇంకా దేవుడు మేల్జేస్తే మనం అంధులం. మనం?...'

'అంధ్రులం'

'ఆఁ! చూశావా! దోవలో పడ్డావ్! ఆఁ...మనం ఆంధ్రులం. మనకూ ... ముఖ్యంగా ...' అని మాస్టారు సాగదీస్తుండగానే, దోవలో పడిపోయిన అవతారం ఉక్రోషంతో, గుడ్లవెంట నీరు తిరిగినవాడై, బొంగురుగొంతు ఏర్పడినవాడై 'ఓ పచ్చడి వుండాలి; గొంతుక దిగ డానికి పీలుగా చారు, పులుసు, మెంతిమజ్జిగ లేక మజ్జిగపులుసులాటి ఓ ద్రవపదార్థం చాలా అవసరం. ఉంటే అప్పడాలూ, వడియాలూ, పూరమిరపకాయలూ కూడా ఆంధ్ర భోజనానికి మరింత సౌభాగ్యాన్ని కలిగిస్తాయి' అన్నాడు ఒక్క గుక్కలో.

మాస్టారు ఈధాటికి అదిరిపోయి పెంకులెగిరిపోయేలాఘొల్లున్నవ్వేసి "హెూర్నీ హసాధ్యంకూల.. మొత్తా

నికి చిచింద్రీలాటి వాడివయ్యా! మొదలంటిస్తే చివరకూ అంటుకుపోతావు! భేష్! అల్లావుండాలి! ఇంకేం? కానిచ్చెయ్ మరిత్వరగా! నే హాయిగా చూస్తూ కూర్చుంటాను' అంటూ బహు సంతోషంగా ఓ పేద్దపీట వాల్చుకుని బాసిపెట్లేసు క్కూర్చున్నారు.

సుందరమ్మ తన తెలివితక్కువ ప్లానుకు మంచంలోనూ, ముసుగులోనూ మగ్గిపోవడం మొదలెట్టింది. తనకు బలవంతాన మూడుపూటలా మందులు నాకి, కషాయాలు సేవించాల్సి రావడంతోబాటు కటిక లంఖణం కూడా ప్రాపించింది. అవతారమే ఆ రెండుపూట్లా వచ్చి నట్టు పెలవుపెట్టి మరీ వంటచెయ్యవలసి వచ్చింది. అందువల్ల మళ్ళీ తెల్లారేసరికి తనజ్వరం తగ్గినట్టు ప్రకటించి వంటలో జొరబడింది.

మాస్టారు శ్రద్ధగా సుందరమ్మ దగ్గర కూచుని, తనకూ అవతారానికీ ఇష్టమైన పదార్థాలు చేయించుకుని, సుందరమ్మకు మాత్రం విడిగా కారప్పొడీ, చారూ చేయించి పథ్యం తినిపించారు.

ఆ మూడో నాడు మరో మిత్ర సంతర్పణ జరిగింది.

ఆ రాత్రి మిత్రులు వెళ్ళాక సుందరమ్మ వేసిన ప్లాను ప్రకారం:

"ఏమండీ! అలారం ఎన్నిగంటలకు పెట్టమంటారు?" అంటూ వచ్చింది సుందరమ్మ... మాస్టారుతో మాట్లాడుతున్న అవతారం దగ్గరకు.

"నాలుగు గంటలకే పెట్టెయ్యవోయ్!" అన్నాడవతారం చిరునవ్వుతో.

"అలారమేమిటి? నాలుగ్గంటలేమిటి?" అంటూ లేచి నిలబడ్డారు మాస్టారు.

"ఆఁ! రేప్పొద్దున మార్యారావుపేటలో మా మిత్రుడి వివాహమండీ! అరింటికే ముహూర్తం. అందుకనీ..." అన్నాడవతారం వెకిలిగా నవ్వుతూ!

"ఓహో! శుభమ్! రేపు మీ కాఫీ, టిఫిన్లూ, భోజనాలూ అక్కడే నన్నమాట" అనడిగారు మాస్టారు ఆత్రంగా.

"ఆహా! లక్షణంగానూ! రెండ్రోజులపాటక్కడే వుండి అక్కడే తినాలిట! లేకపోతే నా మిత్రుడు నా రక్తం కళ్ళజూస్తానన్నాడు" అన్నాడవతారం సంతోషంగా బొంకుతూ.

"సరిసరి!" అనేసి, "అమ్మాయ్! సుందరమ్మా... అలా అయితే మూడు గంటలకే అలారం పెట్టేసీ, నా మట్టుకు రెండుసోలల బియ్యం పొంగించి, ఓ రాచ్చిప్పడు కంది పచ్చడి చేసి, కాసిన్ని చారునీళ్ళు పడేస్తివా అంతే రేపటికి వెళ్ళమారి పోతుంది. ఇహ యెల్లుండి సంగ

తంటావా!.. నేఁదో రాజా భవిష్యతి' అన్నారు మాస్టారు.

గుండెలు గతుక్కుమన్నాయి అవతారానికీ, సుందరమ్మకీ!

"ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు?" అంటూ ప్రశ్నించారు మేస్టారు.

"ఏమండీ. మరో నవల రాస్తున్నానన్నారు; పూర్తయిందా?"

"లేదండీ. ఓ వంద పేజీలు రాసి అక్కడ పెట్టేను; మా రెండో అబ్బాయి చింపి పారేశాడు."

"మీ రెండో అబ్బాయి నవలలు చదివే అంతవాడయ్యాట్టండీ!"

"ఏంలేదు బాబాయిగారూ! అలాగే!" అనేసి, వెనక్కి తిరిగి లోపలికి పోయింది సుందరమ్మ మాస్టార్ని నాలుగూ తిట్టుకునేందుకు.

అలారం కన్నా ముందుగా మాస్టారే మేల్కొల్పారు సుందరమ్మని.

మాస్టారి పని పూర్తిజేసి ఇద్దరూ బయటపడ్డారు సూర్యోదయాత్పూర్వమే!

మిత్రుడూ; పెళ్ళీ — రెండూ అబద్ధమే కాబట్టి కాఫీ,టిఫిన్లకూ, భోజనానికీ హొటల్ మీద ఆధారపడి, నివాసానికి ఓపార్కులో చెట్టునీడని నమ్ముకుని, రాత్రి పదిగంటలకి దేవుడా అప్పన్నా అంటూ ఇంటికి చేరి—

"ఇదేమిటయ్యా! అప్పుడే వచ్చేశారు? రేపుకూడా వుంటామన్నారుగా?" అని అడిగిన మాస్టారికి "ఆఁ! వాడేదో మర్యాదకోసం అంతమంటేమాత్రం... సిగ్గులేకుండా ఎలా వుండమంటారండీ?" అంటూ అవతారం కసిగా సమాధానం ఇస్తూండగానే, మాస్టారు గబాల్న తన ఇంట్లో ఏదో చచ్చుడు విన్నవాడిలా అభినయించి, "ఇశ్శో! నీ ఎలుకలు నాశనమైపోనూ" అంటూ లోపలికి పరుగెత్తారు.

మాస్టార్ని వదుల్చుకునేందుకు వేసిన ప్లానులూ వమ్మైపోయేసరికి 'కాలం కలిసొస్తే తప్ప మనచేతిలో ఏమీ లేదు' అనే వేదాంతపూరితమైన ఏకగ్రీవ నిర్ణయాని కొచ్చేశారిద్దరూ—తక్షణమే. అందువల్ల కాలాన్ని మళ్ళీ మామూలుగానే మాస్టారితోబాటు నెట్టుకుపోవడం మొదలెట్టారు.

నాల్రోజులు గడిచాయి.

అవతారం స్నానం చేస్తుండగా, బాత్‌రూం బయట నిలబడి, ఇంటిలో డబ్బు 'నిల్లే' అనీ, బ్యాంకుకెళ్ళి డబ్బు తేకపోతే మనవని 'డల్లే' అనీ, మళ్ళా టి సంతర్పణకూడా 'ఇల్లే' అనీ ప్రాసపూర్వకమైన హాస్య

రపంతో అవతారానికి నివేదించింది సుందరమ్మ.

'అదేం ముడియాదు' అని అవతారంకూడా అరవహాస్యం మాట్లాడాడు చెంబుడునీళ్ళు నెత్తినపోసేసుకుంటూ. ఇద్దరూ తమ తమ హాస్యాలకు కడుపుబ్బ నవ్వుకోసాగారు.

'అమ్మాయ్! సుందరమ్మా' అనే



కేక వినబడి పరుగెత్తింది సుందరమ్మ

తెల్లని ఇస్త్రీబట్టల్లో దూరిపోయి, ఓ సంచీని కుడిచేతికి వ్రేలాడేసుకున్న మాష్టారు కనిపించారు.

"ఏమిటి బాబాయిగారూ?"

"ఏం లేదమ్మా! అర్జెంటుగా ఊరెళ్తున్నాను. రాత్రిగ్గాని, రేపు ఉదయానికిగాని వస్తాను. ఎందుకైనా మంచిది. రాత్రికికూడా నాకుబియ్యం పోయకు. అంతగ్గాకపోతే వచ్చాక చూస్కోవచ్చు" అంటూ హడావిడిగా వెళ్ళిపోయారు.

ఆ కాస్త భాగ్యానికే సుందరమ్మ ఏలిన్నాటి శని వదిలిందన్నంత సంతోషంతో తల తుడుచుకుంటున్న భర్త దగ్గరికి పరుగెత్తి, ఈ వార్త తేనెసోనలవంటి పలుకులతో చెప్పేసింది.

అవతారం వళ్ళు తెలియని ఆనందంలో నేలమీద నాలుగు పిల్లిమొగ్గలు కొట్టి, దూలంపట్టుకొని వుయ్యాలలూగి, తలక్రిందులుగా వ్రేలాడి పావలాకాను సినిమా ప్రేక్షకుడు వేసేమాదిరి ఈలవేసి, కొద్దిగా తైతక్కలాడి, ఎదురుగా వున్న సుందరమ్మను నడుం పట్టుకుని పైకల్లా ఎత్తేసి, గిరగిరా తిరుగుతూ కళ్ళు తిరిగిన కారణాన బోర్లా బడిపోయి, మళ్ళీలేచి, చట్టు విరిగినట్టు బాధపడుతున్న సుందరమ్మను ఆ

బుగ్గా ఈ బుగ్గా గంటుపడేలా గిల్లి, ఇంకా ఏదో చేయబోయేసరికి—

"ఇక చాలుగానీ విడవాలం — బ్యాంకు కెళ్ళిరండి" అంటూ సుందరమ్మ అతని దూకుడు కడ్డంపడింది.

"బాబోయ్! మర్చేపోయాను"అని గబగబా చెక్కురాసుకుని బ్యాంకుకు పరిగెత్తాడు.

"సారీ మాస్టారూ! మీ చెక్కును గౌరవించలేము" అన్నాడు బ్యాంకు గుమాస్తా.

దిమ్మదిరిగిపోయిం దవతారానికి. బుర మొద్దుబారినట్లని పించింది. కాళ్ళీడ్చుకుంటూ ఆఫీసుకు దయచేశాడు.

సాయంత్రం ఇంటికి రాగానే "డబ్బు తెచ్చారా?" అనడిగిన సుందరమ్మ ప్రశ్నకు సమాధానంగా వెల్లకిలా మంచాన పడిపోయి, ఇంటి దూలాలు పరీక్షిస్తూ—

"డబ్బూలేదు దస్కంలేదు! నీ మాటే ఖాయం" అన్నాడు.

సుందరమ్మ మనస్సు చివుక్కుమంది. అంతలోనే మొహంలో ఓ వింతకళ తెచ్చుకుని, "ఏమండీ! అధైర్యపడకండి! ఆదిలక్ష్మమ్మగారు మనకి ముప్పయి రూపాయలదాకా ఇవ్వాలి. రాత్రికి మాష్టారు రాగానే అడిగి తీసుకుందాం. రేపటికి జరిగిపోతుంది. మళ్ళీ సంతర్పణ నాటికి జీతాలే వస్తాయి" అంటూ సముదాయించిం దవతారాన్ని.

అవతారం అధైర్యపడ్డం మానేశాడు.

రాత్రి 11 గంటలయినా మాష్టారు రాలేదు. మరి వచ్చే సూచనాలేదు.

మళ్ళీ అవతారం అధైర్యపడ్డం మొదలెట్టాడు "రేపు సంతర్పణ ఫెయిలే" అని.

"మీ మిత్రుల్ని అప్పడిగిచూడండి. ఉదయమేవెళ్ళి. మాష్టారొచ్చాక అప్పుతీర్చెయ్యొచ్చు"అంటూ ధైర్యం నూరిపోసింది సుందరమ్మ. అది తాగి పడుకున్నా డవతారం.

సూర్యోదయం కాకుండానే అవతారం సర్వయ్య దగ్గరకెళ్ళి అడిగేశాడు—

"ఓ ముప్పయ్యుంటే సర్దరా! మాష్టారొచ్చాక తీరుస్తాను" అని.

"హారైరె! ఇప్పుడే ఓ 50 యాభై రూపాయలుంటే బీ. డీ. వో. గారి కప్పిచ్చాన్రా! వెరీసారీ! చ్చొ చ్చొ చ్చొ" అంటూ బాధపడి ఆలోచించి, "ఒరేయ్! కైలాసంగాడు నిన్ననే ఓ 70 రూపాయలు తీసుకెళ్ళాడురా బ్యాంకునుంచి. వెంటనే వాణ్ని పట్టేయ్... ఊ... కదులు" అంటూ మార్గదర్శకత్వం వహించి తోసివేశాడు సర్వయ్య.

అవతారం గబగబా కైలాసం దగ్గరి కెళ్ళాడు.

'పిచ్చివాడా! ఆ డెబ్బయి రూపాయలు నావికావురా నాయనా! మా ఇంటి యజమానివి. దాచి పెట్టమంటేను, ఎలాగూ బ్యాంకులో మనపేర ఓ ఎకౌంటుంటూ వుందిగదా అవుంటా అని దాచిపెట్టాను. నిన్ననే ఆయన కావాలని అడిగితేను తెచ్చి రాత్రే ఇచ్చేశానన్నమాట' అని ఫెళఫెళ నవ్వేసి, 'అయినా ఇవాళ ఆచారిగాడి సంతర్పణ గదరా! వాణ్ణే అడగలేకపోయావూ?... వెధవ! వారం రోజుల్నుంచీ పాక్టీల దగ్గర మహా గుంజేస్తున్నాడు. పోయడుగు. జీతాలు రాగానే వాడిమొహాన గిరవాటేద్దువుగాని' అని ఓ సలహాయిచ్చి, 'సరే వస్తా రా! ఇల్లంతా నానా గందరగోళంగానూ వుంది పద్దాలి' అంటూ లోపలికి పారిపోయాడు కైలాసం.

అవతారం ఒక్కక్షణం అలాగే నిలబడిపోయి 'దొంగ వెధవా!' అని తిట్టుకుని, ఆపైన నెమ్మదిగా ఆచారింటికి వెళ్ళాడు.

ఇంటిముందు నిలబడి మంచాన్ని వేలకేసికొట్టి, రాలిన నల్లుల్ని కాలరాస్తున్న ఆచారి, అవతారాన్ని చూడగానే మొహం చేటంత చేసుకుని, చిరునవ్వు నవ్వుతూ 'రారా! కూర్చో' అంటూ మంచంవాల్చి కూచోబెట్టి 'మంచినీళ్ళుకావాలా?' అనడిగి, 'వద్దు' అనిపించుకుని,

'నేనే నీకోసం వద్దామనుకున్నారా పొద్దున్నే' అన్నాడు.

'ఎందుకూ?' అన్నా డవతారం ఆశగా కళ్ళు పెద్దవిచేసి.

'ఎబ్బే.. ఏం లేదురా! మా యావిడ "అప్పుచేసి పప్పుకూడు" సినిమాకి మార్నింగ్‌షోకి వెళ్ళాలని ఊహూ గోల చేస్తోంది. అదిచూసి అట్నించటే భోయవాని కొచ్చేస్తాం. కాస్త ఆలస్యం అవుతుంది అని చెప్పడానికి' అన్నాడాచారి.

చప్పబడిపోయా డవతారం.

మళ్ళీ ఆచారే అందుకున్నాడు 'ఇంతలోకే సర్వయ్యొస్తేనూ! ఆగిపోయా నన్నమాట! పాపం నీ సంగతంతా చెప్పాడ్రావాడు. నా కెంత బాధ కలిగిందో చెప్పలేను. ఈ చుట్టుపక్కల అయిదారు ఇళ్ళల్లో నీ కోసమని చేబదుళ్ళడిగా! అంతా దొంగ వెధవలే! ఉండీ లేదన్నారు. పీనాసి పీనుగులు ...' అని అవతారం వంకచూశాడు.

అవతారం ఎక్కడో దూరంగా శూన్యంలోకి చూస్తున్నాడు.

'అప్పట్నించీ ఏం చెయ్యాలా, నీ కష్టమెలా గట్టెక్కించాలా? అని బుర్రబద్దలు కొట్టుకుంటున్నాననుకో. ఇప్పుడే బ్రహ్మాండమయిన అయిడియా వచ్చింది' అన్నాడాచారి.

డాక్టరు :- కంగారు పడకయ్యా బాబూ! ఈ జబ్బు నాకూ ఓసారొచ్చింది; నేను బాగుపడ్డానుగా!

పేషంట్ :- మీ డాక్టరు వేరు కదండీ.

అవతారానికి ఏదో వెలుగు కనిపించినట్లయింది. ఆచారి చేతులు పట్టుకొని 'ఏమిట్రా అది? చెప్పరా?' అని ప్రాధేయపడ్డాడు.

'ఏం లేదురా! రంగనాథంవీధిలో "అప్పాలాల్ నప్పాలాల్" అని కాకట్టు వ్యాపారస్తులున్నారు చూడు...' అని చెబుతుండగానే—

అవతారం అదిరిపడి లేచి 'వస్తారా' అంటూ పరుగు లంకించుకున్నాడు.

ఆచారి పదడుగులు వెనగ్గా పరుగెత్తుతూ 'ఒంటిగంటన్నరకల్లా వచ్చేస్తాంరోయ్' అని ఎలుగెత్తి అరవసాగాడు.

ఇంటికెళ్ళేసరికి వీధిలో నిలబడి ఎదురుచూస్తున్న సుందరమ్మ విషయం తెలుసుకుని, చింతించి 'ఏం స్నేహితులండీ' అంటూ ఓ చిన్న రిమార్కు పారేసి, మాష్టారొచ్చారనీ, కొంత పైకాన్ని కావడిపెట్టెలో దాస్తూండగా తాను చూశాననీ వెంటనే అడగమనీ అవతారాని కుపదేశించింది.

అవతారం ఏనుగంత సత్తువ తీసుకుని, గుర్రమంత దౌడుతీశాడు మాష్టారి దగ్గరకు 'ఎప్పుడొచ్చారు మాష్టారూ?' అంటూ.

'ఇప్పుడే వచ్చాను బాబూ! రాత్రే వద్దామనుకుంటే బస్సు దొరికింది కాదు' అన్నారు తాపీగా పడక్కుర్చీ నలంకరిస్తూ.

'అరెరె! పాపం! మేము మీకోసం రాత్రంతా కాచుకున్నాం సుమండీ' అని జాలినటించి, ఆయన చెవి దగ్గరగా వెళ్ళి 'ఓ ఖర్చీవుంటే సర్దుతారు మాష్టారూ! మళ్ళీ జీతాలురాగానే తీర్చేస్తాను' అన్నాడు రహస్యంగా.

'అయ్యో! నీకు తెలియని డబ్బు నా దగ్గరెక్కడుంది నాయనా? నేనే నిన్నో ముప్పయ్యడుగుదా మనుకుంటున్నా చేబదులుగా' అన్నారు మాష్టారు చిరునవ్వు లొలకబోస్తూ— అంతకన్నా రహస్యంగా.

చిరాకేసిం దవతారానికి.

'అదిగాదు మాష్టారూ! మీ దగ్గర మాత్రం లేకుండావుందా? మీకి మధ్య ఖర్చేలాగూ లేదాయె. పోనీ, పెద్దమ్మగారు మా దగ్గర ఎప్పుడన్నా తీసుకోనిండి ముప్పయిదాకా బదులు తీసుకున్నారు. అదన్నా ఇప్పించండి.

మీ సొమ్మేమీ ఇవ్వద్దు' అన్నాడు ప్రాధేయపూర్వకమైన కసితో,

'అబ్బ! లేదు నాయనా అంటే నమ్మవేం? ఒట్టు. లేదుబాబూ! భజంత్రీవాణ్ని పిలిపించి గుండు గీయించుకుందామంటే పాపలా డబ్బుల్లేక గిలగిల్లాడి పోతున్నాను. నీకేం తెలును నేనెంత గడ్డి కరుస్తున్నానో! నీబాకీ వచ్చేనెలలో తప్పక జమకడతాను. కావాలంటే ఇకో వదో వరకో కూడా తీసుకో! నే వద్దను' అన్నారు మాష్టారు మొత్తుకుంటూ.

అవతారానికోపం ఎక్కువయింది — పొద్దుట్నించీ పొందిన ఒక్కొక్క అనుభవం వల్లాను. అదంతా మాష్టారిమీదికి మళ్ళించాలని ప్రయత్నంలో పడ్డాడు.

'పోనీ, ప్రతి సెలవునాడూ బంధుమిత్ర సపరివారంగావచ్చి పీకెలదాకా మెక్కిపోయే నీ మిత్రులున్నారుగా! వాళ్ళనడిగి చూడరాదూ?' అంటూ ఓ సలహా ఇచ్చారు మాష్టారు ఈ లోగానే!

అవతారం కోపంతో పగిలిపోయాడు.

'ఎవ్వళ్ళు తక్కువ మెక్కలేదులెండి! మీరు చూపించిన మొండి చేతులే వాళ్ళూ చూపించారు. మీలాగానే వాళ్ళూ సలహాలు తగలేశారు నా మొహాన' అంటూ ఒక్క పోటు పొడిచాడు... మాష్టారికి నషాళం అంటాలని.


మాష్టారికి నషాళం అంటలేదు. పైగా 'అభాగ్యానికి మొండిచేతు లనుకుంటే ఎలా? ఎవరి కష్టాలు వాళ్ళకుంటాయి మరి' అని సాగదీస్తూ మరింత వెనక్కి వాలారు కుర్చీలో.

అవతారానికి రోషం, ఉక్రోషం పెల్లుబికాయి. కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

జీరపోయిన గొంతుకతో 'అవునేండి! మీ అందరివీ కష్టాలు! నావి మాత్రం సుఖాలు. నేనేమైపోతానో అనికూడా చూడకుండా పొట్టలు పగిలేలా ఎడ్డుల్లా మేశారు పెగారుచులు! నేతి పిండివంటలు! అసలింతకీ ఎవర్నని ఏం లాభంలెండి! నాది బుద్ధితక్కువ! నాదండీ బుద్ధితక్కువ! పోనీగదాఅని జాలిదలచి నెత్తికెక్కించుకుని మేపానుగదూ? నాకీ శాస్తి కావలసిందే' అంటూ తపతప లెంపలు వాయించుకోసాగాడు.

మాష్టారు చిరునవ్వు నవ్వుతూ 'ఎందుకయ్యా అంత ఉద్రేక పడతావు? పెట్టిదెప్పడం మహాపాపం కూడాను. కాస్త శాంతించు' అన్నారు తాపీగా.

'శాంతి!... హు... శాంతి!... ఇంకెప్పుడూ ఇలాటి అనవసర సంతర్పణలు చెయ్యకుండా వుంటే నేను



నాకు శాంతి మాష్టారూ! నాకు శాంతి' అంటూ గుండెలు బాదుకోసాగా డవతారం.

'బాగుందయ్యా! సినిమా హీరోలాగా నీ సంభాషణలూ నువ్వూను' అంటూ విరగబడి నవ్వడం మొదలెట్టారు మాష్టారు.

'సినిమా హీరోలాంటి వాడు కాదండీ ఈ అవతారం! హు! ఏమనుకున్నారో! మాటన్నానంటే తిరుగుండదు. చూడండి! ఇదే ప్రమాణంచేసి చెపుతున్నాను. ఎవరిమీదో కాదు. ఏ వెంకటేశ్వరస్వామిని నా నెత్తినపెట్టి సంతర్పణలు చేస్తానని ప్రమాణం చేయమన్నారో నా విశ్వాసఘాతుక మిత్రులు — అదే వెంకటేశ్వర స్వామిమీద! ఇహ నుంచీ తద్దినాల్లాంటి ఇలాటి మిత్ర సంతర్పణలూ, మొహమాటపు విందులూ చెయ్యనుగాక చెయ్యను. చేస్తే పెద్ద ఒట్టే' అని గోడమీది స్వామిపటంమీదచేయివేసిప్రమాణం చేశాడు అవతారం.

మాష్టారుఅనందంతోఎగిరిలేచారు కుర్చీలోంచి.

'నాయనా! ఈ మాట తప్పవు గదూ?' అంటూ.

'ఛస్తే తప్పను. ఇటునూర్యు డటు పొడిచినా సరే! మహాప్రళయం సంభవించినాసరే! కోటి రూపాయలు ముదనష్టం తగిలినా సరే! నా ప్రతిజ్ఞ కింక తిరుగులేదు' అన్నాడు తలువు మీద ఘట్టిగా గుద్దుతూ.

'వెరీగుడ్ బాబూ! ఇంతకాలం నీకీ బుద్ధి చెప్పాలనే నేనూ, నాతోబాటు మా యావిడా కూడా తాపత్రయపడ్డం. మా ప్రయత్నం ఫలించింది. ఇదిగో నీ కావలసిన డబ్బు' అని కావిడి పెట్టెలోంచి ఒక 50 రూపాయలుతీసి అవతారం చేతిలోపెట్టి, 'నీ బాకీ ముప్పయి రూపాయలూ తీసుకో! మిగతా

ఇతనైై రూపాయలూ నువ్వు నాకు తిరిగివ్వక్కర్లేదు. అమ్మాయికి చీరె పెట్టాలని మా యావిడ కెన్నాళ్ళ నుంచో కోరిగ్గావుంది. ఆమె కిష్ట మైంది ఎన్నుకుని తెచ్చుకుంటే రేపు అది రాగానే దాని చేతులమీదుగా పెట్టుకుని సంతోషిస్తుంది.

మే మిద్దరం ఆడిన ఈ నాటకం చాలా విజయవంతమైంది. చాలా సంతోషం నాయనా! లోకంతీరు గమనించి నడుచుకో! ముందు నీ క్షేమమూ, నీ ఇంటి క్షేమమూ చూచుకోవడం నేర్చుకో! అంటే ఎవరికీ కష్టం కల్గించకుండానే. అనవసరపు పొగడ్తలకు మోసపోయి పీకెల మీదికి తెచ్చుకోకు. ఇవాళనుంచే నీ మిత్ర సంతర్పణలు రద్దుచేసేయ్' అని ఉపదేశించారు మాష్టారు.

అవతారం తన కళ్ళనీ చెవుల్నీ తనే నమ్మలేకపోయాడు.

ఒక్కనిముషం అలాగే మాష్టారి వంకచూసి, కళ్ళవెంట నీరు కారుతుండగా హఠాత్తుగా మాష్టారి పాదాల మీద వాలిపోయాడు— భక్తితో, కృతజ్ఞతతో.

వాత్సల్యంతో లేవనెత్తి కన్నీరు తుడిచి, వీపునిమిరి ధైర్యం చెప్పారు మేష్టారు.

మరో అరగంటలో

'ఈ రోజునుంచీ 'మిత్ర సంతర్పణలు' అనేపేరుగల 'విశ్వాస ఘాతకుల విందు' రద్దుచేయడమైనది.'

ఇట్లు,

ఇప్పుడే కళ్ళు తెరిచిన

అవతారం.

అనే ఎఱ్ఱటి అక్షరాలతో లిఖించబడినబోర్డు వీధి గేటుకు వ్రేలాడదీయబడింది.

బోర్డు చదువుకున్న మాష్టారు తృప్తిగా నిట్టూర్చి పోస్టాఫీసుకెళ్ళారు—మహాలక్ష్మమ్మగార్ని వెంటనే బయల్దేరి రమ్మని టెలిగ్రాం ఇచ్చేందుకు.

□□□

భావలహరి

వీలైతే, ఎవరినీ కొట్టవద్దు. వీలు కాకపోతే మెత్తగా మటుకు కొట్టవద్దు.

—థియొడోర్ రూజ్‌వెల్ట్.

♦

నాగరికత ఇంటిలో ప్రారంభమౌతుంది.

—హెన్రీ జేమ్సు

♦

సంతోషానికి ఎత్తు తప్ప పొడుగు లేదు.

—రాబర్ట్ ఫ్రాస్ట్

♦

కొందరు ప్రేమలో పడతారు. పెళ్ళి సహాయంతో మళ్ళీ బైటికి వస్తారు.

—మేరీ మర్ఫీ

♦

జీవితంలో పైకి రావడానికి తెలివి తేటలతోకూడిన తెలివితక్కువతనం కాస్త అవసరం.

—చార్లెస్ ఎఫ్. కెటరింగ్

♦

ఇద్దరు మనుషులు ప్రతి ఒక్క విషయంలోను ఏకీభవిస్తుంటే— వారిలో ఆలోచన అంటూ వున్నది ఒకడికేనని అర్థం చేసుకోవచ్చు.

—ప్రెసిడెంట్ జాన్సన్

♦

ప్రతి దినం ప్రతివాడు ఒక మంచి పాట వినాలి. ఒక మంచి పద్యం చదవాలి. ఒక మంచి బొమ్మ చూడాలి. వీలైతే, కొన్ని మంచి మాటలు మాట్లాడాలి.

— గేటే

♦

కొన్ని భావాలు అవి మొలకెత్తిన మనసులోకాక ఇంకొకదానిలో నాటినప్పుడు బాగా పెరుగుతాయి.

—జీ. కె. చెస్టర్టన్

♦

నాకు మౌనంగా వుండడం ఎంత ఇష్టమంటే — దాన్ని గురించి ఎన్ని గంటలైనా మాట్లాడగలను.

—బెర్నార్డ్ షా

♦

మనం తప్పుడు పనులు చేయకుండా రక్షించే సాధనాలు చాలా వున్నాయి. కాని, అన్నిటిలోకి మేలైనది పిరికితనం.

— మార్క్ ట్వేన్

♦

ఇతరులు నా మేలుకోరి ఇచ్చిన సలహాలను నేను వినకపోవడం ఒక విధంగా మంచిదే అయింది. లేకపోతే కొన్ని ముఖ్యమైన పొరపాట్లు చేసే అవకాశం నాకు కలిగేదికాదు.

—జీన్ ఫౌలర్

□□□



ప్రముఖుల నవ్వులు

ఐరిష్ రచయిత జార్జిమూర్ శారీరకంగా, మానసికంగా తన 80వ సంవత్సరంలో కూడా దృఢంగా ఉన్నాడు. ఒక పత్రికా విలేకరి 'ఇంత మంచి ఆరోగ్య స్థితిలో ఉండడానికి మీరేం చేశారు?' అని ఆయన్ని అడిగాడు.

'సిగరెట్ త్రాగలేదు, సారా త్రాగలేదు, స్త్రీని తాకలేదు నా బాల్యంలోని 10 సంవత్సరాల వరకు' అన్నాడు జార్జిమూర్.



'మిస్టర్ షా! నీవు నీ బైబిల్ కాపీ ఒకదాన్ని అమ్మివేశావు. ఇది మంచిది కాదు. బైబిలు అమ్మిన వారు నరకానికి పోతారు' అని



బెర్నార్డ్‌షాను ఒక మతాధికారి మందలించాడు.

షా వెంటనే ఇలా జవాబిచ్చాడు: 'జాగ్రత్తగా మాట్లాడవయ్యా. ఈ మాట ఏ పుస్తక విక్రేత దగ్గరైనా అనేవు!'

*



సర్ అసుతోష్ ముఖర్జీ ఒకసారి రైల్లో ప్రయాణం చేస్తున్నాడు. అదే పెట్టెలో ఆంగ్లేయుడొకడు ప్రయాణం చేస్తున్నాడు ఆంగ్లేయునకు ఒక భారతీయుడు తనతో సమానంగా ప్రయాణం చేయటం ఏమంత రుచించలేదు. అసుతోష్ నిద్రపోతుండగా ఆ ఆంగ్లేయుడు అసుతోష్ బూట్లను కిటికీలో నుంచి బయటకు విసిరి వేశాడు. నిద్ర లేచిన అసుతోష్ తన బూట్లు లేకపోవడం చూశాడు. పెట్టె అంతా వెదికాడు. ఆంగ్లేయుడు గుర్రు పెట్టి నిదుర పోతున్నాడు. ఆంగ్లేయుని కోటు తీసుకుని బయటకు విసిరి వేశాడు.

ఆంగ్లేయుడు నిద్రలేచి తన కోటు లేకపోవడం చూసి కోపంతో 'నా కోటు ఏదీ?' అని అసుతోష్‌ను అడిగాడు.

'నా బూట్లను వెతకడానికి మీ కోటు వెళ్ళింది' అని అన్నాడు అసుతోష్ నవ్వుతూ.

*

థామస్ ఎడిసన్‌కు విందులు సరిపడవు. టైమ్ వేస్టు అవుతుందని అతని భయం. ఒక విందుకు వెళ్ళినపుడు ఎంతో ప్రొద్దు కూర్చున్నాడు. విసుగేసి బయటకు జారిపోవాలనుకున్నాడు. అప్పుడే ఒకాయన ఎడిసన్‌ను నిలబెట్టి ఇలా అడిగాడు 'మీ దర్శనంగాక చాలా రోజులైంది. మీ రిప్పుడు ఏం చేస్తున్నారు?'



థామస్ ఎడిసన్ 'హుం' అని నిట్టూరుస్తూ ఇలా జవాబిచ్చాడు: 'బయటకు వెడుతున్నాను.' □□□

ఓ. కామేశ్వరి

పిచ్చాడి ప్రేమ



నల్లటి నున్నటి గచ్చు మీద ముత్యాలు విరజిమ్మినట్టుంది ఆకాశం. నల్లటి పెద్ద చెరువులో విరిసిన ఒకే ఒక కలువలా తోడు లేదన్నట్టు బిక్కు బిక్కుమని చూస్తూ చంద్రుడు దిగులుగా నెమ్మదిగా కదులుతున్నాడు. కునికిపాట్లు పడుతున్న గూర్ఖా వుండి వుండి వొక్కసారి మెలకువ తెచ్చుకుని అటెన్‌షన్‌లో నిలబడ్డట్టు తలవాల్చి స్తబ్ధుగా ఉన్న చెట్లు వొక్కసారి హడావిడిగా పిల్లగాలులు వీచి మళ్ళీ కదలకుండా ఊరుకున్నాయి. నల్లటి త్రాచులా నిగనిగలాడుతూంది తార్రోడ్డు ఆ వెన్నెల్లో. కక్కటిల్లి యేడ్చే పసివాడి నోటికి పాలందించగానే యేడుపు మానినట్టుంది ఆ వీధి నిశ్శబ్దం.

ఆ నల్లటి నున్నటి రోడ్డుమీద తెల్లటి మెరిసే కారు వొకటి నెమ్మదిగా, అతి నెమ్మదిగా, తల్లిమీద అలిగిన పసివాడు అమ్మ పిలిస్తే గునుస్తూ ఒక్కో అడుగు జార్చినట్టు వెడుతూంది. కారులో నల్లనిస్టీరింగ్ మీద తెల్లగా, అతితెల్లగా, తామర తూడులా కోమలమైననల్లని స్క్వేర్ వాచ్ చేయి, స్టయిలుగా నడుపుతూంది.

గాలికి రెపరెపలాడే ఆమె పల్చటి షిఫాన్ గులాబిరంగుచీర, గులాబి రేకులకంటే మెత్తగావున్న ఆ చీర చెంగు, ప్రక్కనే వున్న ప్రియునిముఖం వొక్కసారి కప్పేసి, ఉక్కిరిబిక్కిరి చేసేసి, తప్పుకి క్షమాపణలాగా, పరిహారార్థంగా చల్లని, మెత్తని, సన్నని సంపెంగ అత్తరు వాసన అతనికి అందిచ్చి తొలగిపోతూంది ఏ మెరగని దానిలా!

'రాణీ!' మెల్లిగా మెత్తగాఏవో లోకాల్లో తేలిపోతూ అన్నాడతను.

'ఊఁ!' గోముగా ముద్దుముద్దుగా గునిసింది రాణి.

'రాణీ... రాణీ' అన్నాడు మళ్ళీ. 'అమ్మా', 'అమ్మా' అన్నమాట తప్పించి మరోటిరాని పసివాడు ఏదో చెప్పడానికి పడే ఆరాటం అతనిది.

'ఊఁ' నవ్వింది మబ్బుల్లో మెరిసినట్టు. 'రాజా!... నా పిచ్చిరాజా!' అంటూ చేతిని అతని క్రాపులో అల్లరిగా కదిపింది.

'రాణీ... రాణీ, నువ్వూ నేనూ యిలా... యిలా... యెన్నటికీ యిలానే వుండిపోతే...' ఆమె మెడ దగ్గర మొగంతో అదుముతూ మెల్లిగా అన్నాడు.

'ఊఁ' మళ్ళీ నవ్వింది రాణి.

'అబ్బ! ఏమిటా 'ఊ' భాష? ఏదన్నా మాట్లాడు!' మురిపెంగా అన్నాడు.

'మాటలెందుకు? ఇలాగే వుండిపోదాం, ఈ నిశ్శబ్దంలో, ఈ వెన్నెల్లో, ఈ చల్లగాలిలో, ఈ సువాసనలతో, ప్రేమలో, పారవశ్యంలో ... వేరేం మాట్లాడవద్దు రాజా!' బొంగురు పోయినట్టున్న గొంతుతో తనలో తాననుకున్నట్టుంది రాణి.

'రాణీ, యిలా యెన్నాళ్ళు?... ఈ తపస్సు! ఎప్పటికి విముక్తి? ఎన్నాళ్ళిలా కలయికలోని యెడబాటు అనుభవిస్తూ వేగాలి? ఎన్నాళ్ళకి దేవి కటాక్షించదేం?' దైవదర్శనానికి క్యూలో నిల్చొని నిల్చొని విసిగెత్తిన తిరుపతి భక్తుడిలా ఆవేదనగా అన్నాడు.

'భక్తా! త్వరలోనే నీ అభీష్టం సిద్ధించును!'

'హాస్యం గాదు రాణీ! మీ నాన్నకి చెప్తానన్నావు, చెప్పావా?'

'లేదు. సమయంకోసం చూస్తు

న్నాను. ఇంత ఎంతోకాలం ఆగమలే!"

"నన్ను చాలా దూరం తీసుకొచ్చావు రాణీ. ఇంకిప్పుడు నువ్వు లేకుండా ఉండడమంటే ఏమిటో అసాధ్యమనిపిస్తుంది. అలాగని మీ నాన్న మనమధ్య యీ అంతస్థులన్నీ మరిచి మన పెళ్ళికి ఒప్పుకుంటారా అన్నదీ సందేహమే!"

"డోంట్ బి సిల్లీ, రాజా డియర్! మా నాన్నకి నేనొక్కతనే గారాలకూతురన్న సంగతిమర్చిపోతున్నావు! నామాట జవదాటడు. నా యిష్టాన్ని వ్యతిరేకించే సాహసం ఆయన యెన్నడూ చేయలేదు, చెయ్యడు! కాబట్టి, ఇంక బుద్ధిగా యింట్లోకివెళ్ళి నిద్రపో' దేశవాళీ చలన చిత్రాల్లో నాటు కథానాయకుడు, నాయికగడ్డం సున్నితంగా ఒకే ఒక వేలుతో యెత్తి పట్టుకున్నట్టు, అతనిగడ్డంపట్టి యెత్తి కళ్ళలోకి ప్రేమగా చూసింది.


"ఓకే, గుడ్ నైట్ రాణీ!" అంటూనే సున్నితంగా రాణి చెయ్యి నొక్కిపట్టి దిగాడు రాజగోపాల్.

'గుడ్ నైట్ రాజ్!' రాజ్‌ని డ్రాప్ చేసి, వొక్క వూపుతో కారు ముందుకు పురికించి మాయమైంది రాణి, రాజలా నిలబడి చూస్తూండగానే!

♦ ♦ ♦

ఊరికి దూరంగా యెత్తయిన కొండలమీద, ఎర్రని గుట్టలమీద, మనుష్యులకి, గోలకి, మురికికి, ఈగలకి, అన్నింటికి దూరంగా అంతస్థుకి చెందిన వాళ్ళకి, అంతస్థులుండే భవనాలుంటాయి. చెల్లా చెదరుగా విసిరిన గింజల్లాగా అక్కడోటి అక్కడోటి ఉంటాయి. ఒకదానితో ఒకదానికి సంబంధం లేదన్నట్లు, వెలేసినట్టు మీతోమాకేంసంబంధంఅన్నట్టు విడివిడిగా, యెవరి ఆధిక్యం వారు చూపించుకోడాని కన్నట్టు, ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నట్టు ఒకదాన్నిమించి ఒకటి వెలుస్తాయి ఆ కొండల తలలమీద. అందులో అన్నింటికంటె యెత్తయిన చోట గుమాస్తాలమధ్య కలక్టర్లా, నక్కలు తోడేళ్ళమధ్య సింహంలాగ, ఠీవిగా తలెత్తి నిల్చొనుంటుంది ఓ యెర్ర రాళ్ళ బంగళా! అదే రాధారాణి నాన్న బంగళా!

ఆ బంగళాచుట్టూ భారీ ప్రహరీ గోడ వుంటుంది, మామూలు వాళ్ళకి అందనంత యెత్తున. అందమైన నగిషీలుచెక్కిన అల్యూమినియం రంగు గేటు. ఆ గేటుతెరిస్తే ఎర్రటిబాట. బాటకి రెండువైపులా విదేశీ, దేశవాళీ రంగురంగుల మొక్కలు, ఫౌంటెన్లు, సిమెంటు బెంచీలు, గార్డెన్ ఛెయిర్లు, క్రీపర్లు, పూపొదలు, అన్నీవుంటాయి. కాంటిలివర్ పోర్టికో, విశాలమైన వరండాలు,



నున్నటి స్తంభాలమీద కెక్కించిన పూలతలు, లైట్ గ్రీన్ డిస్టెంపర్ కొట్టిన పెద్ద పెద్ద గదులు, ఎయిర్ కూలర్లు, మొజాయిక్ ఫ్లోరింగ్, ఫ్లోరసెంట్ దీపాలు, ఖరీదయిన పల్చని నైలాన్ తెరలు, మొహాలు కనిపించే పాలిష్‌వున్న నున్నటినల్లటి ఫర్నిచర్, తివాచీలు, ఫ్లవర్‌వాజ్‌లు, ఆయిల్ పెయింటింగులు, డన్‌లప్పిల్లోలు, ఫ్రిజిడైర్లు, రేడియోగ్రాములు, వాషింగ్ మెషిన్లు, టేప్ రికార్డర్లు, ట్రాన్సిస్టర్లు, హాట్, కోల్డువాటర్ బాత్‌లు, డైనింగ్ రూంలు, డ్రాయింగ్‌రూంలు, వెయిటింగ్ రూంలు, గెస్టురూంలు, నాలుగు రకాల ఫోనులు వగైరా, వగైరా అవసరమైన, అనవసరమైనవన్నీ వున్నాయి ఆ బంగళాలో! అవేగాక మెత్తగా మెల్లిగా జరజరాపాకే పాములాంటి పొడవైన ఇంపాలా కారు, రెండు దేశీకార్లు వున్నాయి రాణి నాన్నకి! ఇంకా యేవేవో కంపెనీల్లో బోలెడు షేర్లున్నాయి. ఇవన్నీవున్న రాధనాన్నకి బ్యాంకుల్లో పెద్ద మొత్తా లుంటాయని వేరే చెప్పక్కర్లేదుగా!

ఆ నాన్నకి ముద్దులపట్టి, గారాలచిట్టి, వరాలమూట, అపరంజి

బొమ్మ – రాధారాణి! నాన్నకి ప్రాణం రాణి! లేక లేక పుట్టిన యేకైక పుత్రిక! తల్లిలేని పసికూన! బంగాళాలకి, బ్యాంక్ ఎకౌంట్లకి, కంపెనీల షేర్లకి, కార్లకి అన్నింటికి ఏకైక వారసురాలు!

రాణి డిక్షనరీలో సుఖమేగాని కష్టమన్న మాటేలేదు. పిక్‌నిక్‌లు, పార్టీలు, హాలీవుడ్ సినిమాలు, విలాసాలు, వినోదాలు అన్న మాటకు క్షణాలమీద జరిపించే తండ్రి, వంగి సలాములు జేసే నౌకర్లు, యివి మాత్రమే జీవితంలో వుంటాయనుకునే అమాయకురాలు! జీవితంలో దారిద్ర్యం, కుళ్ళు, మురికి, ఈగలు, యేడ్పులు, చావులు, పస్తులు, కొట్లాటలు, రోగాలు అంటే యేమిటో తెలీని ముగ్ధ!

రాజుతో పరిచయమయ్యాక, అతని యింట్లో కనీసం ఓ పదిగదులు లేవని, సోఫాసెట్లు, కర్టెన్లు, డైనింగ్ టేబిల్స్, రేడియోలు లేవని విని, కని ఆశ్చర్యపోయింది. కనీసం ఒక స్టాండర్డ్ హెరాల్డ్ కారు, అధమం లాంబ్రెట్టా అయినా లేదని విని తెల్లబోయింది. రాజు నాన్నకి మూడువందల రూపాయలు జీతం అని విని మూడురూపాయల్లాంటి ఆ మూడువందలతో రాజ్ కుటుంబ సభ్యులు ఆరుగురు యెలా బ్రతుకుతున్నారా అని వింతగా చూసింది! రాణి నాన్నలాంటివాళ్ళు వెయ్యికి, మళ్ళీ మాట్లాడితే లక్షకి ఒకరుకూడా వుండరని రాజ్ చెప్పడం విని నిశ్చేష్టురాలైంది. భారతదేశ దౌర్భాగ్య స్థితికి జాలిపడింది, చింతించింది!

అలాంటి బంగారు పిచ్చుక రాణి ఆకాశమంతెత్తు అంతస్తుని మరిచి రాజ్ నెలా కటాక్షించింది? తెలియాలంటే ప్రజలు షేక్స్పియర్ నాటకాల్నుంచి తెలుగు సినిమాలదాకా ఏన్నో పాత్రల్ని యెన్నో సన్నివేశాల్ని తరిచి పరిశీలించాలి; ప్రేమ గుడ్డిదన్న సూక్తి మర్చిపోగూడదు. రాణి చిరునవ్వుల పన్నీటి జల్లులకోసం, వాడి కత్తుల్లాంటి వాలు చూపుల సూటి తాకిడికోసం ప్రాకులాడే కన్వర్టిబుల్ కార్లున్నవాళ్ళు, బకింగ్‌హాంపాలెస్ లాంటి భవంతులున్నవాళ్ళు, టెర్లిన్‌సూట్లవాళ్ళు, మిట్టమధ్యాహ్నపు యెండలోంచి చీకటి గుయ్యారంలోకి అడుగుపెట్టినట్టు మొన్నే విదేశాల్నుంచి దిగినవాళ్ళు, చెక్కుల్తోనేగాని నోట్లతో వాణాల్తో వ్యవహరించి యెరుగని ఉన్నతోద్యోగులు, అసలు సిసలైన డింపిల్స్ విస్కీ తప్పించి సేవించి యెరగని విలాస పురుషులు, ప్రతీ రాత్రి ఏ హొటలు నునుపు ఫ్లోర్ మీదనో సుందరాంగుల బిగి కౌగిలిలో గీపెట్టే సంగీతానికి లయగా అడుగులు జార్చనిదే ప్రొద్దుగడవని రసికులు, కత్తి కటారుల్తో గాకుండా దేవుడిచ్చిన చేతుల్తో తిండి తినడం అందమైన్లో ఆదివాసుల అలవాటనుకునే అత్యాధునికులు – యింతమందుండగా ఆవేవీ యేమిటో తెలియని మిల్‌యూరన్ చొక్కా, పర్షాలా పాంటుతో ఉదయాన్నే లేచి బుద్ధిగా కాలేజి పాఠాలుచదువుకునే రాజ్ రాణి ప్రేమని పొందడం యెలా సాధ్యపడింది? ఏమా కథ అని అడిగితే—

ఒంటిగాపోతున్న అబల, కుసుమకోమలి, గులాబి రేకులాంటి జవ్వని, చెలికత్తెలు వెంటరాగా రెండో ఆట యింగ్లీషు సినిమా చూసి విలాసంగా కబుర్లు చెప్పుకుంటూ కిలకిలా నవ్వుకుంటూ, ఒక్కొక్క నెచ్చెలిని డ్రాప్ చేసి, యిళ్ళదగ్గర దింపి, యింటికి తిరిగి వస్తుంటే, ఆ యెగుడు దిగుళ్ళ రోడ్‌లో, నిర్మానుష్యమైన నడిరాత్రి టైర్ బరస్టవడం, టైరు మార్చుకోలేని, కారు వదిలి నడవలేని నిస్సహాయస్థితిలో దిక్కులు వెతుకుతూ బిక్కుబిక్కుమని చూస్తున్నవేళ, రెండో ఆట సినిమానే చూసి మెల్లిగా ఓల్డ్‌హార్స్ లాంటి సైకిల్ను వేధిస్తూ వస్తూన్న రాజ్, పౌరాణిక చలనచిత్రాల్లో శ్రీ మహావిష్ణువు పిల్చినా పిలవకపోయినా శిష్టరక్షణార్థం దర్శనమిచ్చినట్టు, ప్రత్యక్షమవడం, "ఏమండీ!" అని ఆమె అతి మధురంగా పలకరించి, చూపుల్తో కట్టేసి ప్రాధేయపడ్డం, అతడు ఆమెకి సహాయపడ్డమే తన జీవిత పరమావధిగా భావించి స్టెప్నీ మార్చడం, ఆమె అతనివంక కృతజ్ఞతతో నిండిన వాల్జూపు విసిరి, యింటిదగ్గిర విడవడం, మర్నాడు ఆదివారం టీపార్టీకి, ఆ తర్వాత వాహ్యాళికి ఆహ్వానించడం, అలా అలా కలుసుకున్న సమయాల్లో పురుషపుంగవు లెందర్లోనో కనబడని ఆకర్షణ ఆమెకి అతనిలో కనబడ్డం–అవీ రాణి ప్రేమాయణంలో నాందీ, ప్రస్తావనలు!

రాజ్ ముందు ముందు. రాణిలాంటి శ్రీమంతురాలు తనని తలచడం ఈ భూమ్మీద మానవాళి మనుగడని ఉఫ్ఫని ఊదిపారేసే ఉపద్రవమేదో అని బెదిరాడు, జంకాడు, తబ్బిబ్బైయాడు, తనకెందు కనుకున్నాడు, ఆమెవంక చూడకూడదనుకున్నాడు; కాని విడవక వెంటబడ్డ రాణి ప్రేమవాహినులో మునిగి తల మున్కలయాక షేక్స్పియరేమన్నాడు, కారల్ మార్క్స్ యేమన్నాడు, డి. హెచ్. లారెన్స్ యేమన్నాడు? అని ప్రశ్నించుకుని యిది ప్రగతివైపు మానవుడి పురోగమనంలో అతి ముఖ్యమైన మెట్టు, సర్వమానవ సౌభ్రాత్రానికి సాగే నిరంతర కృషికి పరాకాష్ఠ, పెట్టు

[illegible]

బడిదారీ వర్గాలమీద అభివృద్ధి నిరోధక శక్తులమీద, శ్రామికులు, కష్టపడి పనిచేసే మంచివాళ్ళు తీసే గట్టిదెబ్బ అనుకున్నాడు! అనుకొని ఈ ప్రేమని సాధ్యమైనంత త్వరలో పుష్పింపజేసి, ఫలింపజెయ్యాలనుకున్నాడు!

* * *

'వాట్!' రాణి నాన్న ఆశ్చర్యంతో తలమునక్క లయిపోయాడు హఠాత్తుగా రాణి చెప్పిన మాట విని.

'అవును, నాన్నా, నేను రాజ్ ని పెళ్లాడ్డానికి నిశ్చయించుకున్నాను. రాజ్ ని తప్ప యింకెవ్వర్నీ పెళ్లాడను!' మళ్ళీ రెండోసారి నొక్కి చెప్పింది.

ఎయిర్ కండిషన్డ్ గదిలో కూర్చున్నాగాని, ఇన్ కంటాక్సు లెక్కల్లో చెమటలు గక్కేస్తున్న నృసింహారావుకి, ప్రహ్లాదుడు మొట్టమొదటిసారి "నారాయణా" అన్నప్పుడు హిరణ్యకశిపుడికి వచ్చినంత చిరాకు వచ్చింది.

'ఎవడువాడు? మొన్న మనింటికి టీ తాగిపోడానికి వచ్చిన వాడేనా? ప్రేమించడానికి నీకా పర్తాళా మొగం తప్పించి ఇంకెవడూ కనబళ్ళేదా? నిన్నన్నాళ్ళు గాజు మేడల్లో, ఫోమ్ కుషన్ మీద, యింపాలా కార్లో, డ్రాలన్ చీరల్లో వేల మీద దుమ్ము, గడ్డి, చెత్త అన్నింటికి దూరంగా దాచి పెంచానే, నీకీ పాడుబుద్ధి ఎలా వచ్చాయి?'

తన పందొమ్మిదేళ్ళ జీవితంలో ఏనాడూ ఇంత కఠినంగా మాట్లాడి యెరగని నాన్నని చూసి రాణి మొదట నమ్మలేకపోయింది. ఆ తర్వాత కళ్ళలోకి నీళ్ళు చిమ్మాయి. తలదించుకొని కిటికీదగ్గరకి పరుగెత్తి ఊచలు పట్టుకుని బయటికి చూస్తూ వెక్కి వెక్కి యేడ్చింది.

'అదేమిటు దలా, సాంఘిక చిత్రాల్లో ఖండిత నాయికలాగా కిటికీ ఊచలు పట్టుకు యేడుస్తుం దెందుకు? జుట్టుకాస్త విరబోసుకో చెల్లమ్మా! సరిగ్గా అతికినట్టుం టుంది!' విట్టువేసి నవ్వాడు బుజ్జి.

రాణి మొగం లేతగులాబీరంగుది, ముదురు యెరుపయ్యింది. కళ్ళు నిప్పుకణాలయ్యాయి. ముక్కుపుటాలదిరాయి. చురుక్కున వెనక్కి తిరిగింది.

"సంతోషించాం గాని, నీ చచ్చు విట్లుకి నువ్వే నవ్వుకుంటూ కాసేపు బయట కూర్చో. నేను నాన్నతో మాట్లాడాలి."

నృసింహారావు ఎన్నడూచూడని రాణి కన్నీరు చూసి గిలగిల్లాడిపోయాడు. తల్లిపోయి నప్పట్నుంచి ఆమె కంటతడిపెట్టగూడదని ఆడింది ఆటగా పాడింది పాటగా పువ్వుల్లో పెట్టి పెంచాడు. ఆమె పంతం,

పట్టుదల ఆయనకి బాగా తెలుసు. ఏం చెయ్యడం? ఎలా నచ్చచెప్పడం? అని తికమక పడుతున్న మనిషికి బుజ్జిమాటలు కొంత ఊపిరి సలిపేలా చేశాయి. బుజ్జి ఆయనకి అన్నగారి కొడుకు, కుడిభుజం, ప్రిన్సిపల్ ప్రైవేట్ పర్సనల్ సెక్రటరీ, మంత్రి, సలహాదారు యింకా ఇలాంటి వెన్నో! దేవుడు తన దగ్గరున్న తెలివితేటల్లో సగం బుజ్జికిచ్చేసి మిగిలినవి మిగతా మానవులందరికీ పంచిపెట్టాడని ఆయనకి గట్టి నమ్మకం.

'చూడు తల్లీ! నువ్వు కావాలంటే కొండమీద కోతిని తెస్తాను. కాని ఈ రాజేమిటమ్మా! అతను నీకు తగునా?' అల్లరిచేసే పిల్లకి మిఠాయి చేతిలో వుంచి బుజ్జగించి వట్టున్నాడు నృసింహారావు.

'నాకు కోతీవద్దు, కొండముచ్చూ వద్దు అతన్ని విడిచి నేనొక్క క్షణం వుండలేను. నేను బతకాలనుంటే అతన్ని అంగీకరించండి, లేదంటే...'

అదోలా నవ్వాడు ముసలాయన. మంచీ చెడ్డా తెలియని చిన్నపిల్లాడు మేడమీంచి దూకుతానని మారాం చేస్తుంటే నచ్చచెప్పలేక అవస్థపడుతూ, అసహాయతని దాచుకుంటూ చిరాగ్గా యేడవలేక నవ్వినలాంటి నవ్వు.

'రాణీ, రాజంటే నువ్వు ప్రెజంట్ చేసిన టెర్లిన్ టీషర్ట్ తొడుక్కుని నీతో కారో తిరిగేవాడే ?'

రాణి బుజ్జిని కొరకొరచూసింది. రాణి కంటికి బుజ్జి, హిందీసినిమాల్లో హీరో హీరోయిన్ను నాలుగయిదు డ్యూయెట్లు పాడుకున్నాక సహించలేక, యింటర్వెలయ్యాక విజృంభించే విలన్. తెలుగు జానపద చిత్రాల్లో రాజుగారి రాజ్యం కాజెయ్యాలని యెత్తేసే రాజుగారి బావమరిది!

రాణి మంచిచెడ్డలు, పినతండ్రి వ్యాపార లాభనష్టాలు, యింటి నౌకర్ల అజ్మాయిషీ అంతా తను లేనిదే తలక్రిందు లయిపోతుందని, బాబాయిలాంటి అమాయకుడు, రాణిలాంటి పసిపిల్ల ఇద్దరూ తను లేకపోతే ఈపాటికి నడివీధి పాలయ్యేవారని బుజ్జి ఊహ! తన విషయాల్లో జోక్యం కలిగించుకోవద్దని రాణి యెన్నోసార్లు చెప్పినా, ఏదో పసిది కోపంలో అన్నదని, 'గోతిలోకి దిగుతాను, విషం తింటాను, నాయిష్టం!' అని యేచంటిదన్నా అంటేమాత్రం పెద్దవాళ్ళూరుకుంటారా, ఊరుకోడం భావ్యమా అన్న ధోరణిలో మంచీ చెడ్డా తెలిసున్న బుజ్జి ఆమె మాటలు లెక్కచెయ్యడం మానేశాడు! అసలు బుజ్జికి రాణి అలా మంచినీళ్ళలా డబ్బు ఖర్చుచేసెయ్యడం, నానా అడ్డమైనవాళ్ళతో తిరగడం, వాళ్ళని

భార్య :- ఏమండీ! గాజు గ్లాసులూ, సాసర్లూ కొంటానని బజారు కెళ్ళి ఒట్టి సాసర్లే కొనుక్కొచ్చారేం? గ్లాసులు నచ్చలేదా?

భర్త :- ఏం గ్లాసులో! అన్ని షాపులూ చూశాను. అన్నిచోట్లా గ్లాసులు తిరగేసి నిలబెట్టారు. ఎందుకు పనికొస్తాయవి!

సినిమాలకి, పిక్నిక్‌లకి, పార్టీలకి తీసుకెళ్ళడం గిట్టదు! కాని ఏం చెయ్యడం? చెప్తే రాణి వింటుందా? నిర్లక్ష్యంగా వెళ్ళిపోతుంది. బాబాయికి చెప్తే 'ఆఁ, పోనిద్దూ, ఏదో చిన్నపిల్ల సరదా, ఈ డబ్బంతా దానిదేగా! ఇంకెవరున్నారు నాకు?' అంటాడు. అని ఆమెనలా నెత్తికెక్కించుకోడం బుజ్జికిష్టంలేదు. ఎవరున్నారేమిటి? తనులేడూ? పూర్తిగా కాకపోతే సగమైనా తనకివ్వరాదూ? ఎప్పుడో పదిహేనేళ్ళప్పుడు వచ్చి ఆయన్నే అంటిపెట్టుకున్నందుకు ఆమాత్రం యిస్తే బాబాయి సొమ్మేంపోతుంది?

తిరగడానికి ఓ కారు, యింట్లో తిండి, ఖర్చుకి ఓ మూడు నాలుగొందలు తప్పించి యింకేం ఈయడంలేదు బాబాయి; ఇచ్చే లక్షణాలూ కనబడ్డంలేదు. కాబట్టే నిర్లక్ష్యం. అలాంటివాడే ఆమెకి భర్తయి వస్తే అతని పంట పండుతుంది. నయాపైసల మంచీ లెక్కపెట్టే రాజులాంటివాడు వస్తే అతని పని ఉత్తిదే! ఆమాత్రం గ్రహించగల సూక్ష్మబుద్ధి, బుజ్జి!

అందుకే రాణి తన తిరుగులేని నిర్ణయం ప్రకటించి బయటికెళ్ళాక తలపట్టుక్కూర్చున్న బాబాయిని నెమ్మదిగా ఊరడించాడు బుజ్జి

'నువ్వేం బాధపడకు బాబాయ్; ఇలాంటి రాజుల్ని వందమందిని వదిలిస్తాను. అసలు రాణి చుట్టుపట్ల మైళ్ళ వ్యాసార్థంలో యెక్కడా ఇలాంటి వెధవలు చేరకుండా అవతల ఉంచుతాను. ఆ సంగతి నా కొదిలేసి నిశ్చింతగా ఉండు'


'అదేదో త్వరగా చూడరా బాబూ! దాని ధోరణి చూస్తే నాకు పిచ్చెత్తుతోంది! గట్టిగా వద్దంటే యేంచేస్తుందో!... అన్నట్టు ఇలాంటి వన్నీ సాధ్యమైనంతవరకు సున్నితంగా చూడ్డం మంచిది! ఎలా నిబ్బరించుకొస్తావో!'

'అదంతా నీకెందుకు! నా చేతిలో పాతికవేలు పారెయ్యి; వాడి ప్రేమతిమ్మిరి వదిలిస్తాను!'

'పాతిక కాకపోతే యాభై పట్టు కెళ్ళు; కాని చేసేదేదో తొందరగా చెయ్యి.'

బుజ్జి నవ్వాడు. తన సమర్థత మీద బాబాయి కింకా నమ్మకం కుదరనందుకు విచారించాడు తన బుద్ధి కుశలత, కార్య శూరత్వం ఈ ఒక్కసారి ప్రదర్శించి బాబాయి కళ్ళలో ఆకాశం అంత యెత్తు లేవాలనుకున్నాడు!

* * *



మరో పదిరోజులు వాతావరణం స్తబ్ధుగాఉంది. రాణి బుజ్జితో మాట్లాడటం మానేసింది. తండ్రితోకూడా పలకరిస్తే ముక్తసరిగా తప్పించి వేరే మాటల్లేవు. నృసింహారావు చాలా యిబ్బంది పడ్డాడు. బుజ్జికేసి ఆత్రుతగా చూసేవాడు. 'నీకేం ఫర్వాలేదు' అని అభయహస్త మిచ్చేవాడు బుజ్జి

ఒకానొక సుప్రభాతాన యింకా నైట్‌గౌనులోంచి బయటికి రాకుండానే, సోఫాలోవాలి బెడ్ టీ సిప్ చేస్తూ మార్నింగ్ ఎడిషన్ పేపరు తిరగేస్తున్న రాణికి నగరంలో వార్తల శీర్షిక కింద క్రితం సాయంకాలం యేదోచోట జరిగిన కొట్లాట వైనం కనిపించింది. అలాంటి వార్తలంటే యిష్టం రాణికి! సర్దాగా చదివింది. ఎవరో విద్యార్థి సైకిలుమీద అటు వెళుతున్నాడు. ఇద్దరు ముగ్గురు వ్యక్తులు ప్రక్కనున్న కల్లుపాకలో మస్తుగాతాగి అప్పుడే బయటికివచ్చి తందనాలాడుతున్నారు. ఆ అబ్బాయి గంటు మ్రోగించాడు, నోటితో చెప్పాడు. కాని ఆ వ్యక్తులు లొంగలేదు. పైగా బూతులు తిట్టారు. ఆ అబ్బాయి సైకిలు దిగి వాళ్ళని అదిలించబోయాడు. కొట్లాట జరిగింది. జనం మూగారు. ఆ చీకట్లో సరిగ్గా ఏం జరిగిందో ఎవరికీ తెలియదు. ఆ అబ్బాయికిమాత్రం బలంగా గాయాలు తగిలాయి. అస్పత్రికి తీసుకెళ్తుంటే దారిలో మరణించాడు. ఆ అబ్బాయి పేరు రాజగోపాల్. వయస్సు యిరవై రెండేళ్ళు. కాలేజిలో చదువుతున్నాడు.

రాణి ఆస్పత్రికి పరుగెత్తింది. శవపరీక్ష జరుగుతోంది. తల్లిదండ్రులు యేడుస్తున్నారు. జనం 'అయ్యో, పాపం!' అంటున్నారు. రౌడీ వెధవలని తిట్టిపోస్తున్నారు. తన రాజ్ యింకలేడు!

ఇంటికి తిరిగొచ్చింది. మెట్లమీద కనబడ్డాడు బుజ్జి. ఏదో అనాలనుకుంది. ఇంకేమిటో చెయ్యాలనుకొంది.

'ఇది చూశావా, రాణీ! ఎంత దారుణం! పాపం, రాజగోపాల్‌నెవరో కొట్టి చంపేశారు. నిన్న సాయంకాలమే మాట్లాడా నతనితో నీ పెళ్ళి గురించి! ఇంతలో ఇలా అవుతుందని ఊహించనుకూడా లేదు! ఎంత ఘాతుకం!...' విచారం వ్యక్తపరిచాడు బుజ్జి.

కళ్ళలో నీరు చిమ్ముతూంటే మెట్లమీదికి పరుగెత్తింది రాణి. రెండురోజులు బయటికిరాలేదు; గదిలోకి తండ్రినికూడా రానియ్యలేదు. ఆ రెండురోజులూ పూర్తిగా శోకరసం అనుభవించింది.

మూడోరోజు తండ్రి లోపలికి వచ్చి ఎదురుగా కూర్చున్నాడు. ఆమెకళ్ళు యింక నీళ్ళులేక యెడవనట్టు నిర్లిప్తంగా వున్నాయి.

'నువ్వు గెలిచావు నాన్నా! ఆనందించు!' అంది రాణి.

నృసింహారావు గొల్లుమన్నాడు. జరిగిందానికి బాధ వ్యక్తంచేశాడు. రాజంటే సానుభూతి ప్రకటించాడు. అతని కుటుంబానికి సహాయం చేస్తానన్నాడు బుజ్జిని యింటిలోనుంచి పంపించేశాడు.

♦ ♦ ♦

అదంతా జరిగి అయిదేళ్ళకిపైగా అయింది.

ఇప్పుడు రాణికి ఓ అందాల పాపాయి. ఏణ్ణర్ధం పాపాయి. పత్రికల్లోపుష్టికి, ఆరోగ్యానికి నమూనాగా కోట్లు విలువచేసే చిరునవ్వు చిందిస్తూ కనిపించే పాపాయిల్ని మించి పుష్టిగా, ఆరోగ్యంగా ఉల్లాసంగా వుంటుంది. మాటలు సరిగా రావు. ముద్దుముద్దుగా అమ్మని, నాన్నని మురిపిస్తుంది. ఆ మురిపాలంటే పాపనాన్నకి అంటే రాణి భర్తకి, అంటే కృష్ణరావుకి పంచప్రాణాలు, అందుకని, ఆ మురిపాల కోసం, ప్రతీ సాయంకాలం గుర్రమై పాపని లాన్ అంతా త్రిప్పుతాడు. వాళ్ళవెనకాలే నడుస్తూ వాళ్ళిద్దర్నీ

చూస్తుంటే ఆనందంతో పరవశమయి పోతుంది రాధారాణి!

కృష్ణారావు అందగాడు వెయ్యి రూపాయల జీతగాడు. అన్నిటినీ మించి సరసుడు. అతన్ని కట్టుకున్న వెల్లాళ్ళకే రాణి తండ్రినీ, రాజునీ, ఇంకా రమ, బాల, లత, సుధ లాంటి వాళ్ళని చాలామందిని మరిచి పోయింది. కావాల్సినప్పుడు తండ్రి రెక్కలు గట్టుకు వాలతాడు పాత దీపాన్ని రాయగానే భూతం ప్రత్యక్షమైనట్టు. అక్కర్లేకపోయినా వారానికో మూడు నాలుగుసార్లు ప్రత్యక్షమై వాళ్ళకేవేం లేవో వెతికిచూసి తెలుసుకొని మరుక్షణం తెచ్చి పెట్తాడు. రాధ, కృష్ణ నిలబడి మధ్య ఇద్దరూ చెరోచేత్తో పాపనిపట్టుకొన్న వాళ్ళ ఫామిలీ ఫొటోచూస్తే యెవరి కన్నా క్రింద 'ఆదర్శం' అని వ్రాయ బుద్దేస్తుంది!

ఓ వెన్నెలరాత్రి ఏక శయ్యాగతులైవున్న వేళ రాధ నడుంచుట్టూ చెయ్యేసి కృష్ణ మెల్లిగా అన్నాడు: 'రాణీ! డార్లింగ్. నీకో సంగతి చెప్పాలి. ఇప్పుడు చెప్పాల్సిన అవసరం లేదనుకో, కాని మనమధ్య

వరద బాధితులకు సహాయం చేయండి


'మునుపెన్నడూ' ఎరుగని కరువును గత రెండేళ్ళలో అసమాన శక్తితో మనం ఎదుర్కొన్నాము. ఇప్పుడు ఉద్ధృతమైన వరదల వలన దేశంలోని చాలా ప్రాంతాలలో సోదర ప్రజలు నిలువనీడ లేకుండా వున్నారు. వారికి మన సహాయం కావాలి. ఆపదలో వున్న స్త్రీ పురుషులకు, పిల్లలకు కావలసిన సహాయం అందజేయటానికి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధికి ఉదారంగా విరాళమివ్వమని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను.'

— ఇందిరాగాంధి

ప్రధాన మంత్రి
జాతీయ సహాయనిధికి
ధారాళంగా విరాళమివ్వండి

విరాళాలను
ఈ క్రింది అడ్రసుకు పంపండి.
సెక్రటరీ,
ప్రధానమంత్రి జాతీయ సహాయనిధి
ప్రధానమంత్రి సచివాలయం,
న్యూ ఢిల్లీ.

DAVP 67/F4



యెలాంటి అరమరికలూ వుండకూడదు. అందుచేత నీకా సంగతి చెప్పేస్తే నాకేదో దించినట్టవుతుంది! నేను కాలేజీలో వుండగా ఓ అమ్మాయికి ఉత్తరాలు వ్రాస్తూండేవాడిని. ఇద్దరం యేమేమిటో వ్రాసుకునే వాళ్ళం! చివరికి ఆమెకి పెళ్ళవగానే మా ప్రేమ ఉత్తరాలతోనే ముగిసి పోయింది... యేమిటో, ఇప్పుడదంతా చూస్తే చాలా సిల్లీగా ఉంటుంది. ఆ ప్రేమలూ, ఆ కబుర్లూ ఏదేమిటో తెలియని పసితనం గదూ?'

'అవును. ఎంత సిల్లీగా ఉంటుంది ఇప్పుడాలోచిస్తే! రాజగోపాల్ అని ఓ ముతక ఖద్దరు అబ్బాయిని కార్లో సినిమాలకి షికార్లకి తిప్పేదాన్ని కొన్నాళ్ళు! రెండు నెలలు కాకుండానే అతగాడు యెవళ్ళో రౌడీలతో తగువు పెట్టుకొని దెబ్బలుతిని మరో లోకానికి వేంచేశాడు!... ఇప్పుడని పిస్తుంది! అప్పుడనుకున్నవన్నీ కొంపదీసి నిజమైయుంటే ... ఎంత పోగొట్టుకొనేదాన్నో!' మత్తుగా అంటూ కళ్ళు మూసుకొని తలని మెడకి, భుజానికి మధ్య యిరికించి బలంగా హత్తుకుంది. ఆమెకి నిజంగానే ఏదో బరువు దించినట్టు తేలికయింది మనసు, ఆ సంగతి అతనికి చెప్పేశాక.

□□□



చిట్టి కథలు

ప్రఖ్యాత చలనచిత్ర దర్శకుడు శ్రీ బి. ఎన్. రెడ్డిగారికి ఒక్కొక్కప్పుడు పరధ్యానం.

ఒకసారి ఆయన ఏదో తీవ్రాలోచనలో నిమగ్నులై వుండగా, ఒక యువకుడు ఆయన దర్శనార్థం వచ్చాట్ట.

"నీ పేరు ?" అని అడిగారు రెడ్డిగారు.

"భావ నారాయణ అంటారండి" అన్నాడు యువకుడు.

'ఓ. ఐసీ. మన ప్రొడ్యూసర్ భావ నారాయణ గారు నీ కేమైనా అవుతారా ?' అని రెడ్డి గారు అడిగారట.

*

ప్రసిద్ధ హాస్య రచయిత మునిమాణిక్యం నరసింహారావు గారు బందరు హిందూ హైస్కూలులో చాల కాలం హిస్టరీ మేస్టరుగా పని చేశారు. వారికి అస్తమానం గోళ్ళు కొరుక్కోటం అలవాటు. కొంచెం పరధ్యానం కూడాను.

ఒకరోజున క్లాసులో పాఠం చెబుతూ నరసింహారావుగారు 'ఆర్యులు ఏం తినేవార్రా ?' అని ఓ కుర్రాణ్ణి అడిగారు.

"గోధుమలండి" అన్నాడు కుర్రాడు.

'ఇంకా ఏం తినేవారు ?' అని ప్రశ్నించారు.

'జొన్నలు' అన్నాడు వాడు.

'ఇంకా ?'

'యవలు.'

'ఇంకా ?'

'సజ్జలు.'

వాడు సమాధానం చెబుతున్నకొద్దీ నరసింహారావుగారు పరధ్యానంగా 'ఇంకా – ఇంకా–' అని అడుగుతున్నారు.

కుర్రాడు తనకు తెలిసిన ధాన్యాల పేర్లన్నీ చెప్పాడు. అయినా, మేష్టారు వదల్లేదు. చివరికి వాడు బిక్క మొహం వేసి "గోళ్లు" అని సమాధానం చెప్పాడు.

ఆ సమయంలో ఆయన గోళ్ళు కొరుక్కుంటున్నారు.

—కథక్

□□□

మయవలేని కేసు

"అర్జంట్ కేస్ – వెగిరం రావా"

అని ఫోను రాగానే డ్రస్ అయినా మార్చుకోకుండా మెంటల్ హాస్పిటల్‌కి టికట్ ఇవ్వమని బస్సులో కూర్చున్నాను. మెంటల్ హాస్పిటల్‌కి టికెట్ అనగానే నా వేషం, రూపు చూసి 'మీ ఒక్కరికేనా సార్!' అంటూ కండక్టర్ నాదగ్గరకి వచ్చాడు. కండక్టర్ ఏ ఉద్దేశ్యంతో అడిగేడో గ్రహించి నేనక్కడ పనిచేస్తున్నానని చెప్పాను, పేషెంటుని కానని బోధపడేటట్లుగా. కండక్టర్ తనేదో పొరపాటు చేసినట్లుగా "అదికాదు సార్. మీ స్నేహితు లెవ్వరయినా మీతో వచ్చారేమోనని అలా అడిగాను" అని టికెట్టు, తక్కిన చిల్లర నా చేతులో పెట్టాడు.

హాస్పిటల్‌కి రాగానే వార్డు బోయ్ రంగప్ప గేటు దగ్గర కనపడ్డాడు. 'మీ కోసమే పేషెంట్సు బంధువులు వెయిట్ చేస్తున్నారు సార్. కేసు సూసైడల్ టెండన్సీస్ విత్ డిప్రెషన్ లాగ వుంది సార్' అన్నాడు, తన అనుభవంలో విన్న నాలుగు ఇంగ్లీషు మాటలు దొర్లిస్తూ.

రంగప్పకి వార్డు 'బాయ్' అన్న పేరు గవర్నమెంటు వాళ్ళిచ్చినదే కాని, సర్వీసే ముప్ఫైఏళ్ళు ఉంటుంది. రంగప్ప డాక్టరుగా కాకపోయినా తన ముప్ఫైయేళ్ళ సర్వీస్‌లో చూసినన్ని కేసులు నా కన్నా ఏ సీనియర్ డాక్టర్లు కూడా చూసి వుండరేమో! ఐదారు భాషలు క్షుణ్ణంగా వచ్చు. ఎవ్వరితోటి చెడ్డనిపించుకోడు. డాక్టరు కొత్తవాడైనా చాలా మర్యాదగా చూసేవాడు. ఈ కొత్త డాక్టరుకేం తెలుసు అని గర్వంగా వుండే సీనియర్ నర్సులచేత కూడా ఆ మర్యాద ఇప్పించేవాడు.

నేను డ్యూటీ రూము కెళ్ళేసరికి పేషెంటుని నలుగురయిదుగురు పట్టుకొన్నారు, ఆవేశంగా ఊగుతోంది. పేషెంటు అన్నయ్య ఇంగ్లీషులో ఊరూ, పేరూ చెవుతున్నాడు. తను ఇంజనీరుగా ఆ ఊరిలోనే పనిచేస్తున్నాననిచెప్పి, పేషెంటుకి గార్డియన్‌గా తన చిరునామా ఇచ్చాడు. పేషెంటు తనకి చెల్లెలని, అవిడభర్త పెళ్ళాడిన రెండేళ్ళలోనే పోయాడని, భర్తపోయిన దగ్గర్నుంచి తన దగ్గరే ఉంటున్నాదని, ఇంట్లో వాళ్ళం

దరూ మరి కనిపెట్టలేక విసిగిపోయారనీ చెప్పాడు.

మూడేళ్ళయి ఎన్నోసార్లు ఆత్మహత్యకి ప్రయత్నించి ప్రయత్నించి అన్నిసార్లూ పట్టుబడిపోయిందంటే నాక్కొంచెం ఆశ్చర్యం కలిగింది. జయలక్ష్మిని పట్టుకొన్న వాళ్ళందర్నీ పేషెంట్‌తో మాట్లాడాలని పైనకూర్చోమన్నాను. పేషెంటుని పేరుతోనేపిలిచి కూర్చోమన్నాను.

జయలక్ష్మి అంత ఆవేశంలోనూ ఊగుతూ నా ఎదురుగా కూర్చుంది. బట్టలన్నీ చెమటతో తడిసిపోయి వున్నాయి. హాస్పిటల్ కాంటీన్‌నుంచి రంగప్పచేత కాఫీ తెప్పించి ఇచ్చాను. ఈలోగా నా అసిస్టెంట్ డాక్టర్ మూర్తి రంగప్ప ఫోను అందుకొనివచ్చి నా పక్కనే కూర్చున్నాడు. కేసు గురించి నాకు చెప్పినమాటలే మూర్తికి చెప్పినట్టు వుంది. అంచేత నన్నేం అడగకుండా ఏవో కేసు రికార్డులు చూసుకుంటున్నాడు. జయలక్ష్మి కాఫీ తాగడం పూర్తిచేసింది.

మనిషిలో ఆవేశంకొంతవరకుతగ్గినట్టు కనిపించింది. మీ పేరేమిటని అడిగి జయలక్ష్మి సమాధానంకోసం ఎదురు చూస్తున్నాను. "నిజంగా మీరు మెంటల్ హాస్పిటల్‌లో ఉండవలసిన డాక్టర్లే సార్, లేకపోతే ఇప్పుడే మా అన్నయ్య చెప్పాడు, రికార్డులో రాసుకున్నారు, ఆ పేరుతోనే పిలిచారు, మళ్ళా అడుగుతున్నారు?" అన్న జయలక్ష్మి మాటలకి అంతవరకు ఏవో కేసు రికార్డులు చూసుకుంటున్న మూర్తికూడా తలయెత్తి ఆశ్చర్యంగా జయలక్ష్మి వేపు చూశాడు. సర్దుకోడానికి 'మీ అన్నయ్య చెప్పింది నిజమేనా అని అడిగా'నన్నాను. "పేరుకూడా అబద్ధమే చెప్తాడా అన్నయ్య? మరి ఆ సందేహంవుంటే మీరు రికార్డులో ఎందుకు రాసుకుంటారు? లేకపోతే మీ రికార్డులో అబద్ధాలేతప్ప నిజం రాయరా?" అంది.

ఈ వింత సమాధానాలు ముఫై ఏళ్ళ అనుభవంవున్న రంగప్పనే చిత్తుచేసి నట్టున్నాయి. నన్నెదో రక్షిద్దామని.

"అదికాదు అమ్మా 'ఆత్మహత్యకి మూడేళ్ళయి మీరు ప్రయత్నించటం నిజమేనా అని డాక్టరుగారడుగుతున్నారు" అన్నాడు. 'చచ్చినవాడికళ్ళు చారడేసిఅని విఫలంఐన ప్రయత్నాలకి మూడేళ్ళయితేనేం, ముఫై ఏళ్ళవుతేనేం? నన్ను ఆత్మహత్య చేసుకోని హాయిగా బతకనివ్వని దానికి ఈ అనవసర ప్రశ్నలుకూడా ఎందుకు?" అని, మీ హాస్పిటల్‌కితెచ్చి పడేశారు, మీ పని మీరిక కానివ్వండి అన్నట్టు నా వేపు చూసింది జయలక్ష్మి. ఎంత పెడసరంగా మాట్లాడినా జాలేకాని



కోపం రాలేదు. మనిషిని చూసినవెంటనే ఇంత అందమైనదానికి ఇంత చిన్న వయస్సులో వైధవ్యం రావడంగొప్పఅన్యాయం అనిపిస్తుంది.

ఇకఏప్రశ్న వేస్తే జవాబువస్తుందా అని ఆలోచిస్తున్నాను. ఈలోగా డాక్టరు మూర్తి కుర్చీలోంచి లేచి తనతోకూడా రమ్మన్నట్టుగా పంజ్ఞ చేసేడు. గదిలో మూలకి తీసుకెళ్ళి "సార్ ఈ పేషెంటునుంచి ఇన్ఫర్మేషన్ ఏమీ దొరికేటట్టులేదు. పేషెంటులో సూసైడల్ టెండెన్సీపా

బాగా వున్నాయి. ట్రీట్‌మెంట్‌కి వెంటనే ప్రొసీడ్ అవ్వడం మంచిదనిపిస్తోంది. లేకపోతే పేషెంటుని బతికించడం కష్టమేమో! మీ ఉద్దేశం ఏమిటో చెప్తే షాక్ ట్రీట్‌మెంటు ఇద్దాం' అన్నమూర్తి మాటలకి నేను సరే అన్నాను. నిమిషాలమీద నర్సులకిచెప్పి రంగప్ప అన్నీ సిద్ధం చేయించాడు. పెద్ద గొడవేమీ లేకుండా షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వడంజరిగింది.

జయలక్ష్మినికనిపెడుతుండమని నర్సులకి, అవసరమైతే ఫోను చెయ్యమని రంగప్పకిచెప్పి నేనూ, మూర్తి బయలుదేరాం. చేత్తో గేటు తలుపులుమూస్తూ, నోటితోనే నమస్కారాలు చెవుతూ "పేషెంటు చాలా తెలివైంది సార్, బి. ఏ. పాసయ్యిందట" అని రంగప్ప మమ్మల్ని సాగనంపాడు.


స్వతంత్రం రాకముందు ఇంగ్లీషు హయాంలో బి. ఏ. మీద ఉన్న మోజు ఉండిపోయిందో, లేకపోతే అంతకన్నా పై చదువు లేదనే ఉద్దేశమో ఏమోకాని రంగప్పకి బి. ఏ. అంటే గొప్ప మోజు. దేవుడు ప్రత్యక్షంఅయి నీకేం కావాలో కోరుకో అంటే హోమియోపతికం పెనీ వాళ్ళ చేతనైనా బి. ఏ. ఇప్పించమంటాడు. ఎమ్. ఎ. పి. హెచ్‌డి. వాళ్ళనికూడా బి. ఏ, పాసయ్యావాఅని అడుగుతాడు. నేను హాస్పిటల్‌లో చేరిన కొత్తలో "మీరు బి. ఏ. పాసయ్యారా" అని అడిగాడు. లేదని చెప్పేసరికి, పేకాటలో ఎప్పుడూ పట్టుపట్టక, మూడాసులు పట్టేసరికి ఒక్క నయాపైస కూడా వేయకుండా అందరూ పట్లొదిలేస్తే పెట్టేమొహం పెటాడు. ఆఖర్ని ఉండబట్టలేక నన్నోసారి అడిగేసేడుకూడా మీ డాక్టర్లెవ్వరూ బి.ఏ.పాసవ్వరాఅని. ముప్పై ఏళ్ళు ఇక్కడ పనిచేసినందుకు వీడికి బి. ఏ. పిచ్చి బాగా పట్టుకుందని నేనేమీ సమాధానం చెప్పడానికికూడా ప్రయత్నించలేదు.

మర్నాడు హాస్పిటల్‌కి రావడంతోనే జయలక్ష్మి ఉన్న వార్డుకి వెళ్ళాను. అక్కడున్న నర్సుని అడిగేను జయలక్ష్మి ఎలా ఉందని. గదిలో మూల కూర్చొని ఏదో ఆలోచించుకుంటున్నాదని చెప్పింది. కేసులు ఎగ్జామిన్ చేస్తున్న డాక్టరు మూర్తిని డిస్టర్బ్ చెయ్యకుండా వార్డ్‌లో కేసులు చూసుకుంటూ జయలక్ష్మి రూముకి బయల్దేరేను.

అందరూ రోజూ చెప్పేమాటలే చెప్తున్నారు, అడిగే ప్రశ్నలే అడుగుతున్నారు. ఏభై ఏళ్ళ ఆడది తను ఇరవై ఏళ్ళయి గర్భంతో ఉన్నానని, తన గర్భంలో ఉన్న పిల్లడికి ఇప్పుడు ఇరవైఏళ్ళని పక్కవాళ్ళతో చెప్తున్నాది. ఆమాటలు వింటూ వాళ్ళని దాటేసరికి ఇంకో ఇద్దరు నావెంటపడ్డారు. ఒకరు తనిచ్చిన

మూడు కోట్లు రూపాయల చెక్కు కిస్తేట్ బ్యాంక్ వాళ్ళు డబ్బు పంపారని, మరొకరు సావిత్రి తన పేరు పెట్టుకొని, తన ఏక్షన్ చేసి ఆర్జించిన డబ్బు కోర్టు వాళ్ళు తన కిప్పుడిప్పిస్తారని అడుగుతున్నారు.

ఈ పద్మవ్యూహం అంతా దాటి జయలక్ష్మి రూముకి చేరుకున్నాను. ఆలోచనలు ఆపి జయలక్ష్మి నిలబడింది మనిషి ఇంకా మామూలుస్థితికొచ్చినట్టు కనిపించలేదు.



నర్సుని పిలిచి "సేమ్ ట్రీట్‌మెంట్" కంటిన్యూ చెయ్యమన్నానని డాక్టరు మూర్తితో చెప్పమన్నాను. ఐదారు రోజులు ట్రీట్‌మెంట్ తరువాత జయలక్ష్మిలో ఆవేశం తగ్గిందనిపించింది.

జయలక్ష్మిని నా దగ్గరకి పంపమని నర్సుకి చెప్పి ఇంటర్వ్యూ రూములో కూర్చున్నాను. నా ఎదురుగా జయలక్ష్మి కూర్చుంది. మొహం ప్రశాంతంగా ఉంది నేను మాట్లాడ్డం ప్రారంభించేను. "చూడండి బ్రతుకు దేముడిచ్చిన వరంలాంటిదంటారు. పుట్టాలని మనం పుట్టలేదు కాబట్టి, చావాలనుకున్నప్పుడు

చావడానికి మన కధికారం లేదేమో! మీకు జీవితంలో వచ్చిన కష్టాల్ని నే నర్థం చేసుకోగలను. కాని మూగి, చెముడు, గుడ్డి అయిన హెలెన్ కెల్లర్‌తో పోల్చిచూస్తే మీవో కష్టాలనుకోను. అలాంటి వాళ్ళు ప్రపంచంలో చాలా మంది ఉన్నారు.


ఇంతకీ మీ ఆత్మ హత్యా ప్రయత్నాలకి కారణం ఒక్క భర్త మరణమేనా ? ఇంకేవైనా కారణా లుంటే నాతో చెప్పుకోడానికి ఏం సందేహించకండి" అన్నాను.

జయలక్ష్మి నోరు విప్పింది. ఏం చెప్తుందో విందామని ముందరికి వంగాను. "అయితే వెర్రివాళ్ళకి కూడా ఆత్మహత్యకి కారణాలుంటాయా ?" అంది. ఇక లాభం లేదనుకున్నాను. ఆ వేశం అంతే తగ్గింది కాని పెడసరం మాటలు చెప్పే స్వభావం ఏం మారలేదు. జయలక్ష్మిని ఏమైనా అడిగితే ప్రశ్నలే కాని జవాబులు రావని పించింది. ఇన్నేళ్ళ నా అనుభవంలో డాక్టర్ల నేడిపించే పేషెంట్లలో జయలక్ష్మి మొదటి దనిపించింది.

ఇంతలో మూర్తివచ్చి "మీసైకాలజీ పాఠాలు ఎంతవరకు వచ్చాయి సార్" అన్నాడు. "మరికొన్ని రోజుల ట్రీట్‌మెంట్ తరువాత కాని పేషెంటుకి మనం చెప్పే మాటలు తల కెక్కవేమో" అని మూర్తిని పైకి తీసికెళ్ళి చెవిలో చెప్పాను. అలాగే సార్ అని మూర్తి వెళ్ళిపోయాడు. జయలక్ష్మిని తన రూముకి పంపించి వద్దామని నర్సుని పిలవబోయాను.

ఇంతలోనే ఎలా తప్పించేను కుందో కాని ఓ పేషెంటు పరుగెత్తుకొని వచ్చి నా కాలర్ పట్టుకొని జోరుగా కేకలేస్తూ, తిడ్తూ కొట్టడం ప్రారంభించింది. బలిష్ఠురాలవడంవల్ల పేషెంటుని ఆపడం నా ఒక్కడితరం కాలేదు. కూర్చున్న జయలక్ష్మి లేచి, తనుకూడా పేషెంట్‌ని పట్టుకొని నౌకర్లని, నర్సుల్ని కేకలు వేసింది. ఈ కేకలకి నౌకర్లు, నర్సులు పరుగెత్తుకొని వచ్చి నేనేం తిడతానోనని భయపడి పోతూ పేషెంటుని తీసుకుపోయారు. నౌకర్ల నిర్లక్ష్యంవల్ల పేషెంట్లచేత అప్పుడప్పుడు దెబ్బలు తినడం మామూలే అయినా ఈసారి తిన్న దెబ్బలకి కళ్ళు తిరిగాయి. సర్దుకునే సరికి ఐదునిమిషాలు పట్టింది. కళ్ళు విప్పేసరికి జయలక్ష్మి నావేపు సానుభూతిగా చూస్తూన్నట్టు కనిపించింది.

"థేంక్స్" చెప్పి జయలక్ష్మిని రూముకి చేర్చడానికి నర్సుని కేక వేయబోయాను. "అక్కర్లేదండి. నేను వెళ్ళగలను, మీ థేంక్సు కాదుగాని మీ రెందుకి డిపార్టుమెంటులో చేరారండి? జీవితం అంతా దెబ్బలుతింటూ, సైకోథెరపీ పేర నీతులు చెప్తూ ఇక్కడ ఇన్ని బాధలు పడేకన్నా ఇంకేహాస్పిటల్ లోన యినా పని చేసుకో కూడదండీ? హాయిగా సుఖపడతారు" అని తన రూముకి బయలేరింది. అంత బాధలోనూ నాకనిపించింది: జయలక్ష్మికి వెర్రికే ట్రీట్‌మెంట్ ఇవ్వవలసిన అవసరం ఏమైనా ఉందా? లేక పలుమార్లు ఆత్మ హత్యా ప్రయత్నం



సైన్సు ప్రకారం మెంటల్ డిసీజ్ కిందికి వస్తుంది కనుకనే ట్రీట్ చేస్తున్నామా అని.

జయలక్ష్మి వెళ్తూ అన్నమాటలు విన్నాక నేను చార్జ్ తీసుకోబోతున్నప్పుడు సూపరింటెండెంట్ చెప్పినమాటలు జ్ఞాపకం వచ్చాయి:

"చూడూ నువ్వుకుర్రాడివి, సర్జరీ కాని మెడిసిన్ కాని ఇంకేలైనులో ఉన్న మంచి భవిష్యత్తు ఉంటుందేమో ? ఈ లైనులో పనిచెయ్యడానికి నువ్వు చాలా బాధలుపడాలి, పడ్డబాధలకి ప్రతిఫలంకూడా ఏమీ ఉండదు.

మామూలు విరేచనాలు, జ్వరాలు తగ్గించే కంపౌండరుకు దక్కే మర్యాదకూడా దక్కదు. ప్రాణం రక్షించాడని ఆ కంపౌండరుని పొగిడేవాళ్ళు ఒకరిద్దరేనా ఉంటారు. కాని ఇందులో బాగుపడ్డ వెర్రివాళ్ళు నీ ఎదుట పడ్డానికి సిగ్గుపడ్తారు, పదిమందితో వెళ్తూ నిన్ను చూస్తే నువ్వెవరో తెలియనట్టు ఉండడానికే ప్రయత్నిస్తారు. నా వెర్రి ఈ డాక్టరు బాగుచేసేడని పదిమందితో చెప్పుకోరు. కొంతమంది ఇంట్లో వెర్రివాడెవడైనా ఉంటే వాడి బాధ వదిలించుకోడానికి మన కప్పజెప్పేసి చేతులు దులుపుకొని పోతారు. ఈ హాస్పిటల్‌లోనే కొందరు పేషెంట్లు ఏ పది, పదిహేనేళ్ళయ్యో ఉన్నారు. వాళ్ళు బతికారా, చచ్చారా అని అడగడానికి కూడా, వాళ్ళ వాళ్ళెవరూ రారు. ఈ జబ్బు కొంతవరకు కన్నతల్లి, కట్టుకున్న పెళ్ళాంకూడా అదరించ

లేనిది. వీక్షణాన తిట్లు. దెబ్బలు తినవలసివస్తుందోననే భయం వల్ల దూరంగానే ఉంటారు,


ఈ నా ముప్పైఏళ్ళ అనుభవంలో చాలామంది పేషెంట్లచేత దెబ్బలు తిన్నాను. నాతో చదువుకున్న వాళ్లు వేరే లైనులో వుండి బోలెడంత పలుకుబడి, డబ్బూ సంపాదించుకున్నారు. కాని నేను విచారించను. ఆత్మస్తుతేఅనుకో, మరేమైనాఅనుకో. నా జీవితంలో నేనేదో చాలామంది చెయ్యలేని మంచిపని చేసేనని గర్వపడుతుంటాను. పదిమందికి తెలిసేటట్లు చేసే దానంలోకన్నా, గుప్తదానంలోనే నాకెక్కువ సంతృప్తి ఉంటుంది. నీదికూడా నాలాంటి మనస్తత్వమే అయితే ఇందులో చేరు. లేకపోతే డబ్బూ, పేరూ రెండూ దక్కే మెడిసిన్‌లోకాని, సర్జరీలోకాని చేరు. బాగా ఆలోచించుకో, ఛార్జెస్ తీసుకోడానికి నీక్కావలసినంత టైమిస్తాను' అని నేనేమైనా చెప్తానేమోనని ఆగారు.

అన్నీ ఆలోచించుకొని తక్కినవన్నీ వదులుకొనే వచ్చాననిఛార్జెస్ తీసుకున్నాను.

మొదట్లో అదేదో కొత్త ప్రపంచంలో ప్రవేశించినట్టయింది. మానవ స్వభావంలో ఎన్ని వింత మనస్తత్వాలు ఉంటాయో, అవి ఎన్ని రకాలుగా మారుతుంటాయో చూడగానే పనిలో శ్రద్ధ కలిగింది. వాళ్ళందరినీ చూస్తే ఏ పాపం ఎరుగని అమాయకుల్ని దేశంలోంచి బహిష్కరిస్తే 'శరణు' అంటూ వచ్చిన వాళ్ళలా కనపడ్డారు. అప్పుడప్పుడూ ఈ పనిమీద, వీళ్ళమీద విసుగుకూడా కలిగేది. కాని సూపరింటెండెంట్ చెప్పినట్టు వీళ్ళని మామూలు మనుషులుగా ప్రపంచంలో తిరిగేటట్టు చెయ్యడానికి ఎన్ని పాట్లుపడ్డా పర్వాలేనంత జాలి కలిగేది. నర్సు పిలవగానే ఆలోచనలు ఆపి పేషెంట్లని చూడ్డానికి లేచాను.

అలా ఆలోచనలతో, పనులతో రోజులు గడుస్తున్నాయి. పదిరోజుల తరువాత మళ్ళీ జయలక్ష్మిని పిలిపించేను. ఏమైనా చెప్దామని నేను మాట్లాడబోయేసరికి నాకన్నా జయలక్ష్మే ముందర ప్రారంభించింది: 'డాక్టరుగారూ సైకో థెరపీ అంటే ఇదే అనుకుంటాను. ఒకటో క్లాసు పిల్లలకి మాష్టర్లు దొంగతనము చేయరాదని – చెప్పినదే పదే, పదే పదిసార్లు చెప్పినట్టు మీరు కూడా పేషెంట్లకి రోజూ చెప్పిన నీతులే చెప్పడం అనుకుంటాను. అయినా మీకెందుకండీ నా గురించి ఇంత తాపత్రయం? ఈ సమయం అంతా ఇహ దేనికోసమైనా ఉపయోగిస్తే బాగుంటుందేమో!' అంది.

'చూడండి ఈతాపత్రయం అంతా



మీరు బతికిబాగుండాలనే. మీరు మంత్రుల ఉపన్యాసాల కింద జమ కట్టుకపోతే రోగి ప్రాణం కాపాడ్డానికి ఏ త్యాగానికైనా సిద్ధమవ్వాలనిపిస్తుంది. మీ రెప్పుడూ జీవితాన్ని ఒక్క వేపు నుంచే కాకుండా అన్ని వేపులనుంచి చూస్తే బ్రతకడానికి చాలా ఆశలు, ఎన్నో అవసరాలు కనిపిస్తాయి' అని నేను పూర్తిచెయ్యకుండానే 'అయితే రోగి ప్రాణం కాపాడ్డానికి ఏ త్యాగానికయినా సిద్ధమవుతానని గొప్పగా చెప్పుకుంటున్నారు కదా? నన్ను మీరు పెళ్ళాడగలరా?' అంది ఛాలెంజ్ చేసినట్టు.

అనుకోని ఈ ప్రశ్నకి వెంటనే జవాబు తోచలేదు. జయలక్ష్మి అన్నట్టుగా గొప్ప కోసమే త్యాగం అని డబ్బా కొట్టుకున్నానేమో ననిపించింది. ఏదో ఒక సమాధానం చెప్పకపోతే పెళ్ళి చేసుకోమని పీకలమీద కూర్చుంటుందేమోనన్న భయం వేసింది. అబద్ధం ఆడకపోతే గత్యంతరం లేదు. పెళ్ళయి పోయిందన్నాను, పిల్లలు కూడా ఇద్దరున్నారన్నాను. నా సమాధానాలు విన్నాక కూపీ తీయడానికి అవకతవక ప్రశ్నలతో అల్లరి పెడ్తుందేమోనని భయపడిపోయిననాకుజయలక్ష్మిలో అటువంటివేమీ కనపడక పోడంతో గండం గడిచినంత సంతోషించాను. వెంటనే అందుకున్నాను.

ఆత్మహత్య ఎంత మహాపాతకమో, బ్రతికి ఎంత సాధించవచ్చో అన్న పాత ఉపన్యాసాలే ఇంకో రెండు మూడు క్రొత్త ఉదాహరణలు చేర్చి చెప్పేను. జయలక్ష్మి బుద్ధిగా వింది అడ్డు ప్రశ్నలు వెయ్యక. నాకొంచెం సంతోషం కలిగింది.

రోజూ జయలక్ష్మిని కలుస్తున్నాను. చాలా హుషారుగా మాట్లాడుతోంది. తనే ఆత్మహత్యకి విరుద్ధంగా ఎక్కువ ఉదాహరణలిస్తోంది. జయలక్ష్మిలో హఠాత్తుగా

కలిగిన ఈ మార్పుకి వార్డులో స్టాఫంతా ఆశ్చర్యపోతూ నా ఎదుటే నన్ను మెచ్చుకుంటున్నారు.

కొన్ని అవాంతర పరిస్థితులవల్ల ఊర్లో లేకపోడంచేత హాస్పిటల్‌కి వెళ్ళడం జరగలేదు. ఊరి నుంచి రాగానే మామూలుగా కేసులు చూసుకోడానికి వార్డుకి వెళ్ళేసరికి జయలక్ష్మి కనపడలేదు. మూర్తి "ఇవాళ సూపరింటెండెంట్ గారు మీ ట్రీట్‌మెంట్‌ని చాలా మెచ్చుకొని జయలక్ష్మిని డిస్చార్జ్ చేశారు. కంగ్రాచులేషన్స్" అని థేంక్సు కోసం నిరీక్షిస్తున్నట్టుగా మొహం పెట్టాడు.

రెండు రోజుల తరువాత నా పేరన కవరు వస్తే విప్పి చూశాను. రాత కొత్తగా ఉండడంవల్ల ఎవరిదో నని కింద చూశాను. సంతకం జయలక్ష్మి అని కనబడగానే, ఆత్రుతగా చదువుకోడం మొదలు పెట్టాను.

"డియర్ డాక్టరుగారూ,

ఈ ఉత్తరం అందేసరికి బహుశా మీకు మళ్లా నీతులు ఉపదేశించడానికి, షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వడానికి అవకాశం ఉండకపోవచ్చు.

మొదట్లో తెలివితక్కువగా ప్రయత్నించడంవల్ల పట్టుబడిపోయి మీ హాస్పిటల్‌లో చేర్చబడ్డాను. మీ హాస్పిటల్‌లో కొన్నాళ్ళుంటే కాని నాకు జ్ఞానోదయం కాలేదు, నా చావుకి కూడా నేను వేషాలు వెయ్యాలని. అయినా మీరేం చేస్తారు. "లా" అలాంటిది. చచ్చేనా

హాయిగా ఉండనీయదు, జీవితం అంతా కుళ్ళి, కుళ్ళి చావమంటుంది. ఆ "లా" ప్రకారమే మీ వృత్తి ధర్మాలు కూడా మారుతుంటాయి. ఇవ్వాళ ఎవ్వరేనా మీ దగ్గరికి ఎబార్షన్ చెయ్యమనివస్తే మానవత్వం అంటారు. ఇంకో ప్రాణిని చంపే హక్కు లేదని పొమ్మంటారు. రేపే "లా" చెయ్యొచ్చంటే "ఫీజు తెండి చేస్తాం" అంటారు. అలాగే ఉన్నవాళ్ళకి జాగా చాలదని "లా" ప్రకారం ఆత్మహత్యలు చేసుకోవచ్చంటే మీ ఈ నీతులన్నీ ఆత్మహత్య వల్ల కలిగే లాభాల వేపు మళ్ళిస్తారు.

ఇదంతా మీ దృష్టిలో వెఱ్ఱి ధోరణే కావచ్చు. కాని ఇప్పుడు మీరేం అనుకున్నా భయంలేదు. మీ హాస్పిటల్‌లోంచి డిస్చార్జ్ చేయబడి నలుగురి దృష్టిలో పడి వాలుగు మాటలు అనిపించుకున్నప్పుడే లేనిభయం ఇంకొద్ది గంటల్లో చావబోతున్న నాకుఇంకేం భయం? చచ్చేముందర నా బాధలు ఎవ్వరితోనైనా చెప్దామనుకున్నాను. కాని వెఱ్ఱి ధోరణి కింద తోసిపారేస్తారని మీతో కూడా చెప్పుకోడానికి భయపడ్డాను. చచ్చిన తరువాత ఎవ్వరికైనా ఆ మాత్రం సానుభూతి వుంటుంది. కాబట్టి మీరు ఓపిగ్గా నేను పడ్డ అవస్థలు, బాధలు చదువుతారనే నమ్మకంతో రాస్తున్నాను.

నేను పుట్టినప్పుడు నోట్లో వెండి చెంచాతో పుట్టలేదుకాని డబ్బున్న కుటుంబంలోనే పుట్టాను. ముగ్గురు మగపిల్లల తర్వాత నేనొక్కర్తెనే ఆడపిల్లనని కథల్లోలా నంగిరి, పింగిరిగా పెంచకపోయినా అందరూ అభిమానంగానే చూసుకొనేవారు. కాలేజీలో మిక్స్ కాలేజిని కాకపోయినా నా వెంట ఎప్పుడూ నలుగురయిదుగురు స్టూడెంట్స్ వెంటపడ్తూ వన్ను ఇంటిదాకా జాగ్రత్తగా దిగబెట్టేవారు. మాది కొంత మంచి పేరున్న కుటుంబమే కావడంచేత నాకుమంచి సంబంధమే వచ్చింది.


పెళ్ళయిన రెండేళ్ళూ నా సంసార యాత్ర బాగానే సాగింది. కాని ఆ యాత్ర రెండేళ్ళలోనే నా భర్త మరణంతో ఆగిపోయింది. నిరాశతో బయల్దేరిన చోటుకే చేరుకున్నట్టుగా నాఇంటికి నేను చేరుకున్నాను. మొదట నా భర్త మంచితనాన్ని, నా దురదృష్టాన్ని తలచుకొని ఏడవడంతోనే సరిపోయింది. నాతోటి వాళ్ళందరు సరదాగా తమ భర్తలతో తిరుగుతుంటే నాకు ఈర్ష్యగా, దుఃఖంగా ఉండేది. రాను, రాను మావదినలు మా అన్నయ్యలతో సరదాగా ఉవ్వా భరించలేనంత స్థితి వచ్చింది.

నా జీవితంలో ప్రయాణించవలసిన దూరం చాలా ఉంది

పోయింది. "వాకిలిదాటి వారణా సెక్కడా" అని రెండేళ్ళ జీవితాన్నే నెమరు వేసుకుంటూ ఇంత దూరం ఒంటరిగా ప్రయాణించలేనేమోనని పించింది.

మగతోడు అవసరం అనిపించింది. రెండో పెళ్ళి చేసుకుంటే కాని మొదటి పెళ్ళికి జరిగిన కష్టాన్ని, నష్టాన్ని భరించలేనేమో ననిపించింది. పిల్లలైనా వుండివుంటే ఈ ఆలోచనలేవీలేక వాళ్ళని చూసుకుంటూ నా బ్రతుకు హాయిగా గడిచిపోయేదేమో! నేను రెండో పెళ్ళికి సిద్ధంగా ఉన్నా నన్నెవరు చేసుకుంటారని భయపడ్డాను. ఇలాంటివాట్లో అమాయకులు తెగించినంతగా త్యాగాలు, ఆదర్శాలు అని పెద్దగా వాగే మీలాంటివాళ్ళు తెగించలేరని, కాలేజీ జీవితంలో నేను చూసిన సంఘటనలు నాకా మాత్రం తెలివి నిచ్చాయి. అందుకే మా యింటికెదురుగా లాడ్జిలో వుండి చదువుకుంటున్న ఒక అమాయకపు బ్రహ్మచారిపై నా వలను విసిరేను.

ఆడది తెరిపారచూస్తే తలవాచేను కొనేంత భయస్థుడు కావడంవల్ల నేను చాలా వేషాలు వెయ్యవలసి వచ్చింది. అతన్ని ఆకర్షించడానికి నేను చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఇంట్లో ఎవ్వరూ లేనప్పుడు గంటల తరబడి మాట్లాడుకొనే వాళ్ళం. అప్పుడప్పుడూ షికార్లకి కూడా పోయేవాళ్ళం. నా జాగ్రత్తలో నేను ఉంటూ పెళ్ళికికూడా ఒప్పించగలిగేను. మొదట అతనితో లేచిపోయి ఎక్కడైనా పెళ్ళి చేసుకుందా మనుకున్నాను, కాని మా అన్నయ్యలకి, వదినలకి అనవసరంగా భయపడి పోతున్నా ననుకున్నాను. నా గురించి వాళ్ళుబాధపడి పోతున్న తీరు, చూపే సానుభూతి, అభిమానం అంతాచూసి నా రెండో పెళ్ళికి అభ్యంతరం చెప్పేంత సంకుచిత స్వభావులు కారనుకున్నాను. అక్కడే నేను పెద్ద పొరపాటు చేశాను. ఆడదానికి సహజంగా వుండే (అందులో రెండో పెళ్ళికి) సిగ్గు కూడా వదులుకొని నా పెళ్ళి విషయం ప్రస్తావించాను. నేనింత బరితెగిస్తానని వారనుకున్నట్లుగా లేదు. ఆశ్చర్యంతోనో, భయంతోనో మొదట ఎవరి నోటంటా మాట రాలేదు. తరువాత నెత్తిమీద ఆటం బాంబు పడిపోతున్నంత అట్టహాసం చేశారు. కుటుంబం పరువు, ప్రతిష్ఠలను మంటగలుపుతున్నా నన్నారు, తండ్రి పేరును నాశనం చేసేస్తున్నా నన్నారు. మంచిదని కొంచెం స్వేచ్ఛ నిస్తే నేనింతపని చేస్తానని వారు కలలో కూడా అనుకోలేదన్నారు. తరువాత నా బతుకు కుక్కబతుకే. ఎదురుగా లాడ్జిలో ఉన్నవాణ్ణి గది ఖాళీ చేయించారు. నామీద పదినలు స్కాట్‌లాండ్‌యార్డు పోలీస్



కన్నా ఎక్కువ నిఘా వేశారు. ఎక్కడికైనా వెళ్తే నన్ను వాళ్ళతో తీసికెళ్ళేవారు. లేకపోతేఇంట్లో పెట్టి మీ హాస్పిటల్‌లో వెర్రివాళ్ళు పారిపోకుండా వార్డులికి వేసేంత పెద్ద తాళం వేసేవారు. మొదట్లో చచ్చిన తండి తాలూకు పేరు ప్రఖ్యాతులకే ఈ పాట్లన్నీ పడుతున్నా రనుకున్నాను.

కాని నిజం తెలుసుకోడానికి ఎక్కువ రోజులు పట్టలేదు: ఇదంతా నా భర్తపోయిన తరువాత నాతో వచ్చిన ఆస్తిమీద మోజే కాని తండి తాలూకు పరువు, ప్రతిష్ఠలమీద, పేరు ప్రఖ్యాతుల మీదా కాదని. నా ఆస్తిని అంటిపెట్టుకోడానికి ఎవ్వరూ విరగ్గొట్టలేని అడ్డుగోడలే వేశారు. లోకంలో ప్రతి వాడికీ అమాత్రం స్వార్థం వుంటుంది. కాని ఒకప్పుడు ఎంతో అభిమానంగా చూసుకున్న స్వంత చెల్లెలిపట్లకూడా ఇంతస్వార్థంచూపే వాళ్ళు ఉంటారనుకోను. నాశనమైపోయినా నా జీవితంమీద ఒక నయాపైసాయైనా సానుభూతి లేనివాళ్ళని – అన్నయ్యలైనా అంటి పెట్టుకొని వుండటంలో అర్థం లేదనిపించింది. నన్నా మాత్రం ఆదరించి సానుభూతితో అండగా నిలిచే మగాడెవడైనా, కనీసం గిరీశం లాంటివాడైనా దొరికితే ఈ ముళ్ళ కంచెల్లోంచి దాటిపోదా మనిపించింది.

కాని నామీదవున్న నిఘాతో అది అసాధ్య మనిపించింది. ఓనాడు

మా ఆయనకి వరసకితమ్ముడు, నాకు మఱది అయ్యేచుట్టం మా యింట్లో దిగితే నా కష్టాల్లో ఆదుకోడానికి దేవుడే పంపించినంత సంతోషం కలిగింది. దిగగానే నన్ను పలకరించేడు ఎలాగున్నావని. మా ఆయన బతికున్న రోజుల్లో అతను రోజూ మా యింటికొచ్చేవాడు, మా ఆయన ఇంట్లో లేకపోతే నాతోకే గంటల తరబడి మాట్లాడుతూ కూర్చునేవాడు. ఇప్పటికీ ఇంకా పెళ్ళి చేసుకోలేదని మాటల సందర్భంలో తెలుసుకున్నాను. వీలుచిక్కితే నా బాధంతా చెప్పుకొని ఈ బందిఖానా నుంచి ముక్తి పొందుదామనుకున్నాను. కాని వచ్చినచుట్టం రెండు రోజులైనా ఉండకపోడం చేత తగిన అవకాశం దొరకలేదు. అతికష్టంమీద అతని ఎడ్రస్ సంపాదించుకోగలిగేను. ఎడారిలో ఒయాసిస్‌లాగా ఇతను నా దృష్టిలో పడ్డాడు. దొరికిన ఒకకొమ్మ అసరాని ఒదులుకోకూడదనుకున్నాను. నా కష్టాలు, గోడూ అంతా విన్నాక అ మాత్రం ఆదరించడా అనిపించింది.

అందుకే రాత్రికిరాత్రి ఇంట్లోంచి పారిపోయాను. అతనిల్లు కనుక్కోడం అంతకష్టం కాలేదు. అతన్ని సులభంగానే కలుసుకున్నాను. పూర్వంవున్న పరిచయంవల్ల నాకు జీవితంలో జరిగిన అన్యాయాలన్నీ చెప్పుకున్నాను. ప్రేమించేవని అబద్ధం ఆడాను. పెళ్ళాడమని కోరేను. అతను వేటికీ సమాధానంచెప్పలేదు. సానుభూతి చూపించినట్టే కనపడ్డాడు. నా కష్టాలు తీరాయనే భావించాను. 'ఇప్పుడేవస్తాను, ఇల్లు జాగ్రత్తగా చూసుకో' అనగానే చెప్పలేనంత ఆనందం కలిగింది. ఏ గంటకో, రెండు గంటలకో వస్తాడనుకున్నవాడు రెండురోజుల తరువాత మా అన్నయ్యలతో నా ఎదురుగా ప్రత్యక్షమయ్యేసరికి నాకు మతిపోయినంత పనయింది. (తరువాత మీ శాస్త్ర ప్రకారం పోయింది కూడా! సరదాగా మాట్లాడి, మంచిగా కనపడే ఇతనేనా ఇంత కర్కోటకుడనిపించింది. ఇతనికన్నా అన్నయ్యలు, వదినలే నయం అనుకున్నాను. అన్నయ్యలు అతని దగ్గర ఏమీ అనలేదు, అతనికి థాంక్సుచెప్పి నన్ను యింటికి తీసుకు వెళ్ళారు.

ఇంటికి వెళ్ళిన తరువాత కలలోకూడా ఊహించని సంఘటనలు జరిగాయి. చెయ్యివేస్తే కందిపోతానని ఒకప్పుడు అపురూపంగా చూసుకునే అన్నయ్యలు చితకతన్నేరు. వదినలు చెయ్యి చేసుకోలేదుకాని అంతకన్నా బాధించే తిట్లు తిట్టారు. ఈ దెబ్బలు, తిట్లూ కన్నా వీళ్ళ చదువులు, సంస్కారాలు డబ్బుదగ్గర ఎందుకూ పనికిరాకుండా పోయేయన్న బాధతోనే



ఎక్కువ విచారించానేమో? ఇప్పుడు చెప్పండి నన్నేం చూసి బతకమంటారో?

పెళ్ళాడిన భర్త ఏనాడో పోయాడు. నన్ను మళ్ళా పెళ్ళాడుతానని ముందుకు వచ్చిన అమాయక యువకుణ్ణి గెంటేశారు. నన్నెదో ఆదరిస్తాడని అన్నింటికీ తెగించి పారిపోయి ఆశ్రయం కోరితే అన్నయ్యలకి అప్పజెప్పాడు ఆ మహానుభావుడు.

నాకోసం ప్రాణం ఇవ్వటానికూడా సిద్ధం అనుకొన్న అన్నయ్యలు నన్ను చితకతన్నారు. తోటి ఆడదాన్నర్థం చేసుకోగలరనుకున్న వదినలు తిట్టితిట్టి, దెబ్బలే నయమనిపించారు. రోడ్డుమీద ఆడది వెళ్తే నోరూ, కళ్ళూ వెళ్ళబెట్టుకొని చూసే ఇంతమంది మగాళ్ళు ఒక్క ఆడదానికి ఆశ్రయం ఇవ్వలేని పిరికిపందలని తెలుసుకొనేసరికి చాలా ఆలస్యం అయింది. ఆ పిరికిపందల్లో మిమ్మల్ని పూర్తిగా జమకట్టొచ్చు.

మానవత్వం అన్నారు, త్యాగాలన్నారు, చేతనైతే ప్రాణాలకు కూడా తెగించినట్టుగా మాట్లాడారు. తీరా నన్ను పెళ్లాడమనేసరికి మీ బండారం బయటపడింది. అబద్ధాలు చెప్పడంకూడా చేతకాదనిపించుకున్నారు. నోటికొచ్చిన అబద్ధాలాడ్డానిక్కూడా చాలా సమయం తీసుకొన్నారు. ఎంతసమయం తీసుకొన్నా మోహంలో భయం, మాటల్లో వణుకు దాచుకోలేక

పోయేరు. నిజం అని నమ్మినట్టుగా నేనె మీకన్నా బాగా నటించేనేమో? (నటించడానికి అంత కష్టపడవలసిన అవసరం లేకపోయింది. ఏమంటే అంతకుముందర, తరువాత కూడా అంతకన్నా పెద్దనటన లే చేశాను.)

మీరు నాతో పడ్డపాట్లు చూశాక, మిమ్మల్ని మరీ బాధ పెట్టడం ఇష్టంలేకపోయింది. చేతల కన్నా మాటలుచెప్పేవాళ్ళే ఎక్కువన్న సత్యం అందరికీ తెలిసిందే. అయినా అది మీతో బాగా రుజువయింది. మళ్లా ఆత్మహత్యే శరణ్యం అనిపించింది. కాని ఈసారికూడా తెలివితక్కువగా ప్రయత్నిస్తే జీవితాంతం మీ హాస్పిటల్‌లోనే ఉండి పోవాలేమో అన్న భయం కల్గింది. అందుకే ఆరోజునుంచి సంతోషంగా ఉన్నట్టుగా నటించేను. ఆత్మహత్యకి విరుద్ధంగా నేనే ఎక్కువ ఉపన్యాసాలిచ్చేదాన్ని: లేకపోతే మీ హాస్పిటల్ వాళ్ళు, మా ఇంటివాళ్ళు నన్ను హాయిగా చావనివ్వరని. నా ప్రయత్నాలుఫలించాయి. మీసూపరింటెండెంట్ గారు మీ రిచ్చిన చికిత్సకి, చెప్పిన నీతులకి తెగ మెచ్చుకుంటూ నన్ను డిస్చార్జ్ చేశారు.

ట్రీట్‌మెంట్ ఎలా ఉన్నా మీ హాస్పటల్‌లో జాయిన్‌చేసి నాకో మహోపకారం చేశారు. డిస్చార్జ్ అయిన తరువాత బాగయిపోయానని నామీద కాపలా తగ్గింది. ఈ సారి నా ఆత్మహత్యా ప్రయత్నం దిగ్విజయంగా కొనసాగుతుంది. మీరు నన్ను బాగుచేశాననుకొని పదిమందితో గర్వంగా చెప్పుకొనే లోపలే నా చావువార్త మీకందొచ్చు.

ఇది మీ కాశ్చర్యంగా ఉంది కదూ! ఫీజు ఇవ్వడంలో మోసపుచ్చే పేషెంట్లని చాలామందిని చూసి ఉంటారు. కాని, రోగాల్లో కూడా మోసంచేసే పేషెంట్లని చూడ్డం మీకిదే మొదటిసారేమో? ఆత్మహత్య మహాపాతకం అంటారు కదూ, కాని ఈ వెధవ బతుకుకన్నా ఆ మహాపాతకమే ఎన్నోరెట్లు నయమనిపిస్తోంది.

నాదిమీ రెన్నటికీ మరువలేని కేసు.

మోసపోయానని మరీ అంత విచారించరన్న ఆశతో,

జయలక్ష్మి."

ఉత్తరం పూర్తిచేసిన తరువాత అనుకోని పరిస్థితుల్లో ఓ పెద్ద పొరపాటు జరిగిపోయినందుకు చాలా బాధకలిగింది. ఆ బాధతోనే జయలక్ష్మిని డిస్చార్జ్ చేశారని విన్నాక డైరీలో రాసుకున్నది మళ్లా చదువుకున్నాను.

"జయలక్ష్మి తన్ను తనే మోసం చేసుకుంది. డిస్చార్జ్ చెయ్యడంలో సూపరింటెండెంట్ గారు తొందర పడ్డారేమో? జయలక్ష్మి ఆత్మహత్యా ప్రయత్నంలో కేవలం గడువు పొడిగించడమే సాధ్యం కాని, విరమింప చెయ్యడం అన్నది అసాధ్యమేమో?"

చదవడం పూర్తిచేసి తలఎత్తేసరికి ఏదో చెప్దామని రంగప్ప చాలా సేపై నిల్చున్నట్టు వుంది. చెప్పమన్నట్టు చూశాను. "దొరగారు మిమ్మల్ని అర్జంటుగా రమ్మంటున్నారు సార్, కారు కూడా పంపించేరు, కొత్త కేసేదో వచ్చినట్టువుంది. అన్నట్టు మీకీసంగతి తెలుసా, సార్? డిస్చార్జ్ చేసిన ఆ బి. ఏ. అమ్మాయి ఆత్మహత్య చేసుకొని చనిపోయిందిట, వాళ్ళన్నయ్య దొరగారితో చెప్తుంటే విన్నాను" అని రంగప్ప వెళ్తుంటే, ఇదికూడా కొంపతీసి ఆత్మహత్యలో ఫెయిలయిన కేసు కాదుకదా అని అనుకుంటూ రంగప్ప వెనకాతే బయల్దేరాను మళ్ళీ డ్రస్ అయినా మార్చుకోకుండా!

□□□

స్నేహ ధర్మం

మొదటి బహుమతి

(రూ. 50)

బందరు బస్‌స్టాండు ప్రయాణీకులతో క్రిక్కిరిసి వుంది. నేను రిక్షాదిగి, త్వరగా బుకింగ్ ఆఫీసు దగ్గరకు నడిచాను. 'కవుతరం ఒక టిక్కెట్ యివ్వండి' అని టిక్కెట్టు తీసుకొని, మావూరు వెళ్ళే బస్సులో ఎక్కి కూర్చున్నాను.

బస్సులో, నా వెనక సీటులో ఎవరో దెబ్బలాడుకుంటున్నారు. ఆ అనాగరిక జాతిని చూచి, అసహ్యించుకొని, ముఖాన్ని ప్రక్కకు త్రిప్పుకున్నాను. 'ఫట్' మని చెంపదెబ్బ వినిపించింది. వెనక్కు తిరిగి చూచాను. ఎవరో ప్రయాణీకుడు త్రాగివుండి, మైకంలో ప్రక్కవానిపై నోరుజారి చెంపదెబ్బ తిన్నాడు. అతను చొక్కాతో కంటినీరు తుడుచుకుంటున్నాడు ఆ ముఖం ఎక్కడో పరిచయమున్నట్లనిపించింది. అతని ముఖంలోకి పరిశీలనగా చూచాను. నా మనస్సులో ఏవో పాతస్మృతులు మెదిలాయి.

♦ ♦ ♦

ఆ రోజునే నేను ఒకటవఫారంలో చేరాను. క్రొత్త నిక్కరు, తెల్ల చొక్కా వేసుకొని, బడిలో అడుగు పెట్టాను. నాన్నగారు బడివద్ద నన్ను వదలి, 'బడి వదిలే సమయానికి వస్తాను. భయపడక' అనిచెప్పి వెళ్ళిపోయారు. అందరూ క్రొత్తముఖాలే. భయము, సిగ్గుతో తలదించుకొని కూర్చున్నాను. ఎవరో వెనుకనుంచి వచ్చి, నా భుజంమీద చేయివేశారు. భయంగా వెనక్కు తిరిగి చూచాను. నా అంత కుర్రాడే; వెనక నుంచున్నాడు. నాకు తెలియకుండానే నా కన్నులు అతనిని ఏమిటని ప్రశ్నించాయి.

'ఒకటవ ఫారమా నువ్వు?'

అవునని సమాధానం చెప్పాను.

'నేనూ నీ క్లాసే. నా పేరు శ్రీరామమూర్తి. మరి నీ పేరు?'

'రవి.'

'నాకు స్నేహితు లెవ్వరూ లేరు. నువ్వు నా జట్టుంటావా?'

నాకు సంతోషంగా అంగీకారమైంది. అలా జరిగిన పరిచయం మా స్నేహానికి దారితీసింది. ఆనాటినుంచి మే మిద్దరం ప్రాణ స్నేహితులం. అతను పచ్చనిఛాయ. అందరితోనూ కలిసి, మెలిసి తిరుగుతూ వుండేవాడు. ఎంత అందంగావుండేవాడో, అంత బలిష్టంగా వుండేవాడు. నేను సన్నగా వుండేవాడిని.

ఒకరోజున క్లాసులో ఇంగ్లీషు పాఠం జరుగుతోంది. నేనూ, శ్రీరామమూర్తి వెనక బెంచీలో కూర్చునివున్నాం. అతనిని చూస్తూవుంటే ముద్దేసింది. నా ప్రేమనెలా వ్యక్తపరచాలో తెలియక అతని తెల్లని చొక్కామీద సిరామరక చేశాను. అతనూ నా చొక్కామీద సిరా విదిలించాడు. మా మనస్సులలో ఏ ఖావాలున్నాయో, ఆ పసివయస్సులో మాకు తెలియదు. కొద్ది క్షణాలకు యిద్దరి చొక్కాలూ సిరామయమయ్యాయి. మాష్టారిదంతా గమనించి, యిద్దరినీ దగ్గరకు పిలచి వీపుమీద రెండు దెబ్బలేసి, క్లాసునుంచి బయటకు పొమ్మన్నారు.

మా యిద్దరి కళ్ళలోనూ నీళ్ళు గిర్రునతిరిగాయ్. ఆ అవస్థకు కారణం నేనే. కాని, నేనలా ఒప్పుకొనేటంతలోనే అతను 'బయటికి నడు, నిన్నేం చేస్తానో' అన్నాడు. నాకూ రోషం వచ్చింది. 'ఏం చేస్తావ్! తంతాను' అన్నాను.

బయటకు రాగానే అతను నా చొక్కా కాలరు పట్టుకొని, 'ఏంరా! క్లాసులో యిష్టం వచ్చినట్లు వాగుతున్నావ్!' అని అన్నాడు.

అతని బలిష్ఠ శరీరంముందు నేనెంత? బిక్కమొఖం వేశాను. కంటివెంట నీరు తిరిగింది. ఒక్కమారుగా అతను నా చొక్కా వదలివేశాడు. 'ఏడుస్తున్నావేరా!' అని ఆప్యాయంగా అడిగాడు.

'నువ్వు కొడ్తానన్నావుగా!' అని భయం భయంగా అన్నాను.

'ఛ, లేదురా! నిన్ను నేను కొడతానా!... మాష్టారు పిచ్చోడు. మనం పోట్లాడుకున్నా మనుకొని, మనలను తిట్టాడు... ఛ! ఇంకా ఏడుస్తా వెందుకురా! నువ్వు ఏడిస్తే నాకూ ఏడ్పు వస్తుంది. మనమిద్దరం ప్రాణ స్నేహితులంరా. మనలను ఎవ్వరూ విడదీయలేరు. ఊరుకో... నడు. మా యింటికి పోయి, కేరమ్స్ ఆడుకుందాం' అని నన్నెంతగానో ఓదార్చాడు.

కాలచక్రం తిరుగుతూ వుంది. కాని, మా స్నేహవలయానికి అడ్డు వచ్చింది. మూడవఫారం చదువుతూ వుండగా, అతని తండ్రి చనిపోయి, అతనిచదువుకు శాశ్వతంగా ఆటంకం కలిగించాడు.

♦ ♦ ♦

స్టేట్ బస్ చీకటిని చీల్చుకుంటూ

టి. ఎస్. హరగోపాల్

బి. ఇ. మూడవ సంవత్సరం.

గవర్నమెంట్ ఇంజనీరింగ్ కాలేజి,

కాకినాడ.

ముందుకు సాగుతోంది. నే నిప్పు డతనిని స్నేహితునిగా చెప్పుకోలేని స్థితిలో వున్నాను. నే నిప్పుడు ఒక విద్యావంతుడిని; బాధ్యతగల ఒక ఇంజనీరుని. అతను మత్తుగా త్రాగి వున్నాడు. నా స్నేహితుడు త్రాగుబోతు అవుతాడని నే నెన్నడూ వూహించలేదు. అతను త్రాగుబోతుగా మారటానికి కారణంకూడ నా మనస్సు కందలేదు. నా స్నేహితుడిని పలకరించలేని స్థితిలో సంఘం నన్ను విద్యావంతుడని, గౌరవనీయుడనే పదాలతో బంధించి వేసింది. నా స్నేహితుని పలకరిస్తే, ఆ త్రాగుబోతు స్నేహితుడు అని నన్ను గేలి చేస్తారేమోనన్న భయంతో నిస్సహాయంగాకూర్చుండిపోయాను.

కండక్టరు ఒక్కమారుగా 'డ్రైవర్! బస్సు ఆపు' అన్నాడు. బస్సు ఒక్కమారుగా ఆగిపోయింది. కండక్టరు 'ఎవరో ఒకరు టిక్కెట్ తీసుకోకుండా ప్రయాణం చేస్తున్నారు. ఎవరో టిక్కెట్ తీసుకోండి' అని అరిచాడు.

ప్రయాణీకు లంతా ఏకకంఠంతో 'ఆ త్రాగుబోతుగాడ్ని ముందు కనుక్కోండి' అన్నారు. కండక్టర్ అతని వద్దకువచ్చి 'ఏ య్! టిక్కెట్టు చూపించు' అన్నాడు.

'లేదు' అని మైకంలో ముద్దగా సమాధానం చెప్పా డతను.

'డబ్బులివ్వు. టిక్కెట్ యిస్తాను' అన్నాడు కండక్టరు.

'లేవ'న్నట్లుగా చేయి వూపా డతను.

మరుక్షణమే నల్గురూ కలిసి, అతనిని చేయి పుచ్చుకొని, డోరు వద్దకు నడిపి, 'డిగెయ్' అన్నారు. అప్రయత్నంగా అతని చూపులు నా చూపులతో కలిశాయి. అతనొక్కమారుగా ఏదో గుర్తుకు వచ్చినట్లు నావైపు చేయిజాపి, 'నువ్వు... మీరు...?' ఏదో అనబోయాడు. అతని కన్నులలో విషాదభరితమైన నీలినీడ లలముకున్నాయ్. నేను భారంగా తలను ప్రక్కకు త్రిప్పుకున్నాను.

బస్సు ముందుకు సాగింది.

దూరంగా ఆకాశంలో నీలినీడలు వర్షాన్ని కురిపిస్తున్నాయి.

□□□

నాలుగు దయ్యాలు

రెండవ బహుమతి

(రూ. 25/ -)

"సరూ ... సరోజా ... లేవవే తల్లీ!'

'అబ్బా! ఏమిటే నీ గోల? అప్పుడే కాఫీ బెల్ అయిందా?' కళ్ళు తెరవకుండానే బద్ధకంగా పక్కకు ఒత్తిగిల్లి మరింతగా ముడుచుకుని పడుకుంటూ అడిగాను.

'నీ మొహం బెల్లు కొట్టారు! ముందు లేస్తావా లేదా? నాకు భయంవేస్తూందే సరూ ... లేచి రావే...' కొద్దిగా వణుకుతున్న గొంతుతో అంటూ, దుప్పటి లాగి పారేసింది కమల.

నిద్రమత్తు ఎగిరిపోగా వులిక్కిపడి లేచి కూర్చున్నాను. 'భయమా? ఎందుకూ?'

మాట్లాడకుండా కిటికీ దగ్గరకు నడిచి నన్ను రమ్మని సైగ చేసింది. అయోమయంగా లేచి వెళ్ళాను. అది చూస్తున్న వైపు వేనూ చూడసాగాను. పలుచని మబ్బుతెరలా కమ్ముకున్న పొగమంచు, క్రింద కూడా మరో ఆకాశం వెలిసిందా అనిపింపజేస్తూంది. దూరాన వున్న కొండలు పొగమంచు తెరల గుండా గమ్మత్తుగా కనబడుతున్నాయి. ఆరు గంటలయినా ఇంకా లేద్దామా వద్దా అని తటపటాయిస్తున్నట్టు మబ్బుల దోమతెరలను తొలగించుకుని తొంగి చూస్తున్నాడు సూర్యుడు. 'ఏముందక్కడ?' కొంగుతీసి చెవుల మీదుగా కప్పుకుంటూ వింతగా అడిగాను. రెప్ప వాల్చకుండా బయటకు చూస్తూ నిలబడిన కమల దూరాన కొద్దిగా ఎత్తుగా గుట్టలా వున్న ప్రదేశంవైపు వేలుపెట్టి చూపించింది. 'అటుచూడు! ఎవరో నలుగురు నిలబడినట్టు లేదూ?'

పరీక్షగా చూశాను. నిజమే! నాలుగు తెల్లని ఆకారాలు స్పష్టంగా కనపడ్డాయి. కొద్దిగా వూగుతున్నట్టు కూడా అనిపించింది. 'ఎవరో పని మీద వెళ్లారేమో ...' సందేహంగా అన్నాను.

ఉరిమిచూసింది కమల. 'మనుషులయితే కదలకుండా అక్కడే బొమ్మల్లా ఎందుకు నిలబడతారు? నిన్న అరుణ చెప్పలేదూ, ఇక్కడ దయ్యాలున్నాయని? అవేనేమో...'

భయంగా మళ్ళీ వాటివైపు చూస్తూ అంది.

'నాన్ సెన్స్! దయ్యాలనేవి లేవసలు! అదేమిటో మళ్ళా చూద్దాంగానీ ముందు మొహం కడుక్కుందాం పద!' అంటూ దాన్ని బయటకు లాక్కుపోయాను. అప్పుడే ఒకరిద్దరు పిల్లలు లేచి డిసెంబరు పువ్వులు కోస్తున్నారు. ప్రేయర్ హాల్లోనుండి 'కౌసల్యా సుప్రజారామ' అంటూ సుప్రభాతం వినబడుతూంది. అంతలో ముత్తుస్వామి బెల్లు కొట్టడంతో డైనింగ్ హాలు కేసి దారితీశాము. కాఫీ త్రాగి రూముకు రాగానే కిటికీ దగ్గరకు పరిగెట్టింది కమల. 'అరె! చూడు సరూ! ఇప్పుడు లేవు అవి!' భయంతోబాటు ఆశ్చర్యం కూడా మిళితమైన స్వరంతో అరచినంత పని చేసింది కమల.

'నిజంగా?' అంటూ ఒక్క వుదుటున కిటికీ దగ్గరకు వెళ్ళి చూశాను. బాగా తెల్లవారిపోయిందేమో, 'భీమాస్' కాంటీన్ వెనకగా వున్న ఆ గుట్టవంటి చోటు ఇప్పుడు స్పష్టంగా కనబడుతూంది.

కుమారి
కె. మీరాబాయి
ప్రీవియస్ యం. ఎ.
(ఇంగ్లీషు)
వెంకటేశ్వర యూనివర్శిటీ
తిరుపతి.

కానీ... ఆ నాలుగు ఆకారాలు మాయమయ్యాయి! ఆశ్చర్యంగా మొహాలు చూసుకున్నాం. 'నే చెప్తే విన్నారా? డెఫినిట్‌గా దయ్యాలే అవి...' బెదురుగా చూస్తూ అంది కమల. నాకూ అనుమానంగానే వున్నా ఆమాట అన్నానంటే కాలేజి వదిలిపెట్టి ఇంటికి పరిగెడుతుంది పిరికిపిల్ల! అందుకే 'నిద్రకళ్ళతో చూసి వూరికే భ్రమపడి వుంటాము లేవే! దయ్యాలూ, భూతాలూ అనబోకు, నవ్వేరు నలుగురూ!' అంటూ చివాట్లేశాను. అప్పటికి మరేమీ మాట్లాడకుండా వూరుకున్నా ఆ సంగతి మాత్రం మరచిపోలేదా అమ్మాయి.

'పొద్దున్న వాటిని చూస్తుంటే 'మాక్‌బెత్'లో త్రీ విచెస్ గుర్తొచ్చాయి! ఎంత భయమేసిందో తెలుసా?' సాయంత్రం అటెండెన్స్ టైములో మెల్లిగా అంది—

'ఇంకా నయం! హామ్లెట్‌లో 'ఘోస్ట్' గుర్తుకురాలేదు. వుత్త పిరికిగొడ్డు' అంటూ చిన్నగా నెత్తిమీద మొట్టాను.

రాత్రి పదిగంటలకే నిద్ర వస్తూందంటూ పడుకొంది కమల. కళ్ళు మూతలు పడుతున్నా పదకొండు దాకా ఏమయినా సరే మేలుకోవాలన్న పట్టుదలతో చదువుతూ కూర్చున్నా! 'వెదర్ ఇయాగో ఈజ్ ఎ డెమి-డెవిల్' అన్న దానిమీద ఎస్సే చదువుతుంటే అనుకోకుండానే కిటికీవైపు దృష్టిపోయింది.

కొద్దిగా భయంవేసి లేచి వెళ్ళి కిటికీ మూసేశాను. వాటిమూస్తే పదకొండయింది. వాచ్‌మాన్ గంట గణగణలాడించాడు. 'లైట్లార్పేయండోహాయ్!' అంటూ. లైట్లార్పి పడుకున్న పదినిమిషాలకల్లా కమల వచ్చి నా దోమతెరలో దూరింది. 'భయమేస్తోందే సరూ!' అంటూ. ఎప్పుడు నిద్రపోయానో... పొద్దున్న కమల తట్టి లేపితే కళ్ళుతెరిచాను. 'సరూ. అవి మళ్ళావచ్చాయే...' రహస్యంగా చెప్పింది కమల. ఒక్క గంతులో కిటికీ దగ్గరకు వెళ్ళి చూద్దునుగదా! అదే ప్రదేశంలో మసక వెలుగులో పొగమంచు మధ్య తెల్లగా బొమ్మల్లా నాలుగు ఆకారాలు ప్రత్యక్షమయ్యాయి. చెప్పొద్దూ? బీరాలు పలికే నాకు గుండెల్లో వణుకు పుట్టింది.

'కదులుతున్నట్టున్నాయి చూడవే... ఇక రెండ్రోజులుపోతే మన రూము దగ్గరకే వస్తాయేమో... ఎలా?' దగ్గరగా జరిగి నాచెయ్యి గట్టిగా పట్టుకుని వణుకుతున్న గొంతుతో అంది కమల. ఆ పిల్లచెయ్యి వణుకుతూంది. చూస్తూ వుండగానే కాసేపటికి వున్నట్టుండి అదృశ్యమయ్యాయి నాలుగు దయ్యాలూ!

'నే చెప్తే కాదన్నావు! చూశావుగా... అటువైపు వింగ్‌లోకి మారిపోదామే సరూ... చస్తే ఈరూములో మాత్రం వుండను...' ఏడుపు మాత్రమే తరవాయిగా వుంది కమల పరిస్థితి. నాకూ ఏం మాట్లాడాలో తోచలేదు!

ఆ సాయంత్రం కమలకు హైఫీవర్ వచ్చేసింది. రాత్రంతా 'దయ్యాలేనే సరూ ... నే నిక్కడ వుండనండీ...' అంటూ ఒకటే పలవరింతలు. తెల్లవారేసరికి సంగతి తెలిసి డెప్యూటీ వార్డెన్ వచ్చారు మా రూముకు.

'మేడమ్... నేనీ రూములో వుండనండీ ...!' ఆవిడను చూడగానే నీరసంగా అంది కమల. నే నిక దాచుకోలేక సంగతంతా విప్పి చెప్పా నావిడకు.

ఆవిడ పగలబడి నవ్వడం మొదలుపెట్టారు! అసలే చక్కని మనిషేమో, నవ్వుతుంటే మరింత అందంగా వుంటారామె. నవ్వుతుంటే బుగ్గలమీద తొంగిచూస్తున్న గులాబి రంగను చూస్తూ ఎందుకు నవ్వుతున్నదో అర్థంకాక తెల్లమొహం వేసుకుని నిలబడ్డాను.

ఇంతకీ ఆవిడ చెప్పిన విషయం ఇది: మేము దయ్యాలనుకొన్నవి ఎన్.సి.సి. వాళ్ళు గురికోసం పెట్టుకునే టార్గెట్స్‌ట. వాళ్ళు షూట్ చేసే శబ్దం మాకు వినబడదు గనుక అవి వున్నట్టుండి మాయమయినట్టు కనబడ్డాయన్నమాట! అంతేకథ!

□□□

సినిమా

పాత సంవత్సరం విశేషాలు

తెలుగు సినిమారంగంలో 1967లో జరిగినన్ని మంచి సంఘటనలు మరే సంవత్సరంలోనూ జరిగి వుండలేదు. మంచి ప్రయత్నాలు, సాహసాలు, మున్ముందు జాతికి పనికి వచ్చే ప్రాతిపదిక చర్యలు 1967 లో చాలా జరిగాయి.

ఇతర భాషా రంగాలలో సాంఘికాలే యింకా ప్రాధాన్యం వహిస్తూ వున్నా, హిందీరంగంలో కలర్‌కే ప్రాధాన్యం వుంటూ వున్నా, హిందీ, తదితర భాషలలో కొత్త టెక్నిషియనులు, తారలు వాటి వాటి స్తోమతకు తగినంతమంది రాక పోయినా, తెలుగురంగం చిన్నదైనా, సాంఘిక, పౌరాణిక, జానపద చిత్రాలు నిర్మించింది; కలర్‌లోనూ మంచి అడుగు వేసింది; కొత్తవారి పరిచయంలో అన్ని రంగాలను మించింది. హిందీలో ఒక్క తారా చంద్ బర్జాత్యా మటుకే అంతా కొత్త తారలతో ఒక చిత్రం తీశారు. వారికి వున్న ఆర్థిక స్తోమతే మన తెలుగు వారికి వుంటే ఇంకా గొప్ప పనులు చేసి వుండేవారు.

విదేశ యాత్రలలో తెలుగు తన స్తోమతబట్టి ముందుకు వెళ్ళింది. అలానే స్టుడియో నిర్మాణం, హిందీ మార్కెట్‌ల ఆక్రమణ మొదలైన విషయాలలో కూడా 1967 ఆంధ్రకు శుభమే పలికింది.

ఆసక్తి జనకమైన ఈ అంశాలను దిగువ రేఖామాత్రంగా పరికించుదాము :

ప్రయోగాలు

అబలలు సబలలని చిత్ర నిర్మాణంలో చూపించడం నిజంగా ఒక



"సుఖ దుఃఖాలు" లో హరనాథ్ - వాణిశ్రీ

ప్రయోగం వంటిది. చాలామంది టెక్నిషియనులను పరిచయం చేస్తూన్న శ్రీ మాతా ఫిలిమ్స 'చిన్నారి మనసులు' కృషి లోకవిదితం. అప్పుడే సగానికి పైగా చిత్రం తయారైంది. 1967 సావిత్రికి, వి. సరోజినీ మధుసూదనరావుకు ఇతర అ(స)బలలకు యిచ్చిన చేయూత 1968 లో సఫలం కాగలదని ఆశించుదాము.

అంతా కొత్త తారల పరిచయంతో "హీ మాన్" అని నిరూపించుకొన్న శ్రీ ఆదుర్తి సుబ్బారావు, శ్రీ అక్కినేని నాగేశ్వరరావుతో కలిసి చక్రవర్తి చిత్ర పరంగా నిర్మిస్తున్న ప్రయోగాత్మక చిత్రం 'సుడిగుండాలు' 1967 లోనే పూర్తి అయింది. 1968 చల్లనిచూపు చూడగలదని, ఆ సంస్థ వరుసగా ఉత్తమ ప్రయోజనాత్మక కళాచిత్రాలు తీయగలదని ఆశించుదాము.

'సాక్షి' సంపూర్ణమైన ఔట్‌డోర్ చిత్రం. కొత్త దర్శకుడు బాపూను, కొత్త హాస్య నటుడు



"అసాధ్యుడు" లో కృష్ణ, కె. ఆర్. విజయ

రంగారావును పరిచయం చేసింది. గ్రామ వాతావరణంలోకి హాత్య ఇరికించబడిందే అన్న స్వల్పమైన లోటు తప్పిస్తే ఈ ప్రథమ ప్రయత్నం ఎంతో మెచ్చదగింది. ముఖ్యంగా ముగింపు కొత్తతరహాది. హీరో వగైరా సినిమా నిర్వచనాలు ఈ సినిమా పాటించలేదు. బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్‌లో కె. వి. మహాదేవన్ కొత్త బాట వేశారు.

'గొప్పవారి గోత్రాలు' అంతా కొత్త నటీనటులనే కాక చాలా మంది కొత్త టెక్నీషియనులను కూడా పరిచయం చేసింది. నాయికా నాయకుల మధ్య డ్యూయెట్ లేదు. మొత్తం చిత్రంలో ప్రెజెంటేషన్‌లో మరికొంత సంస్కారం, సున్నితత్వం వుంటే యింకా బాగా వుండేది.

1967 లోనే పూర్తిగా కొత్త నటులతో, పూర్తిగా పాత తారలతో పాత కొత్తల మేలు కలయికగా 'కన్నీరు – పన్నీరు' అనే చిత్రానికి అంకురార్పణ జరిగింది.

జానపదమైనా జీవితానికి దగ్గరగా వుండాలని సూర్యం

సాధారణంగా సాంఘిక చిత్ర కథలు మన జీవితానికి ఎంత దగ్గరగా వుంటే అంత జనాకర్షణ, ధనాకర్షణ పొందుతాయని సినిమా వర్గాలలో



"మంచికుటుంబం" లో నాగేశ్వరరావు, కాంచన

* * *

"ప్రేమకథ"లో కె. ఆర్. విజయ, రవిచందర్





"సతీ అరుంధతి" లో జమున, రోజారమణి

*

"సతీ అరుంధతి" లో గీతాంజలి





"సుఖ దుఃఖాలు"లో జయలలిత

సాధారణంగా అనుకొంటూ వుంటారు.

సామాన్య జనానికి కథ, కథా వస్తువు దగ్గరగా వుండాలనే సూత్రం ఏ చిత్రానికైనా వర్తిస్తుందని శ్రీ గిడుతూరి సూర్యం ఒక గోష్ఠిలో అన్నారు.

సాంఘికాలయ్యేది, జానపదాలయ్యేది, పౌరాణికాలయ్యేది వాటి పాత్రలు, వాటి మాటలు, చేష్టలు సామాన్యజనానికి చాలా దగ్గరగా వుండాలన్నారు.

ముఖ్యంగా హీరో సామాన్యవర్గం వాడయితే కథకు, చిత్ర విజయానికి ఎంతో కలసివస్తుందన్నారు.

జానపదాలైనా, పౌరాణికాలైనా వాటి పాత్రలమధ్య ఒక సంసార సంబంధం, బంధం, అనుబంధం, రాగ ద్వేషాలు, వాటన్నింటినిమించి బలమైన సెంటిమెంట్ వుంటే సామాన్య జనానికి పట్టేస్తుందని 'రణ భేరి' జానపద చిత్ర దర్శకుడు సూర్యం అన్నారు.


మాటకంటె పాట కష్టమని

కొసరాజు

ప్రేక్షకులనుంచి మెప్పు పొందడానికి మాటలకంటె పాటలకు ఇతరములైనవి ఎన్నో కలిసి రావా



"తిక్కశంకరయ్య"లో జయలలిత, రామారావు



"ఉమ చండీ గౌరీ శంకరుల కథ"లో రామారావు, బి. సరోజ

రని శ్రీ కొసరాజు ఈ మధ్య ఒక గోష్ఠిలో అన్నారు.

డైలాగు అయితే సందర్భం, సన్నివేశం ఏదైనా, హీరో అయినా, కమెడియన్ అయినా ఉన్నది ఉన్నట్టు అంటే డైలాగు శక్తిబట్టే ప్రేక్షకులనుంచిరియాక్షన్ వస్తుందని, కాని పాటకు రావాలంటే సందర్భము, సన్నివేశము, గాయకుడు లేక గాయకురాలు, నటుడు లేక నటి కూడి రావాలని అన్నారు. సాహిత్యందృష్ట్యా మంచిపాట వ్రాసినంతమాత్రాన లాభంలేదని పైవన్నీ కలిసిరావాలని అన్నారు.

అదృష్టవశాత్తు, తను వ్రాసేది ఎక్కువగా జానపద శైలి పాటలు కాబట్టి సులభంగా పాపులర్ అయ్యే అవకాశం వుంటుందన్నారు. అయినా తనపాటలో ఏ భాగం, ఏ మాట, ఏ ప్రయోగం ప్రేక్షకులకు బాగా నచ్చిందో తను వెయ్యికళ్ళతో చూస్తానని, వెయ్యి చెవులతో వింటానని 'పూలరంగడు' బుర్రకథ కవి అన్నారు.

సినిమాలో కళకోసం

పుస్తకాలలో అన్వేషణ

—బి. ఎన్. భలోక్తి

ఆ మధ్య మద్రాసులో రసావా వారు శ్రీ బి. ఎన్. రెడ్డిగారిని 'కళగా సినిమా' అనే అంశంపె ప్రసంగించమన్నారు. అంతట ఆయన



"చిక్కడు దొరకడు" లో జయలలిత

పెక్కు సమకాలిక చిత్రాల గురించి ఆలోచించసాగారు. కాని కళ అనేది ఏదీ కనిపించలేదట.

తాను పొరబడ్డానని ఒక మిత్రునికి టెలిఫోన్‌చేసి అడిగారట. "సినిమాలో కళ" గురించి చెప్పవలసిందని మరీ మరీ అడిగారట. "సినిమాలో కళ గురించి తెలుసుకోవాలీ అంటే ఈ కాలపు చిత్రాలు చూడబోకండి; పాత చిత్రాలపై పాత గ్రంథాలు చూడండి" అని ఆయన సలహా యిచ్చారట. అంతట శ్రీ బి. ఎన్. పాత గ్రంథాలలో సినిమాకళ గురించి తెలుసుకొన్నారట.

శ్రీ బి. ఎన్. రెడ్డి సినిమా సదస్సులో మాట్లాడుతూ పై విషయాలు చెప్పారు.

సిక్కింలో ఆదుర్తి

"కన్నె పిల్ల" హిందీ వర్షను సునీల్‌దత్‌కు తీస్తున్న శ్రీ ఆదుర్తి నవంబర్ అంతా, డిసెంబర్ మొదటి మూడు రోజులూ డార్జిలింగ్ మొదలైనచోట్ల చిత్రీకరణ సాగించారు. సిక్కింలోకూడా కొన్ని ఘట్టాలు చిత్రీకరించారు. దాదాపు నాథులా కనుమవరకూ వెళ్ళారు. కాని చిత్రీకరణకు అనుమతి లభించలేదు. సునీల్‌దత్ చైనాసైనికులను కళ్లారా చూశారు. అక్కడనుంచి ఆదుర్తి మద్రాసుకు వ్రాసిన మామూలు ఉత్తరాలు కూడా సెన్సార్ అయ్యాయి.

విజయభట్ "సినీ రామరాజ్యం"

వి. శాంతారామ్ రాజకమల్ కళామందిర్ పాతికేళ్ళ పండుగ జరుపుకొంటే ప్రకాశ్ పిక్చర్స్ వగైరా ఫేమ్ విజయభట్ పాతికేళ్ళ తర్వాత మళ్ళీ 'రామరాజ్య' తీశారు. రెండవది రంగులది. 'లవకుశ' కథ, స్క్రిప్టుపై శ్రీ చిత్తజల్లు పుల్లయ్యగారు అనధికారకీత్యా సలహాలు యిచ్చివున్నారు. ఈ హిందీ రంగుల లవకుశలో ఆ కవల పిల్లల భూమికలను నిజమైన కవల పిలలు—జయ, విజయులు—ధరించారు. వీరు కెమెరామన్ జి. బాలకృష్ణ తనయులు.

పాతికేళ్ళనాటి 'రామరాజ్య'లో వాల్మీకిగా నటించిన బద్రిప్రసాద్ నేటి చిత్రంలోకూడా అదే భూమిక ధరించారు. ఈయన ఒక్కరు తప్పితే పాతచిత్ర పాత్రధారులలో ఒక్కరూ కొత్తచిత్రంలో లేరు.

ప్రకాశ్ సంస్థలో 'వ్యజానీ'లో వైజయంతిమాల చేరగానే సంస్థ ఎంబ్లెమ్ (మోనోగ్రామ్) రూపాన్ని విజయభట్ మార్చివేశారు. వైజయంతిమాలతోనే మోనోగ్రాము వేశారు.

రెండు 'రామరాజ్య'లు తీసిన విజయభట్ సినిమాలో పేరుకోసమో, డబ్బుకోసమో చేరితే లాభంలేదని, సౌందర్యోపాసనతోనే అందరూ సినిమాలో చేరిననాడు నిజమైన సినిమా రామరాజ్యం అవతరిస్తుందంటారు. విజయభట్ మొదటి చిత్రం "నల్లదెయ్యం" (మూకీ.)



"కాంభోజరాజు కథ"లో విజయలక్ష్మి

"మంచి కుటుంబం"లో రెండు కుటుంబాలు

మధు పిక్చర్స్‌వారి 'మంచి కుటుంబం' నిజానికి రెండు కుటుంబాల గాథ. రెండు కుటుంబాలలోను మగపెద్ద నాగేశ్వరరావు నిర్వహించిన భూమిక. ఒక కుటుంబిని 'షావుకారు' జానకి, రెండవ కుటుంబిని కాంచన. ఇద్దరి భార్యల భర్త ఇద్దరి మధ్య నలగక, మానసిక సంఘర్షణకు గురై ఇంటా బయటా శాంతి నెలకొల్పిన విచిత్రగాథ. గంపెడు సంసారం అన్నది చాలదు. గంపన్నర సంసారంగాథ అది. డిసెంబర్ మాసంలో రీ రికార్డింగ్ పూర్తయి కొత్తసంవత్సరానికి కొత్త ప్రింటు తయారై సంక్రాంతికి ఆంధ్ర థియేటర్ల తలుపులు కొట్టదలిచింది. చిత్ర దర్శకుడు వి. మధుసూదనరావు. సంభాషణలు: ఆత్రేయ.

"రణభేరి" లో వేట, పతాక ఘట్టాలు

పి. యస్. ఆర్. పిక్చర్సు 'రణభేరి'లో డిసెంబర్ ఆరంభంలో రాజు, రాజ బాలకుమారుల వేట ఘట్టాలు, బాలసోదరులు విడిపోవటం మొదలైన సెంటిమెంటల్ ఘట్టాలు చిత్రీకరించారు. తదుపరి రాబట్ వంటి శక్తితో పతాక సన్నివేశ చిత్రీకరణకూడా జరిగింది. చిత్రనిర్మాత పింజల సుబ్బారావు. దర్శకుడు: గిడుతూరి సూర్యం. సంభాషణలు: టి. వి. మహారథి, సంగీతం: కోదండపాణి. కాంతారావు, రామకృష్ణ, రాజనాల, జయకృష్ణ, ధూళిపాళ, ఏడిద నాగేశ్వరరావు, రాజబాబు, వాణిశ్రీ, రాజశ్రీ, గీతాంజలి, డాక్టర్ ప్రభాకరరెడ్డి మొదలయిన వారు తారాగణంలో కలరు. జనవరిలోనే చిత్రం విడుదల కాగలదు.



"ప్రేమ కథ" లో కె. ఆర్. విజయ

పాపకోసం

విజయా & సురేష్ కంబైన్సు పతాకం క్రింద శరవేగంగా నిర్మింపబడుతున్న 'పాపకోసం' అనే సాంఘిక చిత్రం యిప్పటికి 8 రీళ్ళు పూర్తి అయింది. ఫిబ్రవరి నెలాఖరులోగా విడుదల చేయాలని నిర్మాత శ్రీ డి. రామానాయుడుగారి సంకల్పం. విజయా కంబైన్సువారు ఆంధ్రలో విడుదల చేస్తారు. ప్రెస్ పబ్లిసిటి : విజయ.

"సీ తా క ళ్యా ణ ం" సాంఘికం సుమా!

శ్రీ గణేశ్ ఫిలిమ్సువారు "సీతా కళ్యాణం" అనే సాంఘికచిత్రం తీయ బోతున్నారు. ఇది పూ ర్తి ఔట్ డోర్ చిత్రం. 'పాపికొండలు'లో చిత్రీకరణ జరుగుతోంది. సంజీవి, ముళ్ళపూడి, మహదేవన్, కె. నారాయణరావు చిత్రసారథులు.

బి. ఎన్. "బంగారు పంజరం"

'బంగారుపాప' అవార్డు చిత్ర దర్శక నిర్మాత శ్రీ బి. యన్. రెడ్డి 'బంగారు పంజరం' అనే సాంఘిక చిత్రం నిర్మించ బోతున్నారు. పాల గుమ్మి పద్మరాజు కథ మొదటి వర్షను త యా రు చే శా ర ని, జనవరిలో స్క్రిప్టు ఒక రూపానికి రాగలదని బి. యన్. చెప్పారు.

రామారావు చిత్రాలు

ఎన్. టి. రామారావు కొత్త తరహా భూమిక ధరించిన 'నిలువు దోపిడీ' షూటింగ్ పూర్తి అయింది. జనవరిలోనే విడుదల అవుతుంది. గి డు తూ రి సూ ర్యం దర్శకత్వం వ హి ం చే సీ తా రా మా ం జ నేయ పిక్చర్స్ సాంఘికంలోను, హైదరాబాద్‌లో తను తీయబోయే 'వరకట్నం', 'అల్లూరి సీతారామ రాజు' చిత్రాలలోను విశిష్టపాత్రలు నిర్వహించబోతున్నారు. 'తిక్క శంక రయ్య' చాలావరకు పూర్తిఅయింది. 'ఉమా చండి గౌరి కథ' సంక్రాంతి కానుక. జయంతీవారిది ఉగాది కానుక. చివరి రెండు చిత్రాల కవి శ్రీ పింగళి నాగేంద్రరావు.

నాగేశ్వరరావు చిత్రాలు

'బ్రహ్మచారి' నిర్మాణం దాదాపు పూర్తిఅయింది. ఏ. వి. ఎమ్. వారి చిత్రంలో నాగేశ్వరరావు పాత్రపై చిత్రీకరణ ఈ సంచిక వెలువడేసరికి ప్రారంభమౌతుంది. విజయాధినేత నాగిరెడ్డి చిత్రాలలో, ఏ. వి. ఎమ్. కలర్ చిత్రంలో, వి జ య భ ట్ మూ వీ స్ చి త్ర ం లో, 'అదృష్ట వంతులు'లో, మరికొన్ని చిత్రాలలో నటించబోతున్నారు.

"అ సా ధ్యు డు"

టై గ ర్ ప్రొడక్షన్స్ వారి ఈ చి త్ర ం లో కృ ష్ణ, కె. ఆ ర్. విజయ, రామకృష్ణ, ముక్కామల, సంధ్యారాణి, వాణిశ్రీ, చలం, బాల క్రిష్ణ, రమాప్రభ, ఉదయలక్ష్మి, టి.జి. కమలాదేవి, లక్ష్మీకాంతమ్మ, బేబీ రోజారమణి, జ్యో తి, పద్మలత, కో టీ శ్వ రి, విజయలక్ష్మి, రావి కొండలరావు, పహిల్వాన్ కాంతా రావు, సంతోష్‌కుమార్, పెరుమాళ్ళు, ఒ. యన్. ఆర్. ఆ ం జ నే యు లు, సీతారాం, వల్లం నరసింహారావు, టి. కనకం, నటిస్తున్నారు.

Edited and Published by V. V. Raghavaiah and Printed by him at Jyothi Printers, Congress officeRoad, Governorpet, Vijayawada-2.



JYOTHY Regd, No. H.368
January 68
నిలువు దోపిడీ
ంజులా వారి
చిత్రం...
నిర్మాత... U.విశ్వేశ్వరరావు, B.Sc.
దర్శకత్వం... C.S.రావు, B.A.(Litt)
K.V.మహాదేవన్